పత్రిక

ప్రశ్నలు



1-12-61


25 నయాపైసలు



శిల్పసుందరి

ఫొటో యస్ జి శేషగిరి (కోయంబత్తూరు)

మీ పిల్లలకు దగ్గుగాని రొంపగాని వచ్చినప్పుడు
నిజమైన స్వస్థత చేకూర్చుటకు




సిరోలిన్ 'రోష్' ఇవ్వండి

మీ పిల్లలయొక్క దగ్గును రొంపను ఉపేక్షించకండి. శీఘ్రముగా నిరపాయముగా నిజమైన స్వస్థత చేకూర్చే సిరోలిన్ ఇవ్వండి. అది చాలా సౌమ్యముగా పనిచేయును. మీ బిడ్డలు దాని రుచికి యిష్టపడుదురు. సిరోలిన్ మీకు కూడ ఎంతో మంచిది. అది దగ్గును ఆపడమే కాకుండా దగ్గుకు మూలకారణమగు హానికరమైన సూక్ష్మ క్రిములను నశింపచేయును. సిరోలిన్ గొంతు నొప్పిని ఉపశమింపచేయును. కఫమును నుసను పోగొట్టును, ఎంత బాధాకరమైన దగ్గునైనను శీఘ్రముగా పోగొట్టి స్వస్థత కలుగజేయును.



మీ గృహమందు సిరోలిన్ తప్పక ఉంచుకొనండి.

[WT-VT 2399] "రోష్" తయారు. సోల్ డిస్ట్రిబ్యూటర్సు: వాల్టాస్ లిమిటెడ



చకచకా పెరగాలి...,
చురుకుగా తిరగాలి...

ఏడాదిలో ఎన్ని విద్యలు నేర్చుకోవాలని! పాకాలి దేకాలి అడుగుల్లో వెయ్యాలి. ఆరోగ్యంగా — ఈ యేడాదిలోనే బరువు రెట్టింపు పెరగాలి. పాపాయి ఇన్ని పనులు సాధించి చక్కబెట్టాలంటే తలిదండ్రులు అడుగడుగునా ఆదుకోవాలి. అశ్రద్ధచేసి పాప ఆరోగ్యం దెబ్బతినకుండా చూడడం తలిదండ్రుల బాధ్యత.

ఇందుకు అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్శ్చర్ అన్నివిధాలా తగినదని డాక్టర్లు చెబుతున్నారు. అది హాయిగా ఉంటుంది. చక్కగా పనిచేసి ఫలితాలు చూపిస్తుంది. పాలపళ్లు మొలిచే వేళల్లో పాపల కేమాత్రం బాధ లేకుండా చూస్తుంది.

మీ పాపాయికి ప్రతి ఉదయం, అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్శ్చర్ ఒక టీ స్పూను పాటి పట్టండి. పాప తన పనులన్నీ చకచక చక్కబెట్టుకు చక్కగా పెరిగి తిరుగుతుంది.



అమృతాంజనము లిమిటెడ్‌వారి గ్రైప్ మిక్శ్చర్

తయారుచేయువారు :
అమృతాంజన్ లిమిటెడ్ 14/15, లజ్ చర్చి రోడ్, మద్రాసు-4
బొంబాయి-1, కలకత్తా-1, న్యూఢిల్లీ-1.

JWT/-AM-G-1417

ఉత్తరాలు

రాక్షసి బాంబులు

కౌతిక మానసిక వాతావరణాలు కలుషితంచేసే రాక్షసిబాంబులనుగూర్చి ప్రచురించిన చిత్రాలు, వ్యాసం చాల బాగున్నవి ఈ అస్త్రాలవల్ల కలిగే మారణహోమమూ, అణుశక్తితో లోకకల్యాణానికి ఉపకరించు విధమూ వివరిస్తూ ప్రతివారం ఒక వ్యాసం ప్రచురిస్తే బాగుంటుంది

ఎన్ ఆర్ గుళ్లపల్లి (హైదరాబాదు)

* * *

ఊఁమెన్ కార్టూన్‌లు

ఊఁమెన్‌గారి కార్టూనులు లేకపోవటంతో పత్రికకు కళ పోయింది వారి చెయ్యి కాలినందుకు నేను చాలా విచారిస్తున్నాను "అయ్యో! గరిట విరిగిపోయిందే" అనే కార్టూనులో గరిట రెండో ముక్క ఏమయినదో తెలియలేదు దయఉంచి కాస్త కూపీ తియ్య ప్రార్థన

వై వెంకటరామశాస్త్రి (పెద్దాపురం)

* * *

కాగితములమీద (బొమ్మలతో) శక్తివంతమైన బాణాసంచా కాల్చటమే గాక, యాభై మెగాటన్నుల అణ్వస్త్రాలను కాల్చగల్గి టపాకాయలు (నిజమైనవి) కాల్చేటప్పుడు చేయి కాల్చుకున్నందుకు శ్రీ ఊఁమెన్‌కు మా విచారము తెలియచేయండి రష్యా 50 మెగాటన్నుల బాంబు ప్రేల్చింది కదా, మనం టపాకాయలు కాల్చలేమా అనే ధీమా తో టపాకాయలు కాల్చిఉంటా రనుకుంటాము చిన్న టపాకాయే అంత ప్రమాదం అయితే యీ అణు బాంబు లెంత ప్రమాదమో కదా ? ఇటువంటి అనుభవాలు చూసి ఇకమీదటనైనా రష్యా, అమెరికాలు ఉన్మాదముతో ప్రేల్చే అణుబాంబుల పోటీ మానుకుంటాయని ఆశిస్తున్నాం! దానికోసము ఊఁమెన్‌గారు తమ వ్యంగ్యచిత్రములతో ఈ ఉద్యమము కొనసాగించి సఫలీకృతులగుటకు వారు త్వరగా కోలుకొనేటట్లు చెయ్యాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము ఈ ఉద్యమములో పాల్గొన్న బాపుగార్కి మా ధన్యవాదములు

చెవారి (విజయవాడ)

చదువు(లావు

17—11—61 పత్రికయందు సత్యమూర్తి గారి చదువు(లావు శీర్షిక చాలా ఆకర్షణీయంగా ఉంది కాని నాకొక చిన్న సందేహం అది ఏమిటంటే, ఆడపిల్లలు ఒకవైపునుంచి ఫీసు కట్టేస్తుంటే, మగవారంతా అలాగే ఉండిపోయారా, వచ్చి పోయేవారిని చూచుకుంటూ ?

టి దేవేంద్రనాథ్ (గుంటకల్)

* * *

వి. వి. రమణారావుగారు(విశాఖపట్టణం), 'చదువు(లావు' అనే శీర్షికకు ఆపేరు ఎందుకు పెట్టారని అడిగిన ప్రశ్నకు సమాధానంగా "మీరే ఆలోచించి చూడండి" అన్నారు అంటే అటువంటి తరహా వారికి అసలు చదువులు రావని మీ భావమా ? దయచేసి జవాబివ్వండి ఆ శీర్షిక చాలా బాగుంటోంది తప్పకుండా మా సందేహం తీరుస్తారని ఆశిస్తున్నాను

సంకురాత్రి శ్రీనివాసరావు (రాజమండ్రి)

మీరూ చెప్పగలిగే సమాధానం అదే.

* * *

కార్టూన్‌లు

20—9—61 నుండి ప్రతివారం ప్రచురిస్తున్న బాపుగారి కార్టూనులు యీపాటికి 8 అయిపోయాయి (8 వది కృష్ణకుమారి) ఈ వారం అంటే, 17—11—61 సంచికలో ప్రచురించిన కార్టూను నంబరు 9 అని ఉండవలసినది కాని కార్టూనులు 14 అని పి పుల్లయ్యగారిని ప్రచురించారు పొరపాటున ప్రచురించారా ? లేక ఉద్దేశపూర్వకంగానే ప్రచురించారా తెలిపేది

ఎం. సుందరేశ్వరరావు (పామిడి)

పొరపాటే.

* * *

హమేషా-తమాషా

"హమేషా—తమాషా" శీర్షికలో శ్రీ ఎం ఆర్. ఆమంచి, పి ఆర్. మంగా గారలు వ్రాసిన "గాదిలోన కందిపప్పు" పద్యం మమ్మల్ని పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వించింది 'హమేషా—తమాషా' శీర్షిక మా యింట్లోవారి నందరినీ తమాషాచేస్తోంది రచయితలకు మా అభినందనలు

కలిగొట్ల శ్యామసుందరరావు (కొందోపాడు)

* * *

సంగీత ప్రియుడు

"సంగీతప్రియుడు శ్రీ సంజీవయ్య" అన్న శీర్షిక చదివాను. చాలా బాగుంది

కాని, చిత్తూరునుంచి ఆంధ్ర ముఖ్యమంత్రి ఫియట్ కారులో వస్తూ "అందాల ఓమేఘమాలా", "ఓ ప్రియతమా! నను మరచిపోకుమా" అన్న పాటలు పాడారని, అది వారి సంగీతప్రియత్వాన్ని చాటుతుందని వ్రాసేకన్న వారు స్వంతంగా వ్రాసిన కొన్ని పద్యాలు ప్రచురించి, వారి సాహిత్యప్రియత్వాన్ని, కళాపిపాసని, కవితాపరిచయాన్ని నిరూపించిఉంటే పాఠకలోకం హర్షించేదేమో ?

మోహన్ (మద్రాసు)

* * *

సందేహం

శింగీతం లక్ష్మీకళ్యాణిగారు రచించిన" "స్వప్న వర్తకుడు" కథలో (42 పేజీ మొదటికాలం 12 వ చరణమందు) "కాలపు కెరటాల్లో మునిగిపోతున్న మా"బోటులను" రక్షించే పరమేశ్వరా !" అని ఉన్నది. ఇది పురాణకథ అయినను 'బోట్' అనేది పద మాకాలమున నుండెడిదా! సందేహమును తీర్చండి.

పి కుప్పుస్వామి (తిరుపతి)

మంచిసందేహమే! సమాధానం కూడా చెప్పమంటారా?

* * *

కథలు

"ఆదివిష్ణు"గారు వ్రాసిన "అనుబంధం—ఆంతర్యం" అను కథ మిగిలిన కథలన్నిటిలోకి నన్ను చాలా ఆకర్షించినది కథ చాలా బాగుంది. నిజంగా ఆకథ చదువుతుంటే నాకు తెలియకుండానే రెండు కన్నీటిబొట్లు రాలినవి రాంబాబు లాంటివారు ఈ లోకములో అనేకమంది ఉంటారనుకుంటాను

వజ్జా లక్ష్మీనారాయణరెడ్డి (వెందోడు)

* * *

"అనుబంధం—ఆంతర్యం" నా హృదయాన్ని కదల్చివేసింది, ముగింపయ్యాక, రెండు కన్నీటిబొట్లు, పుస్తకంపై పడ్డాయి రచన చాలా బావుంది

రమణ్ (కాకినాడ)

* * *

కట్న బాధితులు కథ బాగానే ఉన్నది కాని అందులో కట్నములవల్ల బాధపడినవారు ఎవ్వరూ లేనందున నాకు చాలా చింతగా ఉన్నది కట్న బాధితులను ఇద్దరినో, ముగ్గురినో రచయిత సృష్టించిన కథ ఇంకా ఇంపుగా ఉండెడిది

ఎం మల్లారెడ్డి (ఆదోని)

* * *

"కట్న బాధితులు" అనే కథలో తొలిచూపులోనే ఒకరిపై నొకరు అనురాగం పెంచుకొనియూ, తమ పెద్దవారి మూర్ఖపు పట్టుదలలకూ, కట్నదాహములకూ తలయొగ్గి, ఆ అనురాగవల్లరిని తమ హృదయంలో పాటుకొని వికశింపచేయను వీలులేక, సతమతమయ్యే నేటి నవనాగరిక యువతీయువకులకు, కథను కొత్త పంథాలో నడిపించి కళ్ళు తెరపించిన "రంగధామ్" గారు (రచయిత) చాలా ప్రశంశార్హులు

ఒకవైపు ఈ కట్నాల పిశాచాన్ని పారద్రోలేందుకు ప్రభుత్వం కృషిచేస్తున్నా ఇంకా బ్లాక్ మార్కెట్ జరిగే ఈ రోజుల్లో ఇలాంటి కథలు చాలా అవసరం

"మడపర్తి" (నెల్లూరు)

* * *

"చికీర్ష" కథయందలి "దెయ్యము" కల్పనమాత్రమేకాని, నిజముగా ఉండదని నా భావన. ఇందుకు మీ అభిప్రాయము ?

హెచ్ కె ఎస్ మూర్తి (కె ఎస్ హళ్ళి)

అభిప్రాయమే లేదు.

★

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు

ముఖచిత్రం :
వహీదా రహమాన్


విషయానుక్రమణిక

శుక్రవారం : 1-12-61
ప్లవనామ సం॥ కార్తిక బ॥ నవమి
సంపుటము : 54 సంచిక : 13
స్థాపితము:
1908
*
ముఖ్యసంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్
*
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
*
విడిప్రతి : 25 న. పై
సంవత్సర చందా : 13-0-0 రు.
*
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టివీధి, మద్రాసు-1

లోకంపోకడ



"మీ తీరు చూస్తే కాంగ్రెసువాదిలా నే ఉన్నారనుకోండి! కాని నేను మీకు ఓటు వెయ్యాలంటే మీరు కమ్యూనిస్టో, సోషలిస్టో, విప్లవవాదో, పెట్టుబడిదారో నిజంగా చెప్పాలి మరుండి."



టార్పెడో
కాపులు వెనుకబడిన వారని నిర్ణయించిన ప్రభుత్వం ఉత్తరువును శ్రీ పల్లంరాజుగారు ఖండించారు
రాజాజీ మాట వినండి!
అణ్వస్త్ర పరీక్షలు చేసినందుకు శ్రీ క్రుశ్చేవ్‌ను ప్రపంచాభిప్రాయం కోర్టు ముందు నిలదీయాలని రాజాజీ అన్నారు.
భారత - అమెరికా 'టెస్ట్ మాచ్'
అమెరికాలో నెహ్రూ తమ విధానాన్ని 'కాపాడు కున్నారు!'
రష్యాచైనాలు శాశ్వతంగా మిత్రులు.
వెనక అకత్తులెందుకో!

కాంగ్రెసు అభ్యర్థిత్వాలకోసం ఢిల్లీకి ప్రదక్షిణాలు: గుల్హాతీ సంఘం నివేదికవాయిదా అసలు రహస్యం

కౌండిన్య

కాంగ్రెస్ అభ్యర్థిత్వం రానివారికి ఢిల్లీ ప్రయాణం తగిలింది ఇలా రాజధాని సందర్శనార్థం వెళ్లే ఎన్నికల టికెట్ యాత్రికుల సంఖ్య పదుల్లో గాదు, వందల్లో ఉండట ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఈ బాపతువారు ఢిల్లీకి పరుగెత్తడం, వెళ్లినవారిలో—ఏ కొద్దిమందో తప్ప, అందరూ వట్టిచేతులతో బిక్కమొగాలు వేసుకుని తిరిగి రావటం మామూలు ఈసారి కూడా అందుకు భిన్నమేమీ ఉండదు

కాంగ్రెస్ అభ్యర్థిత్వంకోసం దాదాపు 1200 మంది దరఖాస్తులు పెట్టారు శాసనసభలో ఉన్నవి 300 స్థానాలు పోగా తతిమ్మా 900 మందికి టికెట్ ఇవ్వడం బ్రహ్మతరం కూడా కాదు కాబట్టి టికెట్టు రానివారంతా ఢిల్లీ పరుగెత్తుకువెళ్లి ఏం బావుకొగలరో తెలియదు పూర్వం ప్రదేశ్ కాంగ్రెసువారు, అందిన దరఖాస్తులలో తమకు అర్హులని తోచినవారికి సిఫార్సుచేసి, జాబితా పైకి పంపేవారు పైస్థాయిలో మార్పులకు కొంత అవకాశం ఉండేది ఈసారి అలాకాదు ముందే జాగ్రత్తపడి ప్రజాభిప్రాయసేకరణ అంటూ కొంత తంతు నడిపి, అంతా ప్రజాస్వామికంగా చేశామన్న అభిప్రాయం కలిగించారు అదీగాక ఇన్నాళ్లూ పరస్పరం కలహించుకుంటూ బజారున సైతం పడ్డ ఇరు వర్గాల నాయకులు ఏకమై, ఏకగ్రీవంగా చేసిన సిఫార్సు లివి వీటికి పై అంతస్థున ఉన్న భారత కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ సంజీవరెడ్డిగారి ఆశీర్వాదబలం కూడా ఉంది ఈ అన్ని కారణాలవల్ల కేంద్ర ఎన్నికల సంఘంవారు, సిఫార్సులలో కొన్ని తమకు నచ్చకపోయినా, వాటిల్లో వేలు పెట్టడానికి సాహసించకపోవచ్చు అట్లా వేలుపెడితే మాసిపోయిన కలతలను తిరిగి కెలికినవార మవుతామేమోనన్న భయం కలగటం కూడా సహజం

అయితే ముఖ్యమంత్రి ప్రభృతులు పంపిన ఆక్షేపణల సంగతి ఏమిటి ? ఆయనను త్రోసిరాజంటే వర్గకలహాలు తిరిగి అంకురించవా అన్న సందేహం రావచ్చు ముఖ్యమంత్రిని ఏనాడూ ఎవరూ కాంగ్రెస్‌లో ఒక వర్గానికి నాయకుడుగా పరిగణించలేదు ఒక వర్గానికి శ్రీ సంజీవరెడ్డి, మరోవర్గానికి అల్లూరి నాయకులని, వారిద్దరికీ తగాదా రావడంతో శ్రీ సంజీవయ్య ప్రాముఖ్యంలోకి వచ్చి ముఖ్యమంత్రి అయినారని అందరికీ తెలిసినదే ఇప్పుడు శ్రీ సంజీవరెడ్డి, అల్లూరి ఏకమవడంతో, శ్రీ సంజీవయ్య యథాపూర్వస్థాయికి దిగజారక తప్పదు కనుక శ్రీ సంజీవయ్య ఆక్షేపణలను, అభ్యంతరాలను కేంద్ర ఎన్నికల సంఘం, ఒక వర్గ నాయకుని ఆక్షేపణలుగా గాక, ముఖ్యమంత్రి ఆక్షేపణలుగానూ, లేదా వ్యక్తిగతమైన ఆక్షేపణలుగాను పరిగణించి పరిశీలిస్తుంది ఈమధ్య హైదరాబాదులో పత్రికా విలేఖరులు ముఖ్యమంత్రి ఆక్షేపణలు గురించి శ్రీ సంజీవరెడ్డిని ప్రశ్నించగా, పూరికే ఆక్షేపణలు తెలిపి ప్రయోజనం లేదు బలమైన కారణాలు చూపి, అవి సహేతుకమైనవిగా నిరూపించాల్సి ఉంటుంది అన్నారు నాయకత్రయంవారి సిఫార్సులు ఎంత బలీయమైనవో, ఎంత సహేతుకమైనవో శ్రీ రెడ్డి క్లుప్తంగానైనా చెప్పిఉంటే బాగుండేది. శ్రీ సంజీవయ్య, తన ఆక్షేపణలకు గల కారణాలను, తాను ప్రత్యామ్నాయంగా పేర్కొన్న అభ్యర్థుల అర్హతలను, నాయకత్రయంవారి సిఫార్సులలో గల లోపాలను సోదాహరణంగా పేర్కొన్నారు అవేవీ బలమైన కారణాలు కావన్నట్లు శ్రీ సంజీవరెడ్డి ఒక్క ముక్కలో కొట్టేశారు

అసలు రహస్యం, అల్లూరి ఎప్పుడైతే తనవాడైనాడో, అప్పుడు సంజీవయ్యపై, సంజీవరెడ్డికి పగ పెరగడం, ఆ పగ సాధించాలని కక్ష ఎక్కువ గావడం సహజం కనుక ఎన్నికల సంఘంలో, ఏవిధంగానైనా సంజీవయ్య ఆక్షేపణలు అంగీకరింపబడకుండా ఆయన అడ్డుకొనడం తప్పదు అధిష్ఠాన వర్గంలో తనకుండే పలుకుబడిని బట్టి, ముఖ్యమంత్రి ఏవో కొన్ని ఆక్షేపణలనైనా సాధించగలిగితే నిజంగా గొప్పే ననాలి

ఇక వెనుకబడ్డ వర్గాల గోడు తీర్చడ మన్నది కూడా శ్రీ సంజీవయ్య ఆక్షేపణలకు లభించే గౌరవ మర్యాదలనుబట్టే ఉంటుంది శ్రీ నెహ్రూకు, ఈ వెనుకబడ్డ వర్గాల కోర్కెలంటే కొంతవరకు చిరాకు ఉన్న సంగతి తెలిసినదే ఆమధ్య మధుర ఎ ఐ సి. సి కి వెడుతూ హైదరాబాదులో ఆగినప్పుడు, వెనుకబడ్డ వర్గాలవారు కొందరు వెళ్లి విన్నవించుకోగా, ప్రధానమంత్రి చివాట్లుపెట్టి పంపిన సంగతి జ్ఞాపకం ఉండే ఉంటుంది పోతే వీరి నాయకుడు శ్రీ జగ్జీవనరాం అధిష్ఠానవర్గంలో ఒకరు గాబట్టి, ఏదైనా న్యాయం జరగాలంటే ఆయన ద్వారానే జరగాలి అదీ ఎంతవరకు సాధ్యమో ఎవరూ చెప్పలేరు

మహిళల సంగతి . వీరు కూడా కొందరు ఢిల్లీ పరుగెత్తుకు వెళ్లారు జనాభాలో తాము సగం వరకూ ఉన్నామని, ఆ దామాషాన శాసనసభలో సగం స్థానాలు గాకపోయినా, నూటికి 15% వంతులు, అంటే సుమారు 45 స్థానాలు ఇవ్వాలని వీరి కోర్కె. ఈ 15% దామాషా ఏమిటో తెలియదు అయినా, మిగతా పార్టీలతో పోల్చితే కాంగ్రెస్ పార్టీయే స్త్రీలకు ఎక్కువ స్థానాలు ఇచ్చి, దాదాపు 15% మందిని అభ్యర్థులుగా నిలబెట్టుతోందని, అభ్యుదయగామి అనుకునే కమ్యూనిస్టు పార్టీ ఒకే ఒక మహిళను—అదైనా పార్లమెంటుకు—ఎంచిందని, స్వతంత్రపార్టీ కూడా ఆట్టే మందిని నిలబెట్టదని చెప్పి, మహిళల వాదాన్ని కేంద్ర ఎన్నికల సంఘం తేలికగా కొట్టివేయటం జరుగుతుంది

ఏతా, వాతా తేలేదేమంటే, వందల సంఖ్యలో ఈ ఢిల్లీ యాత్ర కేవలం చేతిచమురు భాగవతమని, ఏమాత్రం ఉపయోగం ఉండదని ఆ సంగతి కాంగ్రెస్ అధ్యక్షులు మొన్న ఈమధ్య చెప్పనే చెప్పారు నాయకత్రయం వారి సిఫార్సులు క్షేమంగా ఉన్నవనీ నూటికి 95 వంతులు మార్పులుండవు అని స్పష్టం చేశారు అంటే తతిమ్మా ఐదు స్థానాలు మార్పు లుంటా యనుకొంటారేమో, కాదు ఆ ఐదు స్థానాలు నాయకత్రయం వారు ఏకగ్రీవంగా అభ్యర్థుల్ని సిఫార్సు చేయలేకపోయిన స్థానాలు శ్రీ సంజీవరెడ్డి సలహాపై అగ్రనాయకులు భర్తీచేసే స్థానాలు. అంతకు మినహా ఏమీ ఉండదు కేంద్ర ఎన్నికల సంఘం వారికి, రాష్ట్ర ఎన్నికల సంఘాల జాబితాలు మార్చాలనే ఉద్దేశ్యం లేదని, వీలైనంతవరకూ ఆ జాబితాలు ఖరారు చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నారని, పశ్చిమ బెంగాల్ అభ్యర్థుల జాబితా విషయమై వారు చేసిన నిర్ణయంవల్ల విదితమవుతోంది

* * * *

గుల్హాతీ సంఘం కేంద్ర ప్రభుత్వం కోరినట్లుగా ఈ నెలాఖరుకు నివేదిక సమర్పించలేదని, ఇందుకు కనీసం ఇంకో రెండు మూడు నెలలైనా పడుతుందని, ఈలోగా మరొకమారు మన రాష్ట్రానికి రానున్నారని అభిజ్ఞులు చెబుతున్నారు ఈ సంఘం ఇప్పటికి రెండుమార్లు మన రాష్ట్రాన్ని సందర్శించింది. క్రిందటిమాటు వచ్చినప్పుడు రాష్ట్రంలో వారం రోజులపాటు దాదాపు రెండు వేల మైళ్లు పర్యటించి, వివిధ ప్రాజెక్టు స్థలాలు స్వయంగా చూచారు ప్రజా నాయకులను, ప్రభుత్వ ప్రతినిధులను, ఇంజనీర్లను కలుసుకుని మాట్లాడారు అయినా, వారికీ సమస్య అంతు బట్టలేదన్న భావం కలుగుతోంది నిజానికి ఈ ప్రాజెక్టులకు, ప్రవాహపు కొలతలకు సంబంధించి ఇంజనీర్లు తయారుచేసిన లెక్కలు అద్దంలోలాగా స్పష్టంగా కన్పిస్తున్నప్పుడు విషయం అంతు బట్టకపోవడం గాని, ఇన్నిమార్లు రాష్ట్రాన్ని సందర్శించాల్సిన అవసరం గాని ఉండదు సమస్యను సూటిగా పరిశీలించి పరిష్కారానికి పూనుకుంటే, పరిష్కారం వెంటనే కుదరకపోయినా, కనీసం అది సులభసాధ్య మయ్యే మార్గమైనా కన్పించకపోదు. కాని ఇక్కడ ఈ సమస్య పరిశీలనే విచిత్రంగా ఉంది వాస్తవ పరిస్థితులకు విరుద్ధమైన ఏదో ఒక ఉద్దేశ్యాన్ని మనస్సులో పెట్టుకొని, దాన్నెలాగైనా సాధించాలని ప్రయత్నిస్తున్నందువల్లనే

(60-వ పేజీ చూడండి)



వివశువు 'హావిస్'

ఆదివారం సాయంత్రం. పబ్లిక్ గార్డెన్సు ఇంద్ర ధనస్సులా వెలిగిపోతోంది. హెల్త్ మ్యూజియం ముందున్న పచ్చికమీద ఒంటరిగా కూచున్న ప్రసాద రావు, సాయంసంధ్యాకాంతుల్లో నవనవోన్మే షంగా వెలిగిపోతున్న ప్రకృతినీ, ఆమె ప్రతి విధుల్ని గమనిస్తూ! తనలో తాను అనుకున్నాడు "తన ఈ ఆనందాన్ని పంచుకునేవారు వుంటే?" అని మరుక్షణాన అతనికే నవ్వొచ్చింది తల వాటించి ఒక గడ్డిపరక తుంచి ముక్కలు చేస్తూ చుట్టూ చూశాడు

ప్రసాదరావులాగే ఒంటరిగా అనతిదూరంలో కూచునివున్న ఒక స్త్రీ అతనికంట పడింది జవ్వని ఆమె. . . .

అయిదు నిముషాలు ఆలోచించగా ఆమె ఎవరో గుర్తొచ్చింది ప్రసాదరావుకి ఆమె పేరు సరస్వతి. సూర్యారావుగారి యింట్లో వారి పుత్రుడు రాంబాబుకి చదువు చెబుతోంది అక్కడే అత డామెను చూశాడు రెండు మూడు సార్లు

ప్రసాదరావుకి ఆమె గాథ విన్నాక ఆమెతో పరిచయం చేసుకోవాలనే అభిలాష కలిగింది ఒంటరిగా ఈ మహానగరానికి వచ్చి, కేవలం స్వశక్తిపై మంచితనం ఆధారంగా, గౌరవప్రదంగా నెగ్గుకురావడం అంటే సామాన్యంకాదు అంతటి లేతవయస్సులో అంత గొప్ప బాధ్యతను వహించ గల స్త్రీలను గురించి చదవటమేగాని, చూసివుండని ప్రసాదరావు ఆమెతో పరిచయం వాంఛించ డంలో అబ్బురమేమీలేదు ఆ క్షణాన అతనికి ఒక నిశ్చయం కలిగింది చివాలునలేచి ఆమెదగ్గరకు వెళ్ళి, అయిదారు అడుగుల దూరంలో పచ్చికమీద కూలబడి, "క్షమించండి! మీ పేరు సరస్వతికదూ?" అన్నాడు

ఆమె నివ్వెరపోలేదు నవ్వి, "ఆ సంగతే ఇందా కటినుంచి ఆలోచిస్తున్నారా?" అన్నది

ప్రసాదరావు సహజ మందహాసవదనంతో "నిజమే" అన్నాడు ఒక్కక్షణం ఇద్దరూ మౌనంగానే కూచున్నారు

"సూర్యారావుగారు మీకు బంధువులా?" అన్నది సరస్వతి ఆ తరువాత

"బీరకాయపీచు ఏదో ఉందనుకోండి అంత కన్నా మా నాన్నగారికీ వారికీవున్న స్నేహమే

(54-వ పేజీ చూడండి)

శ్రీయుతులు హావిస్, ఆదివిష్ణు, సింగరాజు రామచంద్రమూర్తి వీరు ముగ్గురూ 'వివశువు' అనే సంయుక్తరచన పంపారు. దానిలో మొదటిభాగమే ఇప్పుడు ప్రచురిస్తున్నాము. తరువాతి సంచికలలో శ్రీ ఆదివిష్ణు, శ్రీ సింగరాజు రామచంద్రమూర్తి వ్రాసిన భాగాలు వరుసగా ప్రచురిస్తాము. మాకు తెలిసినంత వరకూ ముగ్గురు కలిసి ఇటువంటి రచన చేసి పంపడం ఇదే మొదటిసారి. వారికి మా అభినందనలు!

కథ కాని కథ

తాతయ్య తెలివి

(మొదటి బహుమతి రు. 10 లు)

ఈమధ్య మేము దసరాపండుగకు ఇంటికి వెళుతున్నప్పుడు రైలులో జరిగిన సంఘటన ఇది. మేము నరసరావుపేటలో రైలెక్కి, మార్కాపురం వెళ్లుతున్నాము. మాతో కూడా, ఒక ముసలాయన, అతనికూతురు, మూడుసంవత్సరాల పాపాయి ఎక్కారు. వారివద్ద ఒక సామానుల మూటమాత్రం వుంది. బహుశా వారు "కుండ్లకమ్మ" స్టేషన్‌లో దిగాలి కాబోలు. రైలు వినుకొండ స్టేషన్ వదలినప్పటినుండి సిద్ధపడుతున్నారు.

ముసలాయన, "సీతమ్మా" అని పిలిచి, "రైలుస్టేషన్‌లో అట్టే సేపాగదు, రైలాగగానే ముందుగా దిగి నే కిటికీవద్దకురా. బుజ్జాయిని, మూటా అందిస్తాను" అన్నాడు.

"అలాగే, నాన్నా." అని సీతమ్మ తలుపుదగ్గరకెళ్లింది.

స్టేషన్ ఒకమైలుదూరముండగానే, రైలుఅకస్మాత్తుగా ఆగిపోయింది. అప్పటికి తెల్లవారుజామైనది మేము ఒకరి ముఖాలు ఒకరము చూచుకొంటున్నాము. ముసలాయన, సామానులమూటను క్రిందకి విసిరేసి, పాపాయిని అందించడానికి సిద్ధంగా వున్నాడు.

"నాన్నా ఇది స్టేషన్ కాదే, రైలు వంతెన మీద ఆగింది", అని సీతమ్మ పాపాయిని తీసుకొంది. ముసలాయన, తాను చేసినతప్పును సమర్ధించుకొంటూ. "తెలివైన వాణ్ణి కాబట్టి, పాపాయిని రక్షించాను, లేకపోతే, దీన్నికూడా ఏటిలోకి వేసేవాణ్ణి" అన్నాడు.

"మల్లెల" (హైదరాబాదు.)

* * *

వాచర్ దుస్థితి

(రెండవ బహుమతి రు. 5 లు)

నేను హెచ్. యస్. సి. పరీక్షకు వ్రాస్తున్నాను తలవంచుకొని. నాచేయి నెవరో పట్టుకున్నట్లయింది. తలెత్తి చూశా! వాచర్. నా చేతి మడతలోంచి ఏదో కాగితంతీశాడు. లేచి నిలబడా ఎక్కడిదన్నా ఇది అనుకుంటూనే. కాగితం విప్పి చూసుకున్నాడు వాచర్. నావైపు కుర్రుగా చూస్తూ వరవర బైటికివెళ్ళి చీఫ్ వాచర్ ను పిలుచుకొచ్చాడు. ఆ చీఫ్ వాచర్ చేతిలో ఉంది కాగితం. ఆయన వస్తూనే "ఏమోయ్ టీచర్లనిలా అవమానపరిస్తే నీకేమవుతుందో తెలుసా! అన్నాడు నేను దిక్కుమొగం వేశా. "ఏప్రెల్ ఫూల్ అని వ్రాసి వాచర్ కే మధ్య పెడతావా" అన్నాడు. గదంతా ఘొల్లుమంది. నేను నవ్వు ఆపుకుని, ఆ కాయితం ఇప్పించుకుని "చూడండి సార్! ఇది నా దస్తూరి కాదు" అని చెప్పి చూడగా చీఫ్ వాచర్ ఒప్పుకొని వెళ్ళిపోయాడు ఇహ చూసుకోండి వాచర్ అవస్థ! తాళలేక బయటికివెళ్ళి ఇంకొక వాచర్ ను పంపించాడు.

కె. వి. రావు (హైదరాబాదు)

* * *

అన్నమాట!

(రెండవ బహుమతి రు. 5 లు)

అవి మేము నాలుగవతరగతి చదివేరోజులు. మా క్లాసులో రవి అనే పిల్లవాడొకడుండే వాడు. వాడు మాకందరకు కథలు వాళ్ళ బామ్మదగ్గర చెప్పించుకొనొచ్చి చెప్పే వాడు. వాడు కథ చెప్పేటప్పుడు "అన్నమాట," "అన్నమాట" అని ఉపయోగించే వాడు ఒకరోజు పిల్లలందరం మా ఇంటిలో కూర్చొని వాడు కథ చెప్తాంటే వింటున్నాము. కథ మంచి పట్టులో ఉంది. ఎవరికి వారు నిశ్శబ్దంగా ఉండి వింటున్నారు. ఇంతలోకి వాడి తమ్ముడు అకస్మాత్తుగా లేచి "ఏరా ఎప్పుడూ అన్నమాటే గాని, నామాట చెప్పవేరా" అని బుంగమూతి పెట్టి అడిగాడు. దానికి అక్కడున్న మేమంతా ఘొల్లున నవ్వాం. వాడు సిగ్గుపడిపోయాడు.

వై. సుందరరావు, (నెల్లూరు).

* *


"పెద్ద చికాకు"

(రెండవ బహుమతి రు. 5 లు)

అవి మేము కెమిస్ట్రీ 'అనర్సు' చదివే రోజులు. మా క్లాసులో రాజు అనే అబ్బాయి ఉండేవాడు. ఒకరోజున 'ఎక్స్పెరిమెంట్' చేస్తూ సెన్కుమీద 'ఎసిడ్' (ఆమ్లము) ఒలక బోశాడు. ఒలక బోశాడే గాని, వెంటనే కుర్రం ఆశ్చర్యకరంగా చూస్తున్నాడు. ఇదిచూసిన మా లెక్చరరు అతనిని మందలించాడు. ఆయనంటే సాధారణంగా అందరికీ హడలు. అంతేకాక రాజు పిరికి వాడని ప్రతీతి. అటువంటి రాజు ఆయనమీద తిరగబడి, ఇలా ప్రతి వానికీ మందలిస్తే తను చదువుకునేందుకు వీలుండదని, ఎగిరాడు. మేమందరం ఏం జరుగుతుందా అనుకున్నాం. లెక్చరర్ గారు కిక్కురుమనకుండా వెళ్ళిపోయారు. రాజు విసుగ్గా చేస్తున్న పని ఆపి, లైబ్రరీలో వెళ్ళి కూర్చున్నాడు. నేను వెంటవెళ్లాను, ఇదంతా ఏమిటో తెలుసుకుందామని. నావెంటే లెక్చరర్ గారు రావటం గమనించలేదు. రాజు తల వంచుకుని కూర్చొని ఉన్నాడు. ఆయన అతని దగ్గరకెళ్లి, "రాజూ, ఏమిటి? ఏమిటి జరిగింది?" అని అడిగాడు.

"ఏమిటి, సార్! చాకలివాడు ఈరోజు బట్టలు తీసుకొస్తానని ఎగ్గొట్టేస్తే..." అన్నాడు రాజు కోపంగా.

కె. వెంకట్రావు, (మద్రాసు.)


నమస్కారమండి లైబ్రరియన్‌గారూ మనకాలేజీ లైబ్రరీ బిల్డింగ్ రేపే కదండి ఓపెన్ చేయించేది
నువ్వు చాలాశ్రమ పడి పోతున్నావోయ్ అన్నీ అరేంజిమెంట్లూ అయి పోయాయా?
అయ్యాయండి. కొత్త బిల్డింగ్‌కి దిష్టి తగలకుండా దిష్టిబొమ్మని కూడా పెట్టించాను. ఎలా ఉంది సార్ బొమ్మ!

ఈ వారం సినీవిహారం

మధుమూర్తి

కొత్త సంవత్సరం కొత్త పంటలు ఇల్లు చేరటానికి కోతలు కూర్పిళ్ళు, ఎగబోతలు, బంతి కొట్టుళ్ళు ముమ్మరంగా దేశంలో సాగుతుండే రోజులొచ్చిపడిపోయాయి అదే జోరులో మదరాసు చిత్రలోకంలో ఆఖరి కాల్‌షీటు, ఔట్‌డోర్ షూటింగులూ పేక్‌వర్క్, ఎడిటింగు నెగిటివ్ కోతలతో సెన్సార్ నోము నోచుకుని, ఆ అడ్డం తీసిందనుకున్నాక రీ రికార్డింగ్ మేళా, విడుదల సన్నాహాల ప్రచారంలోకి నిర్మాతలు అడుగు పెడుతున్నారు కొత్త పంటను దెం ఎమిటకు పంపటానికి

1961 వెళ్ళబోయే పీడు, 1962 వచ్చే జియుగులతో ఉగయించే వర్షసంధి ఈనెల— ఎప్పుడూ సందడిగానే ఉంటుంది సంక్రాంతి ఎదురు సరదా చాలామంది నిర్మాతలలో ఉబుకుతూ ఉంటుంది ఈ వేనెటీగ తొందర లక్షణం ఈ నెలలోనే ఎక్కువగా కనబడుతుంది

ఇప్పటికి తమ చిత్రాలను జనవరి నెలలో విడుదల చేయాలనే సత్సంకల్పం గల నిర్మాతలు నలుగురు కనిపిస్తున్నారు వారు అన్నపూర్ణా, జగపతి, జాగృతి చిత్ర ఎన్ ఎ టి నిర్మాతలు

"అన్నపూర్ణా ప్రొడక్షన్స్"

అన్నపూర్ణావారు తమ ఎనిమిదో చిత్రానికి కావలసిన ఔట్‌డోర్ దృశ్యాలను అక్టోబరు 26నుంచి నవంబరు 6 వరకు హైదరాబాద్‌లో చిత్రీకరించారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యపట్టణంలోని ఉస్మాన్‌సాగర్, కిద్వాయ్ గార్డెన్స్, రిట్జ్ హోటల్, పబ్లిక్ గార్డెన్ రోడ్ వెనుకనున్న హ్రోల్‌బంక్ ఫయఖాద్దీన్ బంగళా బహార్లగాలు ఈ చిత్రంలో కనిపిస్తాయి

పన్నెండు రోజులపాటు అక్కడ జరిగిన షూటింగులో ఆరు దృశ్యాలు రెండు పాటలు చిత్రీకరించబడ్డాయి ఈ సన్నివేశాల్లో నాగేశ్వరరావు, రాజసులోచన, నాగేశ్వరరావు, ఇ వి సరోజ, గుమ్మడి, శారద, పార్వతి, అల్లు రామలింగయ్య, కె వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ నటించారు

హైదరాబాద్ నుంచి తిరిగి రాగానే వీరు నవంబరు 16వ తేదీన ఒక పాట రికార్డు చేశారు 19వ తేదీన వాహినీస్టూడియో ఆవరణలో నాగేశ్వరరావులు నటించిన కారు ప్రమాదానికి చెందిన షాట్స్ షూట్ చేశారు ఈ చిత్రానికి దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు కెమెరా: సెల్వరాజ్ సంగీతం: ఎస్ రాజేశ్వరరావు నిర్మాత డి మధుసూదనరావు


ఆరాధన

ఒక చిత్రంలో తారాబలగం అంతా ఏక సమయాన ఒకే సెట్‌పై కనిపించారా అంటే ఆరోజు ఆ చిత్రంలోని ఆఖరు సన్నివేశాల చిత్రీకరణ సాగుతుందనే అనుమానం కలుగకపోదు. ఎందుచేతనంటే సాధారణంగా తెలుగు చిత్రం అందరి నటుల క్లైమాండ్ వాక్యాలతో (గూడే

(49-వ పేజీ చూడండి)

అంతర్జాతీయ చలనచిత్రోత్సవానికి వచ్చిన విదేశీ ప్రతినిధులకు మద్రాసు విమానాశ్రయంలో స్వాగతం చెప్పిన తారలు:
విజయలక్ష్మి, సంధ్య, జమున, [illegible]





పారిశ్రామిక ప్రదర్శనావరణం ప్రధాన ద్వారం

భారతీయ పారిశ్రామిక ప్రదర్శనం విశేషాలు

శ్రీ కృష్ణ

ప్రపంచంలో ఇంతవరకు ఏర్పాటైన పెద్ద ప్రదర్శనలలో ఒకటిగా పేర్కొనదగిన పరిశ్రమల ప్రదర్శనను డా. రాధాకృష్ణన్ ఇక్కడ ఆవిష్కరించారు. ఇందులో భారతీయ పరిశ్రమలు కాక, తొమ్మిది విదేశీ ప్రభుత్వాలు పాల్గొంటున్నాయి వీటిలో అమెరికా, బ్రిటన్, పశ్చిమ జర్మనీ, రష్యాలు కూడా ఉన్నవని వేరే చెప్పనక్కరలేదు

మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలద్వారా సాధించిన అభివృద్ధిని భారతీయ 'విభాగం' చూపుతుంది.

బ్రిటిష్ 'గుడారం' లో (పెవిలియన్) "భారతీయ పారిశ్రామికాభివృద్ధి కృషిలో బ్రిటన్ భాగస్వామ్యం" ఎంతగా తోడ్పడింది ప్రముఖంగా ప్రదర్శిస్తున్నారు రోడ్డు రవాణా, రైలుమార్గాలు, నౌకా విమానయానాలలో బ్రిటన్ భారతదేశానికే విధంగా సహకరిస్తున్నదీ తెల్పే నమూనాలు ఉన్నాయి. వీటిలో ఒక నౌక బొమ్మ గమనించతగినది ఇది 1825 లో మొట్టమొదటిసారిగా ఈ దేశం చేరిన ఒక 'ఆవిరి ఓడ' (స్టీమ్ షిప్) చిత్రం ఇదికాక 'హార్బర్ల' లో, లారీ మోటారుబండ్ల నిర్మాణంలో, విమానాల నిర్మాణం, అమ్మకంలలో ఈ రెండు దేశాలూ కలిసి చేసే కృషిని వివిధ ఛాయా చిత్రాలవల్లా, నమూనాలవల్లా చూపిస్తున్నారు

పరిశ్రమలలోనే కాక, ఆర్థికంగా బ్రిటన్ భారత దేశానికి ఏవిధంగా తోడ్పడుతున్నదో తెలుపటానికి "ఆర్థిక భాగస్వాములు" అన్న విభాగంలో వివరాలు కనిపిస్తాయి మూడవ పంచవర్ష ప్రణాళికకు బ్రిటన్ ఇప్పటికే 118 66 కోట్ల రూపాయలు అప్పు ఇవ్వటానికి ఒప్పుకుంది దుర్గాపూర్ ఉక్కు కర్మాగారానికీ, అస్సాం నూనె గొట్టాలకు ఇచ్చిన అప్పు వివరాలు చూడగానే అర్థం అయ్యేట్లు ప్రదర్శించారు

"సమాచార సదుపాయాలలో భాగస్వామ్యం" అనే విభాగంలో వార్తాపత్రికలు, తంతి, తపాలా, టెలిఫోన్, రేడియో మొదలైన వివిధ సమాచార సాధనాల ఛాయా చిత్రాలు, యంత్ర పరికరాలు ప్రదర్శించారు ప్రప్రథమంగా ఏర్పడిన టెలిఫోన్ ఎక్స్చేంజి యంత్రపరికరాల ఛాయా చిత్రాలు, వార్తాపత్రికలు, తపాలాబిళ్లలు, టెలివిజన్ కెమెరా ఇత్యాదులు ఇక్కడ ఉన్నవి

"ఆరోగ్యాభివృద్ధి కృషిలో భాగస్వాము" లనే సంగతి నిరూపించేందుకు నెలకొల్పిన విభాగంలో మద్రాసులో స్థాపించిన క్షయవ్యాధి చికిత్సా కేంద్రం చిత్రం ప్రముఖంగా కనబడుతుంది

ఈ శాఖలో ప్రేక్షకులకు తెలిపే వివరాలలో కొన్ని (1) భారతదేశం 1959 లో చేసుకున్న దిగుమతుల ఖరీదు 895 43 కోట్ల రూపాయలు (2) ఇందులో రు 172 72 కోట్లు విలువగల సరుకులు బ్రిటన్ నుంచి వచ్చాయి. (3) బ్రిటన్‌కు మనం చేసిన ఎగుమతుల విలువ రు 167.64 కోట్లు (మొత్తం ఎగుమతులు 618 71 కోట్లు.)

"ఉత్పత్తిలో భాగస్వాములు" అనే విభాగంలో భారతీయ పరిశ్రమలకు బ్రిటన్ సరఫరా చేసిన యంత్రాల నమూనాలు, ఫోటో ఛాయా



పారిశ్రామిక ప్రదర్శనంలో అమెరికన్ "మెర్క్యురీ" వ్యోమనౌకను పరిశీలిస్తున్న భారతీయ నిపుణుడు

చిత్రాలు ప్రదర్శించారు "విజ్ఞానం" ఏవిధంగా రెండు దేశాలూ పంచుకుంటున్నవో తెలిపే వివరాలు మరొకచోట చూడవచ్చు ఢిల్లీలో స్థాపించిన 'ఇంజనీరింగ్ కాలేజి' దానికి ఉదాహరణ


అమెరికా, ప్రపంచంలో ఇంతవరకూ ఎక్కడా ఏర్పాటుచేయనంతటి పెద్ద పారిశ్రామిక ప్రదర్శన ఇక్కడ ఏర్పాటు చేసింది 'శ్రమికీ మేలా' బంగారువర్ణం అర్ధగోళాకార గుడారాల క్రింద 40 ప్రదర్శనల పైగా ఉన్నాయి వీటినిబట్టి అమెరికాలో జరుగుతున్న అభివృద్ధి ఎటువంటిదో గ్రహించవచ్చు.

అంతేకాక అమెరికన్ విభాగంలో యంత్రాలు నిజంగా పనిచేస్తాయి అంటే ఉత్పత్తి జరుగుతూ ఉంటుందన్నమాట ఆధునిక యంత్రాలు పనిచేసే విధానాలు జనానికి కొంతమట్టుకు తెలుస్తుంది నాగళ్ళు, చిన్న ట్రాక్టర్లు, పాత కారు ఇంజన్లను క్రొత్తవిగా చేసే విధానాలు, ఇవికాక మరెన్నో ఆధునిక యంత్ర ప్రదర్శనలు ఇక్కడ చూసే అవకాశం ఉంటుంది

శాస్త్రం, విజ్ఞానం, పరిశ్రమలకు ఏవిధంగా తోడ్పడుతున్నదీ తెలుసుకొనవచ్చు చక్రాలులేని కారు, పాఠాలు నేర్పే యంత్రాలు, మనుష్యులు అక్కరలేని వాతావరణ పరిశోధన కేంద్రాలు, అంతరిక్షయానానికి సంబంధించిన ప్రదర్శనలు ఇక్కడ ముఖ్య ఆకర్షణలు 500 మైళ్ల పైనుంచి టెలివిజన్ ద్వారా భూమిని చుట్టిఉన్న మేఘ మండలం (క్లౌడ్ కవర్) చిత్రాలు పంపే టైరోస్ నమూనా ఇక్కడ చూడవచ్చు

పశ్చిమ జర్మనీ శాఖలో రెండు పెద్ద 'హాలు' లలో ప్రదర్శనలు మాత్రం 23,140 చ అడుగులు ఆక్రమించుకున్నాయి ఇవికాక ఒక బయలు ప్రదేశంలో వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శనలు వేరే చూడవచ్చు ఇందులో మొత్తం అరవై జర్మన్ కంపెనీలు పాల్గొన్నాయి

రష్యా శాఖలో, ఆ దేశంలో మొత్తంమీద జరుగతున్న అభివృద్ధిని తెలిపే ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వివిధ యంత్రాలు, పనిముట్లు, మోటారు కార్లు వగైరా ఇక్కడ చూడవచ్చు. వచ్చే ఇరవై సంవత్సరాల ప్రణాళికల వివరాలు అందరికీ అర్థమయ్యేట్లు ఏర్పాటుచేశార ★



పారిశ్రామిక ప్రదర్శనం ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన. ఈ ప్రదర్శనంలో 18 దేశాలు పాల్గొంటున్నాయి.


మనమూ మనదేహస్థితి

డా॥ గాలి బాలసుందరరావు

డువోడినం

గత వారములలో జఠరాశయం నిర్మితిని గురించీ, ఆ ఉపాంగములో ఆ యా ప్రదేశములలో జరిగే జీర్ణ క్రమమును గురించీ కొద్దిగా తెలుసుకున్నాము అజీర్ణం అనేక వ్యాధులకు మూల కారణం జీర్ణకోశం సరిగా వున్నంతవరకు ఇతర వ్యాధులు వచ్చినా, దానిని ప్రతిఘటించే శక్తి శరీరానికి వుంటుంది జీర్ణకోశంలో జఠరాశయం ఒక భాగం మాత్రమే క్రింద చిన్న ప్రేగులో భాగములయిన డువోడినం, జెజునంలలో తయారయ్యే స్యందనములు, డువోడినంలోకి పసరును పంపే లివరు, మధుర రసమునుపంపే పేంక్రియస్ గ్రంధి కూడా జీర్ణనాళంలో భాగములు కాకపోయినా జీర్ణకోశంలో భాగములే జఠరాశయంలో ప్రారంభమైన జీర్ణ కార్యక్రమం, చిన్న ప్రేగులో పై భాగంలో పూర్తి అవుతుంది జీర్ణ కార్యక్రమానికి ఫలితంగా తయారయిన వస్తు జాలమును చిన్న ప్రేగు చివరి భాగము, కొంతవరకు పెద్ద ప్రేగు అహరించుకుని రక్తంలోకి పంపిస్తవి జఠరాశయము డువోడినం, జెజునం అన్నీ జీర్ణంచేసే అవయములైనా, జఠరాశయంలో తయారయిన జీర్ణ కారక రసములకూ, చిన్న ప్రేగులో తయారయిన జీర్ణ కారక రసములకు రసాయనికంగా అతి ముఖ్యమైన భేదం వున్నది. జఠరకోశంలో తయారయ్యే జఠర రసము అమ్ల స్వభావం కలది (Acid) డువోడినంలో తయారు కాకపోయినా, అక్కడకువచ్చే రసములు, క్షార గుణం కలవి (Alkaline) కొన్ని కొన్ని సందర్భములలో జఠరాశయంలోకి, డువోడినంలో రసములు రావచ్చును ఇల్లా ఒక అంగమును విడచి మరొక అంగమునకు పోయిన వస్తువు తిరిగి వెనక్కు రావడము 'రిగర్జిటేషన్'(Regurgitation) కొన్నిహృదయ వ్యాధులలో హృదయమును విడిచిన రక్తం తిరిగి మళ్ళీ హృదయంలోకి రావచ్చును అందుచేత జఠరాశయంలో జీర్ణక్రమం, డువోడినంలో జీర్ణక్రమం ఆరంభం కావడానికి తగినట్లుగా ఆహారాన్ని మారుస్తుంది జఠరాశయము, డువోడినము యీ రెండూ కూడా చాలా సన్నిహిత సంబంధం కలవి డువోడినం నిర్మితి, ధర్మములు కూడా తెలుసుకున్న తరవాత, జఠరాశయ వ్యాధులను గురించీ డువోడినంలో ఏర్పడే వ్యాధులను గురించి తెలుసుకోడం తేలికగా వుంటుంది

డువోడినం గుర్రం నాడంలాంటి ఆకారం గలదని యిదివరకే తెలుసుకున్నాము. దీని గోడలోను, పైనించి లోపలకు క్రమంగా సీరస్ పొర, కండరముల పొర, మ్యూకస్ మెంబ్రేను వుంటవి. దీని పొడవు సాధారణంగా 10 అంగుళములు ఉంటుంది పైలోరస్‌నుంచి ప్రారంభించిన చిన్న ప్రేగులో డువోడినం మొదటి భాగము ఇది చిన్న ప్రేగులో, యితర భాగములకంటె లావై, విశాలంగా వుంటుంది దీని గోడ ఇచ్చట చాలా మందంగా వుంటుంది డువోడినం వంపులో పేంక్రియస్ అనే జీర్ణ గ్రంధితల యిమిడి వుంటుంది ఉదర గహ్వారంలో దీని స్థితి బొడ్డుకు తిన్నగా కుడివైపున వుంటుంది



డువోడినం మొదటి భాగమునుఆని లివరు, (కాలేయము) అనే గ్లాండు వున్నది డువోడినంలో మొదటిభాగం జఠరాశయంతోపాటు కదలుతూ వుంటుంది మిగతా భాగములు ఉదరగహ్వారం వెనుక గోడను అంటి, అంతగా కదలవు డువోడినం రెండవ భాగం షుమారు మూడు అంగుళముల పొడవు వుంటుంది ఈ భాగంలోనే లివరు నుంచి పసరును తీసుకొనివచ్చే నాళము, పేంక్రియస్‌నుండి, ఆ గ్లాండు స్యందించే రసమును తీసుకొని వచ్చే నాళము కలిసిపోయి, ఒకే నాళంగా డువోడినంలోకి ప్రవేశిస్తవి. డువోడినం మూడవ భాగం సుమారు నాలుగంగుళములు వుంటుంది ఇంతవరకు డువోడినం అధోముఖంగావున్నా, దీని చివర మళ్ళీ పైకి లేచి, 'జెజునం' అనేపేగు భాగంతో కలిసిపోతోంది వర్ణనకై ఈ పై భాగములు ఏర్పడ్డా నిర్మితిలో యివన్నీ ఒకలాగే వుంటవి ఈ భాగములనుచుట్టి ఉదరంలోవుండే ఇతర అవయవములు వుంటవి ఆ యా భాగములు వ్యాధిగ్రస్తములు అయినప్పుడు వాటిననుసరించివున్న అవయవములలో బాధ కలిగినట్లు తోస్తుంది

డువోడినంలో తయారయ్యే జీర్ణకారక రసం ఏమీలేదు అక్కడ జరిగే జీర్ణం అంతా, పేంక్రియస్‌నుంచి వచ్చే రసంతో ఆహారం మిళితమైనందువల్లనే జరుగుతుంది

జఠరరసం అమ్ల గుణంకలదని యిదివరకే తెలుసుకున్నాము. డువోడినంలోకివచ్చే పసరు(Bile) పేంక్రియస్ రసము రెండూ కూడా క్షారగుణం కలవే అందువల్ల పైలోరస్‌దాటి ఆహారం డువోడినంలో ప్రవేశించగానే, ఈరసములు, దాని అమ్ల గుణమును మార్చి వేస్తవి. రోజుకు సుమారు 70 అవున్సుల రసాన్ని పేంక్రియస్ తయారుచేస్తుంది.

పేంక్రియస్ అతిముఖ్యమయిన జీర్ణగ్రంధి. ఇందులో జీర్ణ కారక రసములేకాక, ఇన్సులిన్ అనే పదార్థం కూడా తయారవుతుంది ఎన్ని బొగ్గులు వున్నా నిప్పులేనిది అవి కాలనట్లు శరీరంలో ఎన్ని శర్కరా ద్రవ్యములు వున్నా ఇన్సులిన్ లేకపోతే అవి దగ్ధమై శక్తి కలుగదు రక్తంలో శర్కరాద్రవ్యములు విపరీతంగా పెరిగిపోయి మధుమేహం యేర్పడుతుంది జఠరాశయం పూర్తిగా శస్త్రంచేసి తీసివేసినా, జీర్ణక్రమం ఆగిపోదు. పేంక్రియస్ లేకపోతే జీర్ణమేలేదు. అందుచేత పేంక్రియస్ ప్రాణాధారక ఉపాంగములలో ఒకటి. ఇది చేపపిల్ల ఆకారంగా వుంటుంది దీని తల కొంచెం పెద్దదిగా వుండి, పోను పోను శరీరం సన్నగిల్లిపోతుంది దీనితోకను అంటె స్ప్లీన్ (ప్లీహం) అనే గ్రంధి వున్నది

"పేన్" అంటే "పూర్తిగా" అని అర్థము. "క్రియాస్" అంటే మాంసము అని అర్థము. దీని శరీరం అతి మాంసలమై, దీనిలో వ్యర్థ పదార్థం ఏమీ లేనందున దీని కాపేరు వచ్చింది

పేంక్రియస్ ఒక గ్లాండు ఇందులో అనేక భాగములలో పేంక్రియస్ రసం తయారయి చిన్న చిన్న నాళములద్వారా వెలికివస్తవి ఈ చిన్న నాళములన్నీ కలిసి పెద్ద నాళము అవుతుంది ఇటువంటి నిర్మితి కలిగి, ఒక నాళం ద్వారా తమ స్యందనములను అవసరమున్న ప్రదేశములకుపంపే గ్రంథులు కొన్ని—వీటిని సనాళికా గ్రంథులు అంటారు. కాని కొన్ని గ్రంథులు తమ తమ స్పందనములను ఒక నాళం ద్వారా పంపక, సరాసరి రక్తంలోకి వదలి వేస్తవి వీటిని అనాళికా గ్రంథులు అంటారు థైరాయిడ్, పిట్యూయిటరీ ఇట్లు వంటి గ్రంథులు పేంక్రియస్‌లో కొన్ని జీవ కణముల సముదాయం వున్నవి ఇవే ఇన్సులిన్ అనే పదార్థమును తయారు చేస్తవి. అయితే యీ ఇన్సులిన్ పేంక్రియస్ నాళంలో గుండాగాని, మరొక ప్రత్యేకనాళం గుండాకాని ఏ నిర్దిష్ట ప్రదేశానికీపోదు అందుకని సరాసరి రక్తంలోకిపోతుంది. ఈవిధంగా పేంక్రియస్, సనాళికాగ్రంధి అనాళికా గ్రంధి కూడా.

డువోడినంలోకి తన రసమునుపంపే అతి ముఖ్య గ్రంధి మరొకటి వున్నది అది లివరు దీనినే "కాలేయము" అంటారు శరీర కార్యక్రమంలో లివరు నిర్వహించే పనులు చాలా వున్నవి అదీ ప్రాణాధారకమైన ఉపాంగమే దానిని గురించి ప్రత్యేకంగా తెలుసుకోవడం అత్యవసరం కాని ప్రస్తుతం జీర్ణ క్రమము చర్చిస్తున్నందున, దాని రసం డువోడినంలోకి చేరుతున్నందున క్లుప్తంగా ఆ ఉపాంగమును గురించి తెలుసుకోడం చాలా అవసరం.

(సశేషము)

హారి నారకము

హోతత శివశర్మ

సాందీపనిపర్వం - 38

మహానందుడు తన చెప్పు ప్రథమపాఠమిట్లు లుండు ననుకొనలేదు. అంతయు విచిత్రముగా మన్నది. పరిసరమును చూచిన చో సాందీపని విద్యా మందిరపు పోకడ లన్నియు మన్నవి. యదార్థ మును తిలకించినచో నవి యేమియు లేవు. తాను సాందీపని కాడు. ఇది సాందీపని ఆశ్రమము కాదు. మరి ఈ శిష్యుడును శ్రీకృష్ణవాసుదేవుడు కాడు వీడు పౌండ్రకుడు. పౌండ్రకుడైన వాసుదేవుడు.

"వాసుదేవ !"

పౌండ్రకు డాయన వంక చూచెను. ఆ చూపు లలో నహంకారము పుక్కిలింతలుగ నుండెను. అహంకారమును మహానందు డింత ప్రత్యక్షముగ నెప్పుడును చూడలేదు. దానికి ఆకార ముండునా? ఉన్నచో నది యిప్పుడు పౌండ్రకునియందు మూర్తమై యుండెను. తనకు ప్రత్యక్షముగ నుండెను. అహంకార మనునది ఉపాధిగత మగుచో నెట్లు లుండునో, పౌండ్రకుని చూచినచో అట్లు లుండెను. ఇతనికి తాను ఏమి విద్య గరపవల యును ? అతనికి అన్నియు వచ్చియుండును. రాక పోయినను వచ్చినట్లే అవభాసించును. అహం కారముయొక్క లక్షణమే యిది. మహానందున కేమియు తోచలేదు. పౌండ్రకునకు విద్య గరపు టకు తాను వచ్చెను. కాని ఇచ్చటి స్థితి తాను విద్యను నేర్చుకొనుట వలె నున్నది. వాది ఏమి గురు త్వము ! అతనిది యేమి శిష్యరికము అనుకొని వాడు మహానందుడు. మరియు తాను వచ్చి ఇప్పుడు ఏమి చేయవలయును ? పౌండ్రకుడేమో తన్నుతాను చూచుకొనుచు మందిరమునందు క్రుమ్మరు చుండెను. ఒక్కచోట నిలుచుటలేదు. సుదక్షిణ ఆడిన మాటలు అతనిలోని యహంకార మును మరియును మేల్కొలిపినవి. అసలే యతడు రగులుచున్న అగ్ని. సుదక్షిణ అందుపై నాజ్య మును పోసినది. ఆమె ఎంత పొంకముగ మాట లాడినది ? ఎంత అర్థమును పెట్టి మాటాడినది ? పౌండ్రకు డామె ముందు నిజముగా నిలువలేక పోయెను. ఈ విరుద్ధ ప్రకృతులా, కాబోవు భార్యయు, భర్తయును.

"ఆచార్య !"

మహానందుడు పౌండ్రకుని దిక్కై చూచెను. అతడు పుస్తకములు పెట్టియున్న వేణువులతో చేయబడిన అరలున్నయెడ నిలుచుండెను. చేతిలో నేమియో భూర్జ గ్రంథము లున్నవి. అతడు మహానందుని దిక్కై మందహాసము చేసెను. ఆ మందహాసము విచిత్రమైనది. పూర్వము నేసిన మందహాసమున నహంకారము మాత్ర మున్నది ఇప్పుడు ఆ మందహాసములో నహంకారముతోడి వినయమును మున్నది. గడ్డి పూవునకు సువాసన వలె, ఆ వినయము వానియందు విచిత్రముగ నందగించినది.

"ఆచార్య !"

"వాసుదేవ !"

"విదేహుడగు జనకునుగురించి మీకు తెలి యునా !"

మహానందునకు ఆ ప్రశ్న గూడ విచిత్ర మని పించెను. "ఆచార్య ! సూర్యుని చూచితిరా ! చంద్రుని చూచితిరా !' అని అడిగినట్లు లున్నది ఆ ప్రశ్న. విదేహుని గూర్చియు, విదేహు నాస్థానియందు జరి గిన తత్త్వగోష్ఠులను గురించియు తెలియనివా రెవ్వరు ? ఎప్పుడో త్రేతలో నా చర్చలు జరిగెను. ఇప్పుడు ద్వాపరమున తుది మలుపులో గూడ వాని పచ్చి ఆరలేదు. ఆ చర్చలును ఆ చర్చలకు విషయమైన బ్రహ్మపదార్థమునకువలె అంతములేనివి. నిత్యనూతనములును, సనాతనములును నైనవి. ఇప్పుడు పౌండ్రకుడీ ప్రశ్న వేయుటమే విచిత్రముగ నున్నది. ఆ విదేహుడు తానైనట్లు పౌండ్రకుడు ప్రశ్నవేసెను. అతని అహంకారమునకు పరమావధియు, వినయమునకు కారణమును అదియు వలె మన్నది.

"పౌండ్రక ! విదేహుని గురించి చాల విన్నాను.'

"నాకును అతనివలె వుండవలెనని యున్నది."

"సదాశయమే !"

"ఆశయమేమిటి స్వామి ! త్రేతలో నతడును, ద్వాపరమున నేనును. అట్లు లుండవలెను. ఆయన యేమో బహుమంది ఋషులచేత తత్త్వచర్చలు జరిపించియు బ్రహ్మద్రవ్యమును సరిగా నెరుక నరచుకొన లేకపోయెను. నేను అట్లు కాదు. నేను ఆ బ్రహ్మమును గూర్చి ఎంతయో ఆలోచించితిని, జనకు నాస్థానిలో జరిగిన చర్చలన్నియు నా మనస్సునందు, నా హృదయమునందు జరిగినవి. నేను బ్రహ్మ మన నేమియో అట్లు తెలిసి కొంటిని. నాకు అనిపించినది. ఇంతమాత్రమునకు ఇన్ని చర్చలు దేనికని ? నేను ఎవ్వడను ? ఇదియే గదా ప్రశ్న ! నేను నేనే నని తెలిసికొంటిని. ఇంతకు యింత చర్చ, ఇంత గోలయుదేనికి! నేను నేనని ఎరుగుటకు ఇన్ని చర్చలా ! నాకు నవ్వు వచ్చినది....."

"నాకును నవ్వు వచ్చుచున్నది."

"ఎందుకు నవ్వు వచ్చుచున్నది ?"

"నీకు ఎందుకు నవ్వు వచ్చినదో, నాకును అందుకే వచ్చుచున్నది."

"బాగున్నది."

"బాగుండక ఎట్లుండును ! జనకు నాస్థానికి బహుమంది ఋషులు వచ్చిరి. అందరును చర్చిం చిరి. బ్రహ్మము నెవ్వరును తెలియకపోయిరి. ఒక యాజ్ఞవల్క్యుడు తెలిసికొనెను. ఋషులు అత నిని ప్రశ్న చేసిరి. అతని వాదమును అంగీకరించిరి. గర్గియు నతనిని ప్రశ్నించినది. ఆమె పరమ వేత్త కదా ! ఆమెకు ఆయన ఆ రహస్యమును చెప్పెను. ఆమె గ్రహించినది. అప్పుడు ఇంత జరిగినది. విచిత్రము. నీవు అంతయు ఒక్క అదటున గ్రహించితివి."

"అట్లు గ్రహించుట సాధ్యము కాదా !"

"ఎందుకు కాదు. నీవు కన్పించుటలేదా !"

పౌండ్రకునకు కోపము వచ్చినది. అతని కన్నులు ఎర్రపడినవి. మహానందు డప్పుడు భయపడ లేదు. పౌండ్రకుని వంక తీక్ష్ణముగ చూచెను.

"ఆచార్య! మీరును సుదక్షిణ వలె మాటలాడు చున్నారు."

"పౌండ్రక ! సుదక్షిణ పసిబిడ్డ. నాకు నామూక్తి యెట్లో, ఆమె యట్లు. అవిద్యచేత ఆమె మనస్సు ఆచ్ఛాదితము కాలేదు."

"నేను మాట్లాడునది అవిద్య యందురు ?"

"నేను అన్నానా ! నీవు అనుకొనుచున్నావు. నేను సుదక్షిణను గురించి మాట్లాడితిని."

పౌండ్రకునకు ఏమి మాట్లాడవలయునో తెలియ లేదు. అతనికి ఇట్లు ఎదురు చెప్పినవారు లేరు. ఈయనయేమో ముందు తన్ను వాసుదేవా ! అని

(53వ పేజీ చూడండి)



కలతనిద్ర

సాయంత్రమవేగా ఇల్లు చేరి తెచ్చినడబ్బు రెండవసారి లెక్కచూసుకొని భోషాణం అడుగున పెట్టెలో దాచి తాళం, గదివలకు తాళం వేశాడు తిరుపతయ్య.

ఊరంతా దీపాలు వెలిగించుకున్నా, తన ఇంట్లో దీపం వెలగలేదు. కూతురు ఎక్కడుందాని పెరటి వసారాలోకి వచ్చాడు. ముందు చిన్న బుడ్డిదీపం మినుకుమినుకుమంటుంటే దానినే చూస్తున్నట్లు పరధ్యానంగా చేతితో కాలికేసిన లాంతరుతో కూర్చుని వుంది ఆదిలక్ష్మి.

"ఏమమ్మా దీపం ముట్టించలేదు?" అన్నాడు మెల్లిగా.

తండ్రి మాటవిని తేరుకొని, లాంతరు వెలిగించి తెచ్చింది ఆదిలక్ష్మి. ఆ లాంతరు వెలుగులో పీక్కుపోయివున్న కూతురుముఖం చూశాడు.

సొగసులీనిన కళ్ళు మంచుకు తడిసి ముద్దయిన ఎర్రని ప్రతిస్పూర్తుల్లా వున్నాయి. కడుక్కొని ముఖంమీద ఎండిన కన్నీటి చారలు ఎండకు నీటి తాకిడికి కమలిన మరకలు ఏర్పడ్డ తెల్ల కలువపూవుని తారలులాగ వున్నాయి.

"ఏంతల్లీ ఎలాగున్నావు?" అనడిగాడు తిరుపతయ్య.

"ఏంలేదయ్యా. నువ్వు స్నానం చేసిరా— వడ్డిస్తా" అన్నది ఆదిలక్ష్మి మాటను తప్పించుకుంటూ.

ఎంత ప్రోత్సహించినా ఆమె కంఠంతో దుఃఖం వేరుకాలేదు. తిరుపతయ్య అలానే నిలబడ్డాడు.

"నువ్వు స్నానంచేసిరా—" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది ఆదిలక్ష్మి. స్నానంచేసి వచ్చాడు తిరుపతయ్య.

కంచంలో పెట్టలేదు. అన్నం చల్లారిపోయి వున్నది. కూర ప్రొద్దుటిదే ఇంత వేసింది. ఒక మూల చింతకాయపచ్చడి వున్నది. తిరుపతయ్య లాంతరు వెలుగుకి చెయ్యి అడ్డుపెట్టి పదార్థాలన్నిటిని ఒకమారు చూసుకొని అన్నం కలుపుకున్నాడు.

"మళ్ళీ ఏమి వండలేకపోయానయ్యా— అన్నీ పొద్దుటవే" అన్నది ఆదిలక్ష్మి.

తలెత్తి కూతురువంక చూశాడు. తండ్రి తన ముఖం చూడకుండా తల త్రిప్పుకొని పెరటి చీకటిలోకి చూస్తున్నది ఆదిలక్ష్మి.

తిరిగి కడుపులో పోటు వచ్చిందేమో—కాపు దానికి పోయినతరువాత అదే తగ్గుతుందన్నారు డాక్టర్లు. రెండేండ్లబట్టీ కాపురం చేస్తున్నా పోటు తగ్గినట్లు తగ్గి వస్తూ వుంది. ఎంత డబ్బు పోసినా తగ్గలేదు. తపాలి ఆయుర్వేదం కాదు. ఎంతయినా ఖర్చు పెట్టేటట్లు ఇంగ్లీషు వైద్యం ఎందుకు పట్టిస్తుంది—అప్పటికప్పుడు ఉపశమనం మన్నట్లేకాని—అనుకున్నాడు తిరుపతయ్య.

తలెత్తి కూతురువంక చూశాడు. కళ్ళు తుడుచుకుంటున్నది ఆదిలక్ష్మి.

"ఏం తల్లీ—కడుపులో పోటు మళ్ళీ వచ్చిందా—" అన్నాడు జాలిగా దీనంగా.

తనకేదు వచ్చినా తండ్రి సహించలేడని ఆదిలక్ష్మికి తెలుసు. తనతోపాటే బాధపడతాడు తండ్రి. తనకళ్ళకి మాట ఇచ్చానంటాడు—ఏలోపం రాకుండా చూస్తానని. అలానే చిన్నప్పటినుండి కంటికి రెప్పలా కాపాడుతూ వచ్చాడు. ఇప్పుడు తనకేది జరుగకూడదో అది, జరిగిందని చెబితే తండ్రి ఏమైపోతాడోకూడ తెలుసు.

మాట్లాడకుండా తండ్రివంక చూసింది. ఎత్తిన ముద్ద అలానే చేతితో వుంచుకొని అతిదీనంగా తనవైపు చూస్తున్నాడు. తల దించుకున్నది ఏమీ అనకుండా—

తిరిగి మళ్ళీ అడిగాడు—

"నువ్వు భోజనం చెయ్యి—తరువాత మాట్లాడుకుందాము" అన్నది.



బలవంతాన్న రెండు ముద్దలు తిని—"నువ్వలా వుంటే నే నేం తినేదే— ఏం జరిగిందో చెప్పు. కడుపులో నొప్పి ఎక్కువగా వుందా?"—అన్నాడు బాధగా.

"కడుపులో నొప్పిలేదు ఏమీలేదు—నువ్వు తిను" అన్నది ముక్తసరిగ.

గబగబా రెండు ముద్దలు తినీ తిననట్లు తిని లేచాడు. మామూలుగా అయితే తండ్రిని కోప గించి తిన్నదానికన్న రెండు ముద్దలు ఎక్కువ తినేటట్లు చూసేది. ఇవాళ ఏమీ బలవంతం చేయ లేదు.

ఎంగిలికంచం ఎత్తి చెయ్యి కడుక్కొని మధ్య హాలులోకి వచ్చింది. కూతురుకోసం పదేపదే అటు చూస్తూ, పచార్లుచేస్తున్నాడు తిరు పతయ్య.

కూతురిని చూసి వెళ్ళి పడకకుర్చీలో కూర్చు న్నాడు. ఆదిలక్ష్మి కుర్చీ దగ్గర నేలమీద కూర్చుంది. వస్తున్న ఏడుపును చీరకొంగు నోటిలో క్రుక్కు కొని ఆపుకుంటున్నది. దాని ఏడుపు చూసి ఆగలేక కుర్చీలో కదలిపోతూ—"ఏం జరిగింది తల్లీ. చెప్పమ్మా!" అన్నాడు తిరుపతయ్య వణికిపోతున్న కంఠంతో.

దుఃఖాన్ని ఆపుచేసుకుంటూ, ఒక్కక్షణం తండ్రివంక చూసి తల దించుకున్నది ఆదిలక్ష్మి.

"అయ్యా—" అని మాట్లాడలేకపోయింది.

కుర్చీలో కూర్చోలేక క్రిందికి దిగిపోయి ఆది లక్ష్మికి ఎదురుగా కూర్చున్నాడు తిరుపతయ్య. ఆత్రంగా కూతురివంక చూశాడు.

"అయ్యా! మధ్యాహ్నం నేను పడుకున్నాను. కలత నిద్ర పట్టింది—" అని ఆగింది ఆదిలక్ష్మి—

"ఏం జరిగింది—త్వరగా చెప్పమ్మా. . . . . ఎందు కలా బాధపెడ్తావు తల్లీ. చూడు నా గుండెలు కొట్టుకులాడి పోతున్నాయి"— అన్నాడు బాధగా దుఃఖపుజీరతో.

తండ్రిగుండె ఎంతటి దిటువైనదో ఆది లక్ష్మికి తెలుసు. తనవిషయంలో తప్ప ప్రపంచం కదులుతున్నదన్నా నవ్వుతూ నిద్రపోగలడు. ఆ గుండె దిటవు కరగిపోతున్నది—కరగాలికూడ.

తండ్రి కళ్లల్లోకి చూసి ధైర్యంగా దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసలతో కలిపి—"అయ్యా! చెప్తా విను. . . . . ." అన్నది.

"గాదిలోనుండి ధాన్యం తీయించమన్నావుకదు— రామయ్యన్నతో తీయిస్తున్నాను. పాతకాపయినా మనింట్లో పనుపులేని వాడిలో ఏంతో భయగా మాట్లాడుతానుగా—అలానే మాట్లాడుతూ గుమ్మంలో నిలబడ్డానయ్యా. వాడు ధాన్యాన్ని తలతంకి తోడి పోస్తున్నాడు. గాదిప్రక్క కుప్పగా పడ్డ ధాన్యాన్ని కాలితో నెట్టుదామని దగ్గరగా వెళ్ళాను. గాలికి గది తలుపులు దగ్గరగా పడ్డాయి. వీధి తలుపు తెరచేవుంది. నే నట్లా ధాన్యాన్ని కాలితో తోస్తుంటే జారి అంచుమీద కాలుపడి తూలిగాది మీదకు పడబోయాను. రామయ్యన్న చెయ్యి పట్టు కున్నాడు పడకుండా. ఆ విసురుకు నేను వాడిమీదే పడ్డాను. నాకేమో నవ్వొచ్చింది—ఇద్దరం ధాన్యంలో అలా పడ్డందుకు. . . ." అని తండ్రివంక చూసింది ఆదిలక్ష్మి. ఊపిరి బిగపట్టి వింటు న్నాడు. తలవంచుకొని మళ్ళీ ప్రారంభించింది.

"ఇంతలో తలుపు తెరుచుకొని మీ అల్లుడొచ్చాడు. ఎప్పుడొచ్చాడో ఏమో—నేను అలానే నవ్వుతూ గుమ్మందగ్గరకు వెళ్ళాను. కళ్ళు చింతనిప్పుల్లా చేసుకు నాచి ఒక్కటి కొట్టాడాయన" అన్నది ఆదిలక్ష్మి కొద్దిగా ఏడుపులో చెంపపై చేయి వేసుకొని. తిరుపతయ్య పిచ్చివాడిలా చూస్తు న్నాడు కూతురి వంక.

"నే నదరిపడ్డాను. ఏమిటని అడగబోయాను—

(48-వ పేజీ చూడండి)



జరిగిన కథ

సర్వజ్ఞ చక్రవర్తి బిరుదాంచితుడగు కొండవీటి ప్రభువు పెదకోమటి వేమారెడ్డి శ్రీనాథభట్టును కవిసార్వభౌమ బిరుదు పట్టముతో అలంకరించి, సర్వవిద్యానిలయమైన శ్రీ విద్యానగరమునకు విద్యావిజయ ప్రస్థానము చేయవలసిందని అర్థిస్తాడు. కార్యసిద్ధికై దైవజ్ఞులుసూచించిన పౌష్టిక క్రియలు ఆచరించి శ్రీనాథుడు యాత్రకు సంసిద్ధుడవుతాడు. శింగన ప్రధానితోను, వామనభట్ట బాణునితోను ముచ్చటించి, డిండిముని శాస్త్ర పాటవము, లోపాలు తెలుసుకుంటాడు. వేమభూపాలుడు అయనకు ఉచితమైన వీడ్కోలు ఇచ్చి పంపుతాడు. శ్రీనాథుడు దారిలో వినుకొండ వల్లభరాయని ఆతిథ్యాన్ని స్వీకరించి కొన్నాళ్ళకు విద్యానగరం చేరుకుంటాడు. అక్కడ శ్రీనాథుడు ముమ్మ కవి ఇంటిలో అతిథ్యం స్వీకరిస్తాడు.

ఈ కథాంశములు జరుగుచున్నకాలము దక్షిణ దేశచరిత్రలో చిరస్మరణీయమైనది. క్రీ. శ. 1420—ఫిబ్రవరితో నిది యారంభమైనది. వికారినంవత్సర మాఘారంభము.

1323 సంవత్సరంలో ప్రతాపరుద్రుడు ఢిల్లీ సేనలకు పట్టుపడిన పిమ్మట కాకతీయరాజ్యము ఛిన్నాభిన్నమయ్యెను. 1335 ప్రాంతములో ఆంధ్ర నాయకులందరు నొక్కమారు ఏకీభవించి ఓరుగల్లు తిరిగి పట్టుకొనిరి. ఆ పిమ్మట ఎవరికివారు స్వతంత్రులై తమ తమ రాజ్యములు పాలించుకొనిరి.

హరిహరరాయ బుక్కరాయ సోదరులను ఢిల్లీ సుల్తాను చెరసాలనుండి విడిపించి, తనకు రాజప్రతినిధులనుగా కంపిలికి పంపెను. వారలు శృంగగిరి శ్రీపీఠాధిపతులైన శ్రీ విద్యారణ్య భారతీయతీంద్రుల కరుణాకటాక్షము వడసి, సుల్తాను అధికారము ధిక్కరించి, తుంగభద్రాతీరమున 1336 సంవత్సరంలో శ్రీ విద్యానగరము నిర్మించి శ్రీ విద్యానగరరాజ్యమును స్థాపించిరి.

దక్కనులోని ఢిల్లీసుల్తాను సేనలలోని జమదారులును, నాయకులును తిరుగుబాటుచేసి, తమలో తాము కలహింపగా, తుదకు అల్లా ఉద్దీన్ హసన్‌షా 1347 సం. లో గుల్బర్గా రాజధానిగా బహమనీ రాజ్యము స్థాపించెను.

అప్పటినుండి దక్షిణ భారతములో మూడు రాజ్యములే ప్రబలములై విస్తరింపసాగెను. ఒకటి నరపతులగు శ్రీ విద్యానగర ప్రభువులది. రెండు అశ్వపతులగు బహమనీ సుల్తానులది.

(46-వ పేజీ చూడండి)

రాధారాఘవ్

పువ్వులు

ట్రాన్స్‌ఫర్‌రీత్యా మేము ఉత్తరప్రదేశ్ వెళ్లాల్సి వచ్చింది. ఆ యింట్లో క్రొత్తగా అప్పుడే దిగాము. ఆమర్నాటి ప్రొద్దుట మా ఇంటివారమ్మాయి పళ్లెంనిండా మల్లెపూలు వేసుకు తీసుకొచ్చింది. "మీ సైడ్‌న పువ్వులు పెట్టుకుంటారట కదాండీ.మమ్మీ మీకిచ్చి రమ్మన్నారు" అంది.

"ఏం? మీ సైడ్‌న పెట్టుకోరా" అన్నాను.

"మాసైడ్‌న సంసార స్త్రీలుపెట్టుకోరు"అంది.

ఇదేమిటా, పువ్వులు పెట్టుకోవడం కూడ తప్పవుతుందా అని ఆశ్చర్యపోయాను. అంతక్రితం మా సర్వెంటుకు పూల గురించి చెప్పి, బజార్నుంచి తెమ్మన్నాను. "ఈ ప్రక్కన పూలు పెట్టుకోరండీ. చెడ్డగా తలుస్తారు" అన్నాడు

మన భారతదేశంలో రక రకాల తెగలు, భాషలు ఉన్నాయి. అలాగే నీతి, అవినీతి విషయంలో కూడ ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా ఉంటుందా అనిపించింది. మనకు పువ్వులు లేనిదే ఏ శుభకార్యమూ వెళ్లదు. మనలో ఎంత పండు ముత్తయిదువయినా పూలు ముడుచుకుంటుంది. పుణ్యస్త్రీకి పూలు అతి ముఖ్యం. పువ్వులు కోల్పోయిన స్త్రీ, ఎండిమోడైన మొక్కలాగే శోభించదు. పూలు చూసిన వెంటనే, తెచ్చుకు జడలో సింగారించుకోకపోతే, మన దక్షిణాది స్త్రీలకు నిద్రే పట్టదు.

నిజమే. మన దక్షిణాది స్త్రీలు పెట్టుకున్నట్టుగా, ఉత్తరాది స్త్రీలు పూలు పెట్టుకోరు. ఆ సైడ్‌న రెస్ట్‌హవుస్‌ల్లోనూ, అక్కడా మల్లెలూ అవీ విరగబూచి కనిపిస్తే, మనవైపువాళ్లం ఒడినిండా కోసుకుని, తలనిండా పెట్టుకుంటాం. మన పూల పిచ్చికి వాళ్ళు నవ్వుతారు కూడా. కలకత్తాలోనూ, అక్కడా రక రకాల పూలగుత్తులు, ఫ్లవర్‌వేజుల్లోకి పేవ్‌మెంట్లమీద అమ్మడం చూశానుగాని, తలల్లో ఎవరూ పెట్టుకోరు. ఈమధ్య, మన దక్షిణాత్యులను చూసి, వారూ—నాగరికతలో కొంచెం ముందంజవేసినలాంటివారు — పెట్టుకోవడం మొదలుపెడుతున్నారు.

"దొడ్లో అన్ని పూలు పూస్తున్నాయి. అక్కడక్కడా కొందరు పెట్టుకుంటున్నారుగా. మీరెందుకు పెట్టుకోరు?" అన్నాను ఒకసారి యింటివారమ్మాయితో.

"పెట్టుకోడాన్కి సిగ్గేస్తుందండీ. బాగా పోజులో ఉన్నవాళ్లు అప్పు డప్పుడు పెట్టుకొంటుంటారు. కాలేజీ అబ్బాయిలు ఏడిపిస్తారని భయం కూడ" అంది బినా.

బాగా పాతబడ్డాక, మాయింల్లుగలావిడ ఒకరోజు ముడిచుట్టూ మల్లెలు పెట్టుకువచ్చి, "ఎలా ఉన్నానండీ? మిమ్మల్నిచూసి సరదావేసి ఇలా తయారయేను" అంది. మన కట్టూ బొట్టూతో ఆంధ్రస్త్రీలా కనిపిస్తున్న ఆవిడను పంజాబీస్త్రీ అంటే నమ్మేలాలేదు. ఆ మాటే అనేసరికి ఆవిడకు చాలా ఆనందం కల్గింది.

లక్నోలోనూ, అక్కడా కొందరు మగవాళ్ళ పూలదండలు మెడలో వేసునుని చేతికి కట్టుకుని, తిరగడం చూశాను. అది వారి ఆచారం కాబోలు. అక్కడివారు కొందరు పూలను ఆభరణాల్లా వాడతారు. పువ్వులు లోలకులులా చెవులకు అలంకరించుకుంటారు. మునికన్యలూ వాళ్లూ పూలకన్యల్లా పువ్వులతో అలంకరించుకోవడం మనం బొమ్మల్లో చూస్తుంటాం. మనలో పిల్లలకు, పెళ్ళికూతుర్లకు జడ పొడగునా పూలు కుడతాము.

పువ్వులు సృష్టిలో ఎంతో అందమైనవి. వాటికి ఆకర్షణశక్తి ఉంది. తమ పరిమళంతో మనస్సులను ఉల్లాసపరుస్తాయి. తమ అందంతో మనుష్యులను నిలబెట్టేస్తాయి. మనకు ఎక్కడైనా పూలచెట్లు కనుల నిండుగా కనిపిస్తే, ఆగిపోయి మరీ చూస్తాం. కలకత్తాలో ఫ్లవర్ మార్కెట్ చూస్తే కదిలిరాబుద్ధే అవదు. పూలను చూసేసరికి ఎంత కవిత్వం రానివాడికైనా కవిత్వం వ్రాయబుద్ధవుతుంది. అడవుల్లోనూ, డొంకల్లోనూ దర్శనమిచ్చే పూలలో కూడ ఎంతో సౌందర్యముంది. కొన్ని కొన్ని పూలు ఎంతో చిత్రంగా కూడ ఉంటాయి. అవేవో పూలు చూడటాన్కి అచ్చా బాతుల్లా ఉంటాయి. నాగమల్లో ఏదో అంటారు. ఆ పువ్వులు చాలా తమాషాగా ఉంటాయి. మధ్య శివలింగము, పైన పడగవిప్పి నిలబడున్న సర్పములా కనిపిస్తుంది. అసలు ఏ ఆభరణాలూ లేకపోయినా, తలలో ఒక్క గులాబిని పెట్టుకుంటే చాలు. అలంకరణలు ఏమీ లేని గదిలో ఒక్క ఫ్లవర్‌వేజు పెట్టండి. ఎంత నిండుగా శోభనిస్తుందో!

పూల మొక్కలతో శోభిల్లుతున్న ఇల్లును చూస్తే, "అబ్బ. ఆ ఇల్లేవరిదోగాని, ఎంత చక్కగా తోటపెంచుతున్నారు" అనుకుంటాము. ఆ మొక్కల పెంపకంలో ఉట్టిపడుతున్న సౌందర్యాన్నిచూస్తే,

(40-వ పేజీ చూడండి)

కలగ బాలాత్రిపురసుందరి

పేర్లూ - పిలవడాలూ

ఒకర్నిమనం పిలవడంలో కూడా మనకి వారిపైగల అభిమానమూ, ఆత్మీయతా ద్యోతకమవుతాయి స్నేహితులెలా పిలుచుకోవాలో, బంధువులెలా పిలుచుకోవాలో అవన్నీ వ్రాయాలంటే ఒక పదిపేజీల గ్రంథం అవుతుంది. అందుచేత మనం ప్రస్తుతం భార్యా భర్తలమధ్య సమస్యనే పరిష్కరించుకుందాం. హిందూ సాంప్రదాయం ప్రకారం భార్యలు భర్తల్ని పిలిచేవరకు అయితే "ఏమండీ" అని (వివిధ భాషల్లో అయినా ఆ అర్థం స్ఫురించేపదాన్నే వాడతారనేది గ్రాహ్యం) అలా చేయనివాడా భార్యను సంబోధించేందుకు జాణ, గయ్యాళి అనే సార్థకనామాలుండనే ఉన్నాయి.

ఇక మనకొచ్చిన చిక్కల్లా భర్తలు భార్యలను పిలిచే దగ్గరే. కొందరు "ఏమేవ్" అని, "ఒసే" అని, దాసీదాన్ని పిలిచినట్లుగా పిలుస్తారు. 'అఫ్‌కోర్స్' ఆమె తన చరణదాసి అవవచ్చు. ఆ పిలవడంలో కూడా కొందరు అధికారగర్వం ఉట్టిపడుతున్నట్లుగా పిలుస్తారు. అలా పిలిచినప్పుడు వారి భార్యలేమీ అనుకోకపోయినా, వినేవారికి, చూసేవారికి, కొంత మొరటుదనం స్ఫురిస్తుంది. అలాకాక ఇంకొందరు "ఇదుగో" "ఏయ్", "నిన్నే" అని ఒక జంతువుని పిలిచినట్లుగా పిలుస్తారు. అలా పిలుస్తే భార్యకి మనస్సెలా ఉంటుందో అనేదానికి భర్తల ఆత్మలే సాక్ష్యం. కొంతమంది ఆధునిక నాగరికతాలక్షణం అనుకుంటారో ఏమోమరి "ఏమోయ్" అని సంబోధిస్తారు భార్యలని. అలా పిలిపించుకుంటున్న ఆడవాళ్ళకూడా లేకపోలేదు. ముందు వాటికంటె ఇందులో మాత్రం ఏం గౌరవం ఉట్టిపడిపోతోందని? చెప్పండి. ఓ అనామకుణ్ణి పిలుస్తున్నట్లుగా లేదూ? ఇట్లా పిలుచుకుంటే భార్యాభర్తలలో ఒకరిపై మరొకరికి గల అనురాగం స్పష్టమవడం కష్టం. అయితే కేవలం అనురాగం, పేరుపెట్టి పిలవడంలోనే వ్యక్తమవుతుందా అంటే పూర్తిగా కాకపోయినా కొంతవరకు వ్యక్తమవుతుందని ధృఢంగా చెప్పగలను. దీనికి సలహాగా పూర్తిగా పేరంతాపెట్టి పిలవమనలేదు. ఎందుచేతనంటే ప్రతీ పేరుకీ "షార్టుకట్" ఉండనే ఉన్నదికదా. ఉదాహరణకి మా ఆయన నన్ను "బాలా" అని పిలుస్తారు. అందులో ఎంత అనురాగం నిండి ఉంటుంది. ఆత్మస్తవంకాదుకాని ఆయనలా పిలిస్తే నేను ఎంత కోపంలోఉన్నా అది కూడా మరచిపోతూ ఉంటాను ఆయన నన్నలా పిలిచినప్పుడు విన్న కొందరమ్మలక్కలు తమలో తాము "భార్యాభర్తలెంత అన్యోన్యంగా ఉంటారండీ" అనుకోడం, నేను వినడం కూడా తటస్థించాయి. అందుచేత "వెంకటలక్ష్మీదేవి" అని ఉంటే "లక్ష్మీ" అని పిలుచుకుంటే బావుంటుంది. ఇలాగే పెద్ద పేర్లన్నీ కూడా. ఇప్పటికాలంలో పెద్దపేర్లే కరువయాయిలెండి. "సరళ""వనజ""శారద" అన్నీ ఇలాటిపేర్లే. అందుచేత ఇక "షార్ట్‌కట్" చేసుకోవలసినబాధేలేదు.

అలా "సంబోధించడం"వల్ల చాలా ప్రయోజనాలున్నాయి. ఆదిగా మనం చెప్పుకోదగ్గదేమిటంటే భార్యకు భర్తపై ఒక విధమైన గౌరవభావం కలుగుతుందనడంలో సందేహంలేదు. భార్యా భర్తలకు మధ్య చెలరేగే స్వల్ప వైషమ్యాలు కూడా నాశనం కాగలవని ఘంటాపథంగా వక్కాణించగలను. భార్యలు సిగ్గుచేతనైతేనేమి, భర్తకు మనం చెప్పడమా అన్న సందేహం చేతనైతేనేమి "నన్నిలా పిలవండి" అని చెప్పలేకపోవచ్చు. చెప్పకూడదు కూడా. అందుచేత ఆ బాధ్యత భర్తలు గుర్తెరగడం చాలా మంచిది. ప్రపంచం నానాటికి అన్ని రంగాలలో పురోగమిస్తున్నదవడంచేత చాలామటుకు "ఒసే" "ఏమే" అలవాటు పోయిందిలెండి. ఇది మానుకోడం పెద్ద కష్టమైనపనేమీకాదు. ఈ సలహా కొంతవరకు వనితామణులకు ఉపయోగిస్తుందనే ఆశిస్తాను

(ఈవ్యాసం నిరక్షరాస్యులకు వర్తించదు. నూతన దంపతులకు. చాలావరకు ఉపయోగపడవచ్చు. చాలా చదివి పరిశీలించిన తరువాతనే నే నీ వ్యాసాన్ని రూపొందించాను.)

★



వనితా వాణి

పుట్టింటి మమకారం

భోయిన కనకదుర్గగారు వ్రాసిన "పుట్టింటి మమకారం" అనే వ్యాసం చాల బాగున్నది పెళ్ళి అవగానే తన భార్యకు పుట్టింటితో సంబంధం లేనట్లుగానే భావించి, అక్కడకు పంపకుండా బాధించే పురుషు లీనాటి ప్రపంచంలో ఉన్నారనే విషయం నిజం కట్నం సొంతం ఇవ్వలేదనే నెపమో, తాను కోరిన వస్తువు పండగలకు ఇవ్వలేదనే కారణమో ఏదో ఒకటి పెట్టుకొని, భార్యలను పుట్టింటికి పంపరు. ఒకవేళ ఆవిడ పోతానని ప్రబిమాలితే, వెళ్ళితే తిరిగి రానక్కరలేదని ధీమాగా పల్కుతారు. స్త్రీలకు పురుషులతోబాటు సమానమైన స్వేచ్ఛను ఇవ్వాలని బల్లగుద్ది ఉపన్యాసాలు చెబుతారు వ్యాసాలురాసి పత్రికలు నింపుతారు. కాని తమదాకా వచ్చేసరికి నోరు, చెయ్యి చప్పబడిపోతాయి. "చెప్పేవి శ్రీరంగనీతులు ." అనే సామెతను పూర్తిగా అనుకరించిన వాళ్ళవుతారు. ఈ విషయాలన్ని వ్యాస రూపంలో వ్రాసి, స్త్రీలకు పుట్టింటి మమకారం దూరంగా ఉండాలని వాదించే పురుషలోకానికి జ్ఞానోదయం కలుగచేసిన కనకదుర్గగారికి పత్రిక ద్వార అభినందనలు తెల్పుతున్నాను.

వి. సుందరి (తిరుపతి)

* * *

ప్రతి చిన్న విషయానికి అతి సున్నితంగా బాధపడే పురుషులు కూడా చాలమంది వున్నారని మనం గ్రహించాలి. తను కట్టుకున్న భార్యను సమాధాన పరచలేక, తనను కని, పెంచి, చదువు సంధ్యలు చెప్పించిన తల్లితండ్రులను దూరము చేసుకోలేక, బాధపడే పురుషులు యెంతోమంది వున్నారు. అత్తమామలను, ఆడపడచులను, పరోక్షంగా భర్తను యెప్పుడూ తిట్టిపోసే స్త్రీలు యెంతోమంది వున్నారు! ఒకరి నొకరు అర్థముచేసికొని, సంకుచితమైన స్వభావాలను, పట్టుదలలను విడనాడితే ఇలాంటి పేచీలే వుండవు.

లక్ష్మి మల్లికార్జున్ (విజయవాడ)

* * *

"పుట్టింటి మమకారము" అను వ్యాసం కొంతమంది భర్తల మనస్సులను మార్చుటకు చాల ఉపయోగకరముగా నున్నది.

ఉదయగిరి నాగ సుగుణావతి (బందరు)

* * *

వేరు వేరు కారణాలచేత అత్తవారిమీద కోపాలు వుంటే వుండవచ్చు. అంత మాత్రానికి తన జీవిత భాగస్వామిని పుట్టింటిమీద మమకారం చంపుకోమనడం హృదయం కల యే పురుషునికీ భావ్యం కాదు. ఇష్టంలేకపోతే అత్తవారిగడప తాను తొక్కకపోవచ్చు వారిని తానై ఆహ్వానించకపోవచ్చు అంతే గాని, తన భార్యకు ఆమె పుట్టింటివారికి మధ్య కట్టడి చెయ్యడం, ఆమె మనస్సులో తన స్థానాన్ని కించపరచుకోవటమేకాని మరొకటికాదు భర్తను యెంత పూజించుకుంటున్నా, తల్లిదండ్రులమీద మమత సరస్వతీ నదిలా మరుగుగా ప్రవహిస్తూనే వుంటుంది స్త్రీ మనస్సులో. భార్యనుకన్నవారిని కించపరుస్తూ, అర్థంలేని ఆనందాన్ని అనుభవించే పురుషులకూ, పుట్టింటిపై అతిగా ఆశల్ని పెట్టుకుంటూ అత్తవార్ని నిర్లక్ష్యం చేసుకునే అతివలకూ రచయిత్రితోబాటు మా విజ్ఞప్తి కూడాను

జయంతి, లక్ష్మి, రవి, పార్వతి (బెంగుళూరు)

* * *

ప్రతి స్త్రీకి మెట్టిన యింటిలో ఎంతసుఖంగా ఆనందంగా ఉన్నా పుట్టింటిపై మమకారంపోదు. ఆదరాభిమానాలతో పెంచిన తల్లితండ్రులన్నా ఒకే గర్భంనుండి రక్తం పంచుకొని పుట్టిన సోదరీ సోదరులన్నా ప్రతి గృహిణికి అభిమానం తప్పక కలుగుతుంది. రచయిత్రి వ్రాసినట్టు వీరిపట్ల ఆత్మీయత, ఆప్యాయతలతో కూడిన అభిమానాన్ని ప్రదర్శించడం ఏమంత పొరపాటుగాదు. స్త్రీకి నగలపై మోజు వున్నట్టే పుట్టింటిపై గూడా మమకారం ఉంటుంది.

పద్మనాగేష్, (కల్యాణదుర్గం)

* * *

ఈమధ్య మా వూరిలో ఒక విషాద సంఘటన జరిగింది. ఒక అబ్బాయికి పెళ్ళిలో చదివించిన రెండు ఎకరాలు రాసి ఇవ్వలేదని, ఆ పిల్లను పుట్టింటి నుంచి తీసుకొని రావటము మానివేసినారు. ఇందుకు అతని తల్లిదండ్రులు కూడ అతనికి సపోర్టు ఉన్నారు. నిజముగా ఆ అమ్మాయిని చూస్తు ఉంటే ఏడ్పు వస్తుంది అనుకోండి. ఈ వ్యాసము చదివితే ఏమైన మారుతారేమో .

ఎం. సుభద్రా బలరామదుర్గరాజు (చెరుకుపల్లి)

* * *

భోయిన కనకదుర్గగారు వ్రాసిన "పుట్టింటి మమకారం" అనే వ్యాసం ఏదో ఒక చిన్న కథగా చెప్పుకుపోయారు. సాధారణంగా ఎక్కడో నూటికి కోటికి ఒక్క సంసారంలో అలా జరగవచ్చుకానీ, మగవారినందరినీ దుయ్యబట్టడం బాగాలేదు.

"అర్థాంగుల మనస్సులను మాటి మాటికి నొప్పించుతూ, అర్థంలేని సంతృప్తిని, ఆనందాన్ని అనుభవించే మగవారి మనస్తత్వాలలో మార్పు రావటం ఎంతైనా అవసరం"

ఈ విషయంలో మగవారికి ఒక ఆటనా అలా ప్రవర్తించటానికి? అన్యోన్యంగావుండే కుటుంబాలు ఎన్నిలేవు?

పుట్టింటిపైన అభిమానంగా వున్నంత మాత్రాన అదొక పెద్ద క్రిమినల్ కేసుగా మగవారు తీసుకోరు. అందులో అత్తగారు ఆపదలో వున్నారంటే పంపని భర్తలు ఎవరు కూడా వుండరని నా అభిప్రాయం

ఇహపోతే పుట్టింటి మమకారం ప్రతి భారత స్త్రీకి ఉంటుంది మానవునికి ఆశ, అపేక్ష లేకపోతే, జీవితం శూన్యమేగా!

ఆర్. కె. కలవాణి (ఎర్రగుంట్ల)

* * *

వివాహం జూదమా?

శ్రీమతి వెంకటరత్నంగారు వ్రాసిన వివాహం జూదమా? అనువ్యాసం బాగుగా నున్నది భార్యా భర్తలమధ్య అనురాగమనేది ఒక రోజుతో వచ్చేది కాదు అది క్రమేణా వృద్ధిఅవుతుంది. కాని కొన్ని సందర్భాలలో అనురాగం వృద్ధి అవటానికి బదులు క్షీణించిపోతోంది. ఇందుకు కారణం ఏమిటి? నా భర్త, నా పిల్లలు, నా ఇల్లు, నా భర్త ప్రేమే నా సర్వస్వం అని మెలిగే స్త్రీపట్ల భర్త ఆదరణ చూపక, ఇతరులతో కలిసి ప్రేమకలాపాలు సాగిస్తుంటే ఏ భార్య మాత్రం వూరుకోగలదు చెప్పండి? అలాంటి ఇంట్లో సుఖశాంతులు ఉండవు. ఇలాంటివారికి ఈ వ్యాసం చదివిన తరువాత కనువిప్పు కలుగవచ్చు. శ్రీమతి వెంకటరత్నంగారికి నా హృదయపూర్వక అభివందనలు.

కె రమ (విడవలూరు)

* * * *

శ్రీమతి ఎస్. వెంకటరత్నంగారు మామూలుగా జరిగే సంఘటనలను వివరించి చక్కగా వ్రాసినారు. భార్యా భర్తలయ్యాక ఏదో చిన్నచిన్న విషయములలోనే కలహాలు రావటం జరుగుతుంది. అలాంటి కలహాలనే గోరంతలు కొండంతలుగా చేసుకొనే వారికి ఈ వ్యాసము గుణపాఠముగా నున్నది.

పామిరెడ్డి వెంకమ్మ (కర్నూలు)

* * *

నగల మోజు

భర్త చావు బ్రతుకులలో వుండి డబ్బులేక నగలు అమ్మవలసివస్తే తరువాత నాగతి ఏమి అని అన్న వాళ్ళు కూడా వున్నారు అంటే, భర్తకంటే కూడా వారికి వస్తువులే ఎక్కువ అని చాలా చక్కగ వ్రాశారు

జట్లా మల్లేశ్వరి (పెద్దాపురం)

*   *   *   *

ఈ వ్యాసంలో నాకు వచ్చినవి చివరి వాక్యాలు. అవి చదువుతుంటే ఈమధ్య జరిగిన సంగతి ఒకటి జ్ఞాపకానికి వచ్చింది ఆ అమ్మాయి ఒకమాటు మా వూరికి వచ్చింది. ఆరోజునే మా వాళ్ళ ఇంట్లో ఏదో పేరంటం వచ్చింది. నేను ఆ అమ్మాయి కలసి వెళ్ళాము ఒక ఆవిడ ఈ అమ్మాయికేసి ఎగాదిగా చూసి, "మీవాళ్ళు నీకు నగలు పెట్టలేదా?" అంది. "లేదండి" అని ఈ అమ్మాయి వూరుకుంది. ఆవిడ మళ్ళీ, "ఇదుగోనమ్మా ఈ ఆరు పేటల చంద్రహారం మా అత్తారుపెట్టారు. ఈ రాళ్ళ నెక్లెస్ వుంది చూశారూ మా అమ్మ చేయించింది. మా వారి సంపాదనమీద ఈ ఆరు జతల గాజులు చేయించుకున్నాను" అని మొదలుపెట్టింది. ఈ అమ్మాయి మెదలకుండా వూరుకుంది. నేను ఆ అమ్మాయిని బయటికి తీసుకువచ్చాక ఆవిడ ఇలా అడిగిందేవిటీ అని చాల బాధ పడింది.

టి. కళ్యాణలక్ష్మి (ఎర్రగుంటపల్లి)

*   *   *

నగలు ధరించడంలో కూడ పెద్దవాళ్ళ వయస్సుకు తగినట్టు ఆకారానికి తగ్గట్టుగా నగలు వేసుకోవాలి అన్నారు. నిజమే ఆ రోజులలో కాసుల పేర్లు జిగినీ గొలుసులు అందముగా వుండేవి. కాని యీ రోజులలో అవి ఫేషన్‌గావు కాబట్టి, ఇప్పటి మార్పునుబట్టి ఆడవారు నగలు ధరిస్తే బాగుంటుంది. మా బంధువులలో ఒకామె 40 సం. దాటిన వయస్సు వచ్చాక ఒక నెక్లెస్ కొనుక్కున్నది ఆనెక్లెస్ కూడ వెడల్పుగా మోటుగావుంది దానికితోడు నల్లపూసలు కంఠానికి బిగించి కట్టుకుంటుంది. పైగా మనిషి చాల లావుగా, పొట్టిగా వుంటుంది. ఈ నెక్లెస్ కొన్న కొత్తలో అందరి దగ్గరా మావారు సొంత ఆర్జనమీద కొన్నారు అని గర్వముగా చెప్పేది. ఆమాట వినేసరికి అందరికి నవ్వు వచ్చేది. ఇంకొకామెవుంది. ఆమెకి చాల నగలు వున్నాయి. కాని భర్తపోయి రెండేండ్లు అయినది అయినప్పటికి వాటిలో కొన్ని నగలు పెట్టుకుంటోంది. రాళ్ళ నెక్లెస్ చేయించుకోవాలని ఎంతగానో తాపత్రయపడుతోంది. నిజంగా రచయిత్రిగారు చెప్పినట్లు ఆడవారికి ఎంత వయస్సు వచ్చినా నగల మోజు తగ్గదు

భర్తకు ఉద్యోగములేక ఇబ్బందిలో ఉన్నప్పుడు నగలు అమ్మి ఇబ్బందులు తీర్చడమే కాకుండా, భర్త చదువుకోసం నగలు అమ్మి ఇచ్చిన ఆడవారు వున్నారు. అది నా స్వానుభవముమీద చెప్పుతున్నాను

సి హెచ్. కృష్ణవేణమ్మ (కాకినాడ)

*   *   *

స్త్రీ నగలు ధరించటం అందమైనప్పటికీ మితమంటూ ఉండాలి. లేకపోతే యితర్లకు అసహ్యం కలిగిస్తుంది. పైగాఒక్కోసారి ప్రమాదం కూడాను.

పి. గోపీకుమారిదేవి (చేబ్రోలు)

*   *   *

రైలు ప్రయాణాలు

ప్రభావతిగారు వ్రాసిన రైలు ప్రయాణాలు అన్న వ్యాసం చాల బాగుంది. ఆమె వ్రాసినట్టు ప్రయాణాల్లో చాల సమస్యలు యెదుర్కోవలసి వస్తూవుంటుంది. అందులో స్త్రీల కంపార్టుమెంటు, థర్డుక్లాసు కంపార్టుమెంటు అయితే అసలు ప్రయాణాలే మానుకొనటము మంచిదేమో అని పిస్తుంది. అలా అని అందరూ చెడ్డవారేవుంటారా? మంచివాళ్ళని కూడ ప్రయాణాల్లో కలుస్తూ వుంటాము. మంచివాళ్ళంటే ఒక సంగతి జ్ఞాపకం వస్తోంది. నేను, మావారు కలిసి ఢిల్లీనుంచి వస్తున్నాము. ఇద్దరమే కనుక రెండు బెర్తులు రిజర్వు చేయించుకున్నాము. చాల సామానులతో బయలు దేరాముమేము. కంపార్టుమెంటులో సామానంతా సర్దే సరికి ఒక బెర్తు అంతా నిండిపోయింది. ఇంక మిగిలింది ఒక బెర్తు. పగలంతా ఫరవాలేదను కోండి. చాలదూరం ప్రయాణం చెయ్యాలి, రాత్రి యెలాగా అని ఆలోచనలో పడ్డాను. మాకు యెదుగా తమిళులు కూచుని వున్నారు. భార్య, భర్త, ఇద్దరు చిన్న పిల్లలు. వచ్చిరాని అరవములో వాళ్ళతో పరిచయము చేసుకున్నాను. వాళ్ళ మూడు బెర్తులు రిజర్వు చేయించుకున్నారుట. సామాను కూడ ఆట్టేలేదు. రాత్రి అయ్యేసరికల్లా "రెండు బెర్తులు మాకు సరిపోతాయి. మీరో బెర్తు తీసుకోండి యెంత సేపు కూచుంటారు" అన్నారామె. చాల సంతోషముతో ఆమెకొక "థేంక్సు" పారేసి నిద్ర కుపక్రమించాను. ప్రయాణాల్లో ఇటువంటి మంచి స్వభావముకలవారిని చూడటము అరుదేమో అనిపిస్తుంది.


కుమారి దోసపాటి (బరంపురం)

*   *   *

చదువులు-పనిపాటలు

చదువుకొన్న ఆడ పిల్లలకు ఇటువంటి అవస్థలు సాధారణముగా తటస్థపడుతవి. ఈ విషయము "రత్నామహీధర్'గారు చాలా సహజముగా విమర్శించినారు.

కె. ఎస్. కుమారి (తణుకు) ★





కాల్గేట్ వాడి నోటినించి దుర్వాసన
రాకుండా చేసుకోండి
రోజంతా దంతక్షయం
రాకుండాకూడా కాపాడుకోండి!
ఎందుకంటె : ఒక్క సారి తోముకొంటేనే
కాల్గేట్ డెంటల్ క్రీమ్ నోటిలో దుర్వాసన మరియు దంతక్షయమునకు కారణమైన సూక్ష్మ క్రిములను 85% వరకు తొలగించును
కాల్గేట్ 10 మందిలో 7 గురికి నోటి దుర్గంధమును వెంటనే ఆపుతుందని మరియు భోజనము అవగానే కాల్గేట్ పద్ధతిలో పళ్లు తోముకొనుట ద్వారా ఎక్కువ మందికి ఎక్కువ దంతక్షయము అరికట్టిందని దంత శాస్త్ర చరిత్రలో పూర్వమెన్నడూ తెలియచేయనంతలా శాస్త్ర పరిశోధనం ఫలితముగా నిరూపించబడినది!
ఊరికే నోటిలో నీళ్లు పోసుకొని పుక్కిలించుట చాలదు. భోజనము అయిన వెంటనే క్రమంతప్పకుండా కాల్గేట్‌తో పళ్లు తోముకోండి. దాని చేవగలమైన నురుగు పళ్ల మధ్య కనపడకుండా ఉండే సందులలోనికి వెళ్లి నోటి దుర్వాసనకు మరియు దంతక్షయమునకు కారణమైన కుళ్లి పోతున్న ఆహారపు తునకలను తీసివేస్తుంది!
పిల్లలు కాల్గేట్‌తో పళ్లు తోముకొనుటకు ఇష్టపడతారు ఎందుకంటె చాలా సేపు ఉండే దాని పిప్పర్‌మెంట్ వంటి రుచి అంటే వారికి ప్రీతి!
COLGATE DENTAL CREAM
COLGATE TOOTH POWDER
మీకు పొడరు కావాలంటే, ఈ లాభమున్నిటిని మీరు కాల్గేట్ టూత్ పొడరు ద్వారా పొందగలరు... ఒక డబ్బా వెంట వస్తుంది
కాల్గేట్‌తో క్రమం తప్పకుండా పళ్లు తోముకొంటే
✔ నోటి దుర్వాసనను పోగొట్టును
✔ దంతక్షయమును నిరోధించును
✔ పళ్లను మెరుస్తూ ఉండేలా ఉంచును
COLGATE DENTAL CREAM
నోరు ఎక్కువ శుభ్రముగా, తాజాగా ఉండుటకు మరియు పళ్లు ఎక్కువ తెల్లగా ఉండుటకు
ప్రపంచములో ఏ యితర పళ్లు తోముకొనే క్రీమ్ కన్న కాల్గేట్‌నే ఎక్కువ మంది వాడుతున్నారు.



(గతసంచిక తరువాయి)

రాజు చెప్పినదంతా ఆశ్చర్యంతో విన్నాడు. వాల్చిన ఆమె ముఖాన్ని విచ్చుకున్న కళ్ళతో చూశాడు. తను చెప్పిన మాటలకు తనే సిగ్గుపడ్డట్లు ఆమె నేలవంక చూస్తూ కూర్చున్నది.

రాజు :— (తనలో) ఆహా! సృష్టికర్త లీలలు చిత్రమైనవి. ఒకరు బోధించకుండానే వ్యక్తులు జీవితపు తీరులు నేర్చుకుంటారు. ఈ యడవిలో పెరిగి, మనుష్యుల ముఖమైనా చూడని ఈ పంకజముఖి తనంతట తానే పతివ్రతాధర్మాలు ఎంతలా తెలుసుకుంది? (ప్రకాశముగా) కోమలీ! నీవు జ్ఞానివి. మహర్షి అయిన నీ తండ్రికి తగ్గ శిష్యురాలివి. ... గల్వాడుతున్న నాకు సరైన పాఠం నేర్పావు. నీలో రాణి కుండవలసిన లక్షణాలున్నాయని ఇంతకుముందు అన్నాను. కాని, దాని అర్థం ఇప్పుడే తెలుసుకున్నాను. ఇప్పుడు నీవే నాకు గురువు. నేను నీ శిష్యుణ్ణి. ఇప్పుడు నాకు తెలియనిదంతా చెప్పవలసినది నువ్వు. నా చిన్నారి గురువుగారూ? నాకు పాఠాలు చెప్పండి. ఇప్పుడే నేర్చుకుంటా.


ఆమె సిగ్గుతో తలవంచి నవ్వుతూ ఇలా అంది.

యువతి :—మళ్ళీ నన్ను హేళనచేస్తున్నావు. ఈ యరణ్యంలో పెరిగి ఏమీ తెలియని ఈ యడవికన్య, నగరాల్లో నివసిస్తూ, ఎందరో ప్రముఖులతో కలసి మెలిసిన నీకు బోధించగల సమర్థురాలా?

రాజు :—అవును సుందరీ! నాకు తెలియనివి ఎన్నో నీవు నాకు చెప్పగలవు. లోటివారి సాంగత్యం వల్లనేమో నగరవాసుల హృదయాలు విష పూరితములై కుళ్ళివుంటాయి. కాని నీ మనసు మాత్రం కపటంలేక నీ జడలోని పుష్పంలాగ నిరంతరవికాసంలో ఆహ్లాదాన్ని కలిగిస్తూ వుంటుంది. నీవు శుచిస్వరూపం. నీ శక్తితో చుట్టున్నవారికి కూడా నీ శుచిత్వాన్ని ప్రసాదిస్తావు.

ఆమె అతనిని ఒక్కక్షణం చూచి, కళ్ళు క్రిందికి

(43-వ పేజీ చూడండి)



నవలలద్వారా శాస్త్ర విజ్ఞానం ప్రజలకు అందజేసిన జూల్స్ వెర్న్ ఒక గొప్ప రచయిత కూడా. అందుకనే శాస్త్రజ్ఞుడుగా సమ్మలేని సిద్ధాంతాన్ని ఈ నవలలో వెర్న్ వాడినందుకు పాఠకులు ఆనందిస్తారు!

మే 24, 1863 ఆదివారం మధ్యాహ్నం మా పెదనాన్న, హోట్కేనిగ్‌స్ట్రాస్ వీధివెంబడి త్వర త్వరగా తన ఇంటివైపు నడచిరావటం గమనించాను. ఇది పాత హాంబుర్గ్ నగరంలోనే మరీ పాత వీధి అయిన కేనిగ్‌స్ట్రాస్ 19 సంఖ్య కల ఒక చిన్న ఇల్లు.

పాపం మా ఇంట్లో పనిచేసే మార్తా సిద్ధంగా లేదు! పొయ్యిమీద 'కెటిల్' అప్పుడే చప్పుడు చేస్తోంది.

"చిక్కు వచ్చేసింది!" అని కేక వేశాను. ఎందుచేతనంటే మా పెదనాన్న చాలా హడావుడి మనిషి. సహన మున్నది చాలా తక్కువ. "పెదనాన్నకి ఆకలిగా ఉంటే ఇంటికప్పు ఎగిరిపోవలసిందే" అన్నాను.

"లిడెన్‌బ్రోక్‌గారు అప్పుడే వచ్చేశారా" అని మార్తా కంగారుగా భోజనాల గది తలుపు తెరుస్తూ అన్నది.

[illegible]

మాత్రం తప్పు నీదికాదు. ఇంకా రెండు గంట లవలేదు. సెయింట్ మికెల్స్‌లో ఇప్పుడే అర్ధ గంట కొట్టారు."


"అయితే ప్రొఫెసర్‌గారు అప్పుడే ఎందుకు తిరిగి వచ్చేస్తున్నారో?"

"ఆయనే చెప్తారుగా."

"ఇదిగో వచ్చేశారు! నే నాయన కంట పడదల్చుకోలేదు గాని, అక్సెల్ నువ్వైనా కొంచెం నచ్చజెప్పు" అంటూ మార్తా వంటగదిలోకి వెళ్ళిపోయింది. దీనినే మా పెద్దనాన్న మార్తా 'పాక పరిశోధనశాల' అంటాడు.

ఆయనను నేనే 'ఎదుర్కొని' కలిసి వచ్చిందన్నమాట. కాని ముక్కోపి అయిన ఈ ప్రొఫెసర్ గారికి నచ్చచెప్పే ధైర్యం ఏకోశానా లేని నా వల్ల కాదని గ్రహించి నా గదిలోకి పారిపోదామని అనుకుంటూ ఉండగానే వీధి తలుపు తెరుచుకున్న శబ్దం వినిపించింది. పెద్ద అడుగుల చప్పుడుతో ఇంటి

(41-వ పేజీ చూడండి)


బాపు
మృదువైన పలుకు
'ఋజువైన' నటన
రమణీయమూర్తి
శ్రీ రమణామూర్తి
పొడుగైన, నేడు
'బడుగే'ను - రేపు
పొట్టయిన నాడు
ఎదుగెంత సేపు



పూర్వం చీనాదేశంలో తాన్సూ అనే ఛ్యాంగ్ జాతిస్త్రీ ఒకావిడ ఉంటుండేది. ఆమెకు ముగ్గురు పిల్లలు. ఒక లోయలో ఆమె ఆ పిల్లల్తో జీవిస్తుండేది. ఆమెభర్త చనిపోయాడు. ఆ ముగ్గురు పిల్లలూ మగవారే! పెద్దవానిపేరు లీమె. రెండోవాడు లీటె. మూడోవాడు లీజె.

ఛ్యాంగ్ జాతివాళ్లు బట్టలు నేయడంలోను, బుటేదారీ పనులు చేయడంలోను మంచి పేరు ప్రఖ్యాతులు గడించారు. తాన్సూ కూడ ఆలానే మంచిపేరు గడించింది. పూలు, లతలు, పక్షులు జంతువులు బట్టలమీద కుట్టిందంటే అవి కుట్టినవని ఎవరూ అనుకోరు. ప్రాణంతో ఉన్నవే అని అనుకుంటారు. అలాంటి కుట్లు కుట్టి బుటేదారీపనులుచేసి, బట్టలునేసి ఆమె పిల్లల్ని పోషించుకొస్తున్నది.

ఒకనాడు తాన్సూ తనుకుట్టిన కొన్ని దుప్పట్లు, ద్వారం తెరలు, గౌన్లు పట్టుకొని విక్రయించటానికి పట్నం వెళ్ళింది. పట్నంలో ఒక దుకాణం దగ్గర ఆమె ఒక తైల చిత్రాన్ని చూసింది. దాని పనితనానికీ, అందానికీ ఆశ్చర్యపోయింది! ఆ చిత్రంలో - ఎత్తయిన కట్టడాలున్నాయ్! గొప్ప ఉద్యానవనం ఉంది! బాగా పండిన పొలాలున్నాయ్! ఫలపుష్పాల్తో ఉన్న చెట్లు పచ్చపచ్చగా ఉన్న కూరగాయల మళ్ళూ, రంగురంగుల చేపల్తో నిండిన చెరువులూ వున్నాయ్. అక్కడక్కడా ఆవులు, మేకలు, గొర్రెలు, లేళ్ళు, బాతులు, కోళ్ళు, నెమళ్ళు తిరుగుతున్నట్టు-ఉన్నాయ్.

ఆ చిత్రం శోభ చూసి తాన్సూ

ముగ్ధురాలైంది. వెంటనే తన దగ్గరున్న దుప్పట్లూ, ద్వారం తెరలూ, గౌన్లూ ఆ దుకాణదారుకు ఇచ్చివేసి ఆ తైలచిత్రం తీసుకొని ఇంటికొచ్చింది. తోవలో—'ఆహా! ఇలాంటి ప్రదేశంలో నేనూ, నా పిల్లలూ ఉంటే ఎంత బావుణ్ణు' అనుకుంది.

ఆమె యింటికొచ్చి పెద్ద కొడుకును పిల్చి "ఈ చిత్రం ఎంత అద్భుతంగా ఉందో చూడు! ఇలాంటి దాంట్లో మనంవుంటే ఎంత బావుంటుందో?" అని అడిగింది. అంతలో మిగిలిన ఇద్దరు కుమార్లూ వచ్చారు. ఆముగ్గురూ ఆచిత్రాన్ని చూశారు. దాని అందానికీ పనితనానికీ చాలా ముగ్ధులైపోయారు. తల్లి ప్రశ్నించిన దానికి లీమె "అమ్మా! నీ కోరిక నిష్ఫలం! మనకంతటి అదృష్టం పడుతుందా?" అన్నాడు. రెండోకుమారుణ్ణికూడా తాన్యా అదే ప్రశ్న వేసింది. "అమ్మా! నీకోరిక నిష్ఫలం! మనకా భాగ్యం లేదు" అని లీటె అన్నాడు.

తాన్యా నిరుత్సాహంతో మూడో కొడుకునుకూడా అదే విధంగా అడిగింది. లీజె వెంటనే జవాబివ్వలేదు. కాసేపాలోచించి "అమ్మా! నువ్వు విచారించకు! ధైర్యంతో వుండు! నువ్వు కుట్టుపనులకు మన దేశములో గొప్పపేరు గడించావు. ఈ చిత్రాన్ని చూసి, ఒక పెద్ద పట్టుదుప్పటిమీద అల్లిక, కుట్టు ఆరంభించావంటే, అదిపూర్తయేసరికి నిజానికది జీవకళల్తో కూడిన ఒక ప్రదేశం అవుతుంది. దాన్ని ప్రతీ నిమిషమూ చూసుకొని ఉన్నావంటే నువ్వందులో విహరిస్తున్నట్లే భావిస్తావు! అప్పుడు నీ కోరిక తీరుతుంది!" అన్నాడు.

చిన్నకొడుకు మాటలు తాన్యా విన్నది. సంతోషంతో "లీజె! నువు చెప్పింది అక్షరాలా నిజం! రేపటి నుంచే అల్లికా, కుట్టూ ఆరంభిస్తాను!" అన్నది.

మర్నాడు తాన్యాపట్నం వెళ్ళి తెల్లని పెద్ద పట్టుదుప్పటీ, రంగు రంగుల దారాలూ కొన్నది. ఇంటికొచ్చి పని ఆరంభించింది!

రోజులు గడిచిపోతున్నాయ్! నెలలు దొర్లుకుపోతున్నాయ్! పగలూ రాత్రీ ఏకంచేసి, ఒకే దీక్షతో తాన్యా అల్లికా కుట్టూ చేసుకుపోతున్నది!

తల్లి చేస్తున్నపని లీమె, లీటెలకు ఏంవీ నచ్చలేదు. పూర్వం ఆమె ఏమాత్రం అల్లిక, కుట్టు పనులు చేసేదో వాటిని బజార్లో అమ్మి గోధుమలు, బియ్యము కొని కొడుకుల్లకు వండిపెట్టేది. ఇప్పుడామె ఏకదీక్షతో ఒకేఒక పని చేయటంవల్ల, యితరమైన వాటిని ముట్టుకోలేదు. అందువల్ల లీమె లీటెలు అడవికి వెళ్లి, కట్టెలుకొట్టి, వాటిని అమ్మి ఆవచ్చిందాంతో జీవితం గడుపుతుండేవారు. చివరకు వాళ్లకు విసుపెత్తింది. ఒకనాడు తల్లితో "అమ్మా! ఇక మేం కట్టెలు కొట్టలేం! ఈ సంసారాన్ని మేం ఎంతకని యీడ్చుకొస్తాం? నువ్వేమో సంవత్సరాల తరబడీ ఇందులో కూరుకుపోయి ఉన్నావ్! నీ చేతి మీద యిదివరకులా సంపాదన లేదు. మా సంపాదన చాలకుండా ఉంది" అన్నారు.

తల్లి జవాబిచ్చేలోగా లీజె అందుకొని అన్నలతో "ఇకమీద మీరు అడవికి పోవద్దు. కష్టపడొద్దు. నేనే మన కుటుంబాన్ని పోషిస్తాను! అంతేగాని అమ్మ చేస్తున్నపనికి అడ్డు పెట్టవద్దు!...ఆమె ఆనందమే మన ఆనందం!" అన్నాడు.

తదాది లీజె అడవికిపోయి పొద్దస్తమానం కట్టెలుకొట్టి, వాటిని పట్నం తీసుకువెళ్ళి విక్రయిస్తుండేవాడు. లీజె చాల బుద్ధిమంతుడు చలాకీ ఐనవాడు. మాంచి వ్యవహారజ్ఞానం ఉంది! అందువల్ల కట్టెల వ్యాపారం బాగా చేస్తూ, బాగా లాభం తీస్తుండేవాడు. ఆవచ్చిన డబ్బుతో కుటుంబ కాలయాపన బాగా సాగిపోతుండేది!

తాన్యా విధీ విరామం లేకుండా కుట్టూ అల్లికా చేసుకుపోతున్నది. తాటిమట్టల్ని వెలిగించి దాని వెలుగులో పనిసాగిస్తున్నది. కాని పొగవల్ల ఆమెకండ్లు ఎరుపెక్కిపోయేవి! నీరు ప్రవాహంకట్టి పారేది! ఐనా ఆమె లక్ష్యం చేయలేదు. కాగా పట్టుదుప్పటిమీద పడ్డ ఆ కన్నీటితో ఆమె చక్కని, స్వచ్ఛమైన నదినీ, చిన్న సరస్సునూ చేసింది!

రెండో సంవత్సరం వచ్చేసరికి ఆమె కండ్లనుండి రక్తపుబొట్లు పడనారంభించాయ్! ఆ రక్తపుబొట్లుతో ఆమె ఉదయిస్తున్న సూర్యబింబాన్నీ, కిరణాల్నీ, పూవుల్నీ దిద్దింది!

మూడో సంవత్సరం పూర్తయేసరికి ఆమె తలపెట్టిన పని సలక్షణంగా సమాప్తమైంది! వాస్తవానికి ఆ తైలచిత్రంకన్నా, అల్లికా కుట్లుతో చేసిన ఈ పట్టుదుప్పటి ఎంతో మిన్నగా తయారైంది! నీలి మిద్దెలూ, ఆకుపచ్చని గోడలూ, ఎర్రని స్తంభాలూ, పసుపుపచ్చని ద్వారాల్తో ఉన్న ఆ భవనమూ, ఆ భవనానికి ఎదురుగా చక్కని ఉద్యానవనమూ, అవనంలో అందమైన పూలతోటలూ ఫలవృక్షాలూ లతలూ, గుల్మాలూ, పొదరిల్లూ! చెట్లమీద తీయనిపాటలు పాడే కోయిలలూ, మైనాలూ, చిలకలూ! వాటికి సమీపంలో చిన్న సరస్సూ, ఆ సరస్సులో తెల్లతామరలూ, ఎర్రకలవలూ, రంగు రంగు

(38వ పేజీ చూడండి)



ఆంధ్రసచిత్ర వారపత్రిక

వారఫలాలు

దైవజ్ఞ పాతూరి శ్రీరామమూర్తి

1-12-1961 శుక్రవారము మొదలు
7-12-1961 గురువారము వరకు

మేషం :

(అశ్వని, భరణి, కృత్తిక 1 పా.)

ముఖ్యంగా జాగ్రత్తగా ఉందామనుకున్న సందర్భంలోనే కాలు జారటం జరుగుతుంది. ఒకరి మెప్పుకోసం ఏ పనీ చేయలేము. అనే విషయాన్ని గుర్తు ఉంచుకొనండి. అనారోగ్యంఅంటు చేయదు. కాని, కార్యభారంవల్ల విశ్రాంతిలోపిస్తుంది. స్నేహితులవల్ల గౌరవం దక్కుతుంది. ధారాళంగా డబ్బు గుప్పిస్తేగాని, వ్యవహారాలు సకాలంలో నెరవేరవు. విలాస వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. గౌరవ పదవులు నిర్వహించటంలో అశాంతి, విసుగుదల కలిగే అవకాశాలున్నవి. ఇతరులకు సహాయం చేయటంవంటి బాధ్యతలు చాలావరకు నెరవేరుతవి. వృత్తి ఉద్యోగాలలో తలచిన ప్రయోజనం సాధించగలుగుతారు. 4, 5 తేదీలలో పండితులతో మైత్రి, శుభవార్తలు, ఇష్టవస్తులాభం.

* * *

వృషభం :

(కృత్తిక 2, 3, 4 పా, రోహిణి, మృగశిర 1, 2 పా.)

తాత్కాలికంగా శ్రమ, ఇబ్బందులున్నా మనస్సులోని మాటను నిర్భయంగా చెప్పగలుగుతారు. ఆదాయం బాగుంటుంది. కనుక ఖర్చులు పెరిగిననే బాధ తోచదు. పైకిమాత్రం అంతా మీ ఇష్టం అని చెబుతూ చాటున మీతో పోటీ చేసేవారు ఉంటారు. అవసరమైన వస్తువులు, వ్యవహార పత్రాలు సమయానికి లభించక చికాకు కలుగుతుంది. బంధు మిత్రుల ప్రోత్సాహంతో వ్యాపారం వంటి పనులలో డబ్బు పెట్టుబడి పెడతారు. భాగస్థులతో కలసి చేయు పనులు బాగా అనుకూలిస్తవి. నౌకరులవల్ల కార్యసిద్ధి ఉంటుంది ఇతరుల నిమిత్తం రాయబారం జరుపవలసి వస్తుంది. అధికారులతో సంప్రదించటంవంటి పనులు జరుగుతవి. కాని, ఇంతటితో పూర్తికావు. పేరు ప్రఖ్యాతులు వృద్ధి అవుతవి. 2, 3 తేదులలో కుటుంబంలో శుభ, సంతోషాలు, ప్రయాణ సూచనలు, స్వల్ప ధనలాభం.

* * *

> **గ్రహస్థితి**
>
> కర్కాటకంలో రాహువు, వృశ్చికంలో సూర్య, అంగారక, బుధ, శుక్రులు, మకరంలో గురు, శని, కేతువులు, సింహ, కన్య, తుల, వృశ్చికాలలో చంద్రుడు.

మిథునం :

(మృగశిర 3, 4 పా, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పా.)

పెత్తనము, డబ్బూ ఒప్పచెప్పి కలహం కొని తెచ్చుకున్నట్లుగా ఉంటుంది. ఏ సమయంలో జరుగవలసిన పనులు ఆ సమయంలో పూర్తి కావు. మిమ్ములను గురించి పదిమందీ గొప్పగా చెప్పుకోతగిన సమయం. బంధువులవద్దనుంచి వచ్చే వార్తలు అశాంతిని కలుగచేస్తవి. వాహనాలు, భూములు మొదలయిన వాటి నిమిత్తం మీరు చేయు ప్రయత్నాలు అనుకూల మార్గంలో ఉంటవి. పిల్లల ఆరోగ్యం సరిగా ఉండదు. సాధ్యమైనంతవరకు అప్పులు తీసుకువచ్చే ఆలోచనలు విరమించుకొనటం మంచిది. అధికారులవల్ల చెప్పుకోతగిన మేలు ఏమీ ఉండదు. ఆదిత్యహృదయం పారాయణం చేసుకొనటంవల్ల ఆరోగ్యము, ఆనందము లభిస్తవి. 1, 2 తేదులలో ధనలాభము, వృత్తిలో తోటివారివల్ల అనుకూలత.

* * *

కర్కాటకం :

(పునర్వసు 4 పా, పుష్యమి, ఆశ్లేష).

మీ హోదా పెరిగే సూచన లున్నవి. ఈ సమయంలో యథార్థం మాట్లాడితే మిమ్ములను ఎవ్వరూ నమ్మరు. వృత్తి వ్యాపారాలలో ఆందోళన తగ్గి అనుకున్న ప్రకారం కార్యక్రమాలు సాగించగలుగుతారు. అధికారులతో చేసుకున్న నిర్ణయాలు సక్రమంగా నెరవేర్చగలుగుతారు. మనశ్శాంతి మాత్రం లోపిస్తుంది. శక్తికి మించిన లావాదేవీల యందు ఆసక్తి అధికమవుతుంది. పట్టుదలలు పెంచుకుని ప్రతిజ్ఞలు చేయదగిన సమయంకాదు. ఆదాయం సాధారణంగా ఉంటుంది. సంఘ కార్యాలలో పోటీ వస్తుంది. కాని, దైవానుగ్రహంవల్ల క్రమంగా సర్దుబాటు అవుతుంది. 3, 4 తేదులలో అనుకునేది ఒకటి జరిగేది మరొకటి. కుటుంబంలోనివారికి అనారోగ్యం.

* * *

సింహం :

(మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)

ఎప్పుడో రాబోయే మాటను గురించి ముందుగా జాగ్రత్త పడతారు ఇంతకుముందుకన్నా మీ శక్తి సామర్థ్యాలు అన్నివిధాలా ప్రకాశిస్తవి పైకి తమాషాగా మాట్లాడుతూ మీ చేత డబ్బు ఖర్చు చేయించేవారు ఉంటారు కుటుంబంలో శాంతి, సుఖము లభిస్తవి ఖర్చులు మామూలుకన్నా పెరగగలవు కాని, ప్రయోజనం ఉంటుంది. పుణ్యక్షేత్రాలకు వెళ్ళటంవంటి కార్యక్రమాలు సుఖంగాను, సలక్షణంగాను జరుగుతవి. పెద్దవారిని కలసి సంప్రదించవలసిన సందర్భాలలో తరచూ ఆటంకాలు వస్తు ఉంటవి విలువగల వస్తువులు కొంటారు ఒకానొక సందర్భంలో అసమర్థులను, అడ్డం పెట్టుకుని పని గడుపుకోవలసి వస్తుంది. 5, 6 తేదులలో కార్యసిద్ధి, శుభవార్తలు.

* * *

కన్య:

(ఉత్తర 2,3.4 పా, హస్త, చిత్త 1, 2 పా.)

గ్రహబలం బాగున్నది శ్రమ వృథాకాదు. ముందుగా ఉపయోగిస్తుందనే విషయం తెలియక పోవటంవల్ల ఏ పనిలోనూ ప్రవేశించలేకపోతారు. స్నేహితుల సహాయం బాగుంటుంది. వాహనాలు, యంత్ర సామగ్రి, భూములు మొదలయినవాటి వల్ల ధనలాభం బాగుంటుంది. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతవి. మీ విరోధులు కూడా మీ మాటను అనుసరించవలసిన సమయం. ఈ సమయంలో ఇతరులకు అప్పులు ఈయవలసిన అవసరం ఏర్పడవచ్చు. ప్రయాణాలు మీరు అనుకున్నంత సులభంగా నెరవేరవు. వృత్తిలో సాటి వారిని సంతృప్తిపరచటంకోసం శ్రమను సహించక తప్పదు. 6, 7 తేదులలో దండుగ ఖర్చులు, ఆందోళన

* * *

తుల:

(చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు)

ఏ సమయంలో ఉత్సాహం కలుగుతుందో, ఏ సమయంలో ఎందుకు నిరుత్సాహం కలుగుతుందో తెలుసుకొనటానికి సాధ్యంకాదు. అయితే అన్ని రకాలమనుష్యులతోను తటస్థంగాఉండి మీ గౌరవాన్ని దక్కించుకోగలుగుతారు. ఆదాయం మాత్రం బాగుంటుంది. దైవానుగ్రహంవల్ల మీ వృత్తి వ్యాపారాలలో అన్ని విధాలా సమర్థులైనవారి సహాయము, సలహా లభిస్తవి. దేహ సౌఖ్యం బాగుంటుంది. సాధ్యమైనంతవరకు మీ మాటలలోనూ, పనులలోనూ సౌమ్య స్వభావాన్ని కాపాడుకొనటం అవసరం. అకస్మాత్తుగా ఆందోళన కరమైన వార్తలు తెలుస్తవి వారం రెండవ భాగంలో శుభ పుణ్య కార్యాలు నెరవేరుతవి. 5, 6 తేదులలో సంఘంలో గౌరవం, అనవసరమైన సందేహాలు.

* * *

వృశ్చికం:

(విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష.)

పదిమందిలో మాట, మంచితనము పెరిగి చక్కగా చలామణి కాగలుగుతారు వ్యవహార విషయాలలో అనుకూలత ఉంటుంది అనవసరమైన ఆడంబరం లేకుండా ప్రశాంతంగానే ఫలితం పొంద తగిన సమయం. ఎదటివారు మాట్లాడేది న్యాయంగా లేకపోయినా సమయానుకూలంగా సర్దుబాటు చేసుకోవలసి ఉంటుంది. పనుల వత్తిడి వల్ల వేళకు సరిగా నిద్ర, ఆహారము అమరక అసౌఖ్య. కలుగుతుంది మిమ్మలను స్తోత్రంచేసే ధోరణిలో మాట్లాడేవారిని నమ్మవద్దు. కుటుంబంలోని వారి సలహాను పాటించటంవల్ల సుఖము, లాభము పొందగలుగుతారు. 2, 3 తేదులలో గౌరవము, ఆదాయవృద్ధి, బంధు దర్శనం.

* * *

ధనుస్సు:

(మూల, పూర్వాషాఢ ఉత్తరాషాఢ 1 పా.)

ఈ సమయంలో చిన్న పనికి కూడా అట్టహాసము, ఆడంబరము ఎక్కువ. నలుగురూ మిమ్మలను గురించి గొప్పగా చెప్పుకొనటానికి మాత్రం అవకాశం ఉంటుంది. వృత్తి, ఉద్యోగాలలో సంచారం శ్రమ అధికం కావచ్చు. తరచూ మీ అభిప్రాయాలు మార్చుకొంటూ ఉండటంవల్ల వృథా ఖర్చులు పెరుగుతవి. వారం రెండవ భాగంలో ధనాదాయం బాగుంటుంది. భేదాభిప్రాయాలుగల మనుష్యులమధ్య మీరు చిక్కుకుని చివరకు ఏదో విధంగా బయటపడగలుగుతారు. మంచిమాటలతో మిమ్మలను బలవంతంపెట్టి కార్యభారాన్ని మోపేవారుంటారు. జాగ్రత్తగా ఉండండి. తలవని తలంపుగా పెద్దమనుష్యులతో కలహాలు రాగల అవకాశాలున్నవి. 4, 5 తేదులలో అకస్మాత్తుగా ధనలాభం, దేహబాధలు.

* * *

మకరం:

(ఉత్తరాషాఢ 2, 3, 4 పా, శ్రవణం, ధనిష 1, 2 పా)

ముందుగా ఒప్పుకున్న మాట ప్రకారం మీ ధర్మాన్ని నిర్వర్తించుకొంటారు. దూరమందున్న బంధువులవద్దనుంచి అశాంతిని కలిగించే వార్తలు రావచ్చు. స్వశక్తితో వ్యవహార వ్యాపార రంగాలలో వచ్చిన చిక్కులను సరి చేసుకోగలుగుతారు. ప్రయాణాలు చేదామని అనుకుంటు, చివరకు మానుకోవలసి వస్తుంది. ధన సంబంధమైన చిక్కులు తొలగిపోయి ఉత్సాహం లభిస్తుంది. ఈ సమయంలో దైవ కార్యాలకు ఆటంకాలు వస్తవి. కుటుంబంలో అభిప్రాయ భేదాలు రాగల అవకాశాలున్నవి. జరుగవలసిన పనులలో ఏదో ఒక లోపము అసంతృప్తి కనుపిస్తు ఉంటవి. అధికారులవల్ల కార్యసిద్ధి ఉంటుంది. సందేహాలు తీరిపోయి చురుకుగా కార్యకలాపాలు సాగించగల అవకాశం లభిస్తుంది. 1, 2, 3 తేదులలో శుభ సంతోషాలు, ధనలాభం, మంచివారితో స్నేహం.

* * * *

కుంభం:

(ధనిష్ఠ 3, 4 పా, శతభిషం, పూ. భాద్ర 1, 2, 3 పా.)

దైవబలం బాగున్న ఈ సమయంలో మీరు ఏ పని ప్రారంభించినా సులభంగా ముందుకుపోగలుగుతారు. గౌరవం లభిస్తుంది. రాజకీయాలలో అన్ని విధాలా సహాయంచేసేవారు లభిస్తారు. ప్రయాణాలు సుఖంగా జరుగుతవి. కొన్ని సమయాలలో దండుగ ఖర్చులు చేయవలసి వస్తుంది. వాహనాలు మొదలయినవి కొనే ప్రయత్నాలు అనుకూలిస్తవి. వ్యవహార రంగంలో ఫలితం పొందటానికి ఆటంకాలు వస్తూ ఉంటవి కాని, భంగం అవుతుందనే భయంలేదు. నౌకరులవల్ల అన్ని విధాలా ప్రయోజనం పొందగలుగుతారు వృత్తికి సంబంధించిన లాభవార్తలు తెలుస్తవి 4, 5 తేదులలో వ్యవహార పరిష్కారాలు, సంఘంలో గౌరవం.

* * *

మీనం:

(పూ. భాద్ర 4 పా, ఉ భాద్ర. రేవతి.)

మానసికంగా బాధపడుతూ ఉంటారు. పైకి మాత్రం దర్జా కాపాడుకొంటారు. యధార్థం తెలుసుకోకుండా మిమ్మలను సహాయం కోరేవారు ఉంటారు. ఖర్చులు మాత్రం పెరుగుతవి. కాని, అందుకు తగిన ఉపయోగం పొందలేకపోతారు. అధికారులతో స్నేహం చేస్తారు ఆదాయం తక్కువైనా ఆడంబరం మాత్రం చేయక తప్పదు. ఈ సమయంలో అనవసరమైన ప్రశ్నలతో మిమ్మలను విసిగించేవారు ఉంటారు. ఒకటి రెండు వ్యవహారాలలో గౌరవము ధనలాభముకూడా లభిస్తవి. మీ ఆరోగ్యం గురించి శ్రద్ధవహించండి. కుటుంబంలో సుఖ సంతోషాలు లభిస్తవి. బంధువులవద్దనుంచి ఎదురు చూస్తున్న వార్తలు రావు. 6, 7 తేదులలో నిరుత్సాహవార్తలు, వస్తునష్టం, శ్రీప్తులు. ★

ఈ వారము ధరలు

బంగారుధర నిలకడగా ఉండదు తరచూ హెచ్చు తగ్గులు వచ్చే అవకాశాలున్నవి వెండి ధర కొంచెం తేజీవచ్చి నిలుస్తుంది. నూలు, నూలు వస్త్రాల ధరలు కొద్దిగాపెరుగుతవి. వేరుశనగపప్పుధరలో మందీ కనుపిస్తుంది. నూనె ధర మాత్రం మామూలుగానే ఉంటుంది. నూవులధర మొదట్లో గిరాకి వచ్చినట్లు కనుపించినా, వెంటనే తగ్గి మామూలుగా నిలబడుతుంది. నూవుల నూనెధర మందీ అవుతుంది కందులధర తగ్గుతుంది. చింతపండు ధర పెరుగుతుంది ధనియాలకు గిరాకి వస్తుంది. పసుపు ధరలో తీవ్రమైన హెచ్చు తగ్గులు కనుపిస్తవి.


డాక్టర్ రాజు

బొమ్మల కథ

దేవిక

1





ప్రకటనా పాకం

మీరు అందముగా మరియు ఆనందముగా మరియు సుఖముగా మరియు ఆరోగ్యవంతముగా ఎలా ఉండెదరో తెలుసునా?

దానికి XXXX మార్కు XXX వాడిచూడండి. నిత్యమూ మనస్సు నిండిన విలాసభావములు కలుగును.

దేహ పరిమళమునకు, ముగ్ధ అందానికి సౌందర్యరాణులు వాడే 'అందం-లోషన్' నేడే మీ అభిమాన షాప్‌లో అడిగి చూడండి. మీ కేశ సౌందర్యం అధికమవుతుంది! మరియు అతి ప్రకాశమానముగా నుండును. మరియు తుమ్మెద రెక్కల వలె మెరుస్తుంది!

ఈ 'అందం-ద్రావకం' నేడే వాడి చూడరాదా?

* * *

క్రిములు! ఇవి బహు అపాయకరములు--మీ ఆరోగ్యమును క్షీణింపజేయవచ్చు. మరియు హానికరములు. నేడే జాగ్రత్తపడి ఎల్లప్పుడూ కళకళలాడుతూ ఉండే విధానం చూసుకొనండి. నిత్యజీవితములో 'క్రిమిరహిత'ముగా ఉండుట మంచిది!

* * *

బలహీనత! అవును--ఈ బలహీనత నెట్లు పోగొట్టుకొనటం! మరియు ఉత్సాహముతో మెదలటం!

భయపడవద్దు! ఇదిగో, XXX టానిక్ సేవించండి! ఆయురారోగ్యాభివృద్ధికి దోవ ఇదే! మరవకండి-బలహీనతకు, దీర్ఘాయుస్సుకు XXX మార్కు కల టానిక్--!!

* * *

—అవును! ఆమె విచారించుచున్నది. శ్వేతదంతములు లేని ఈమె నేయువకుడు వరించును?

—భయపడనవసరము లేదు! XXX వాడినచో అతిధవళమగును!

—ఆహా! ఏమి ఈ తెల్లని పళ్ల వరుస! చూడముచ్చటగానూ, మరియు ఆరోగ్యవంతముగానూ మరియు గట్టిగానూ ఉన్నవే! కొరుకుటకు బాగా ఉపయోగించును!

కె. కె. రాజా.

సన్మానం:

తెల్లవారింది, కోడి కూసింది.
కుక్క మొరిగింది, ఏదో పెంద్రపెట్టింది.
గడియారం గంటలు కొట్టింది.
రోడ్డుమీద కోలాహలం బయలు దేరింది.
దొంగని పట్టుకున్నారేమో ?
కాదు. ఎలక్షనులో ఎన్నికయిన అభ్యర్థికి సన్మానం.
అంతేనా! దొంగేమో అనుకున్నాను.

కె. ఆర్. కె. రావ్ (కలకత్తా)


* * *

ఉద్యోగులకు సూచన:

ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వంవారు మహాయాసంగా [illegible] చేసిన పే స్కేళ్లవల్ల మీ కొచ్చే దేమైనావుంటే ప్రభుత్వంలో అవసరమైన ఖర్చు పడకుండా పుచ్చుకొని క్రొత్త వాక్యాలూ, క్రొత్త రాగాలూ కల్పించుకొని పోలింగు సమరంలో సారథ్యం వహించటానికి సిద్ధంగా వుండండి.

ప్రసాదరావు (హైదరాబాద్)

★




సమాధి




కొండల ప్రక్కనుంచి మలుపులు తిరిగి, ఆశ్రమన్ను దగ్గర దక్షిణంగా కిందికి ఒరుగుతోన్న సెలయేరు కొత్త ప్రవాహంతో ఉద్వేగాన్ని ప్రతిధ్వనిస్తోంది ఆ లోయల్లో. అది చీకటిరోజో, వెన్నెల రోజో చెప్పడానికి వీల్లేకుండా మబ్బులు ఆకాశాన్ని ఆవరించుకొని తాత్కాలికంగా కాళరాత్రినిచేసి, అసలే భయంకరమైన చీకటితో నిండివుండే ఆ లోయని తన పరిపాలన కిందికి తీసుకొన్నాయి. పెనుభూతాల్లా ఆవరించుకొంటున్న మేఘాలని చూసి రాపాడినాయి చెట్లు. కొండ తుప్పల్లోని జంతు ధ్వనులు వినబడకుండా చేస్తోంది జలపాతం. జలపాతానికి దక్షిణంగా ఆనుకొనివున్న చిన్న కొండగుహ పక్కన ఒదిగి ఆలీనంగావున్న యాగశాలలో ఒక హరికేన్ లాంతరు మసకతిన వ్యక్తిలా కొట్టాడుకొంటున్నది

యాగశాల మధ్యలో నిత్యాగ్నిహోత్రం రక్తవర్ణం ఆ పక్కనే పద్మాసనంలో కూచొన్న సాధువుగారి శరీరంమీద ప్రతిఫలిస్తున్నవి. జితేంద్రియత్వంలో అంతర్నేత్రాలతో వున్నారు అగరొత్తుల ధూమమే పరిమళాలని వ్యాపింపచేస్తోంది

'భగవాన్' అని పిట్టారుస్తూ "వచ్చేశాను స్వామీ' అని సీతారామయ్య తడిసిన తలని తుడుచుకొన్నాడు. ఖద్దరు లాల్చీ ఆ దీపవెలుగుల్లో పంచె కావిరంగు యింకోలా కన్పిస్తోంది శరీరం ముడతలు పడింది. తల జనపనారలా నెరిసింది క్రాఫ్. 'కన్ను పొడిచినా కన్పించని చీకటి స్వామీ! రెండు మూడు చోట్ల కాలు జారింది' అని లాల్చీ విప్పి కి కొయ్యకి తగిలించి, 'శివరాత్రిలా కాకుండే యీరోజు భలే తంగొచ్చినట్లు చేస్తోందే' అని, కొంత మౌనం తర్వాత ' అసలు జరుగు అలాంటిది దొరికింది—అదృష్టంకొద్దీ' అన్నాడు యథాలాపంగా

అగ్నికి ఎదురుగా నేనువాళ్ళ చూస్తున్న యింకో సాధువుగారు యీరోజు శాంభవిని చెప్పిన



విషయాలన్నీ విన్న తరువాత సీతారామయ్యమీద వున్న గౌరవం పోవడంవలన హెచ్చిన అసహనాన్ని దూరంగానే వుంచ ప్రయత్నిస్తున్నారు. వాతావరణాన్ని భయంకరం చేస్తూ, చల్లని సుళ్ళు గాలులు విజృంభించి యాగశాలని వణికించేస్తున్నాయి.

'శాల'కి ఉత్తరంగా ఆనుకొని గుహ. ఓ పక్క గోడకట్టి, తలుపులుపెట్టి యిల్లులా చేసారు. ఆ గుహలో అన్నపూర్ణ పీఠం స్థాపించారు. అలా గుహని స్థాపించినవారు జితేంద్రియులై ధుని దగ్గర పద్మాసనంలో కూచొన్న సాధువుగారు. దరినే పూలమాలాలంకృత త్రిశూలం నిలబడివుంది.

భంగు చేయడానికి ముందుగా, చలి తగ్గించుకొని ఉషారెక్కడానికి చిలుము నింపాడు. 'హరి ఓం తత్సత్' అని జలపాతంకి మించిన ధ్వనితో భగవాన్ సంస్మరణచేసి, అందంగా చిలుము వ్రేళ్ళల్లో పట్టి, పైకెత్తి, నుదురుమీంచి పెదవులు దగ్గరకు తీసుకొచ్చి, కొంతసేపు మెల మెల్లగా పీల్చి విడుస్తూ ఆఖరిపట్టు గట్టిగాపట్టి మేను వాల్చిన సాధువుగారికి అందించాడు.

సీతారామయ్య విదల్చుకొని లేచి భంగుచేసే యత్నంలో వున్నాడు. గంజాయి మంచి దవడం వలన వాసనలు తెరలు కప్పుతున్నాయి. వర్షం పడుతోంది. గాలి కూడా కలవడంవలన ఆ శాలలోకి పదే పదే జల్లులు కొట్టుతున్నాయి. మేనువాల్చిన సాధువుగారి వెన్నుని జల్లులు తట్టి లేపుతున్నాయి.

జుత్తూ, గడ్డమూ బాగా పెరిగి, నెరసి, శరీరం కృశించివున్న సాధువుగారు చిలుము రుచి చూసి మళ్ళీ మేను వాల్చారు. చిలుము పీల్చినా, మేను వాల్చినా ఉదయపు జ్ఞాపకాల జల్లులు తగ్గలేదు. జల్లుల హెచ్చరికలకు తట్టుకోలేకపోతున్నా రాయన.

సీతారామయ్య యీ ఆశ్రమానికి తనకంటె ముందునించీ వస్తున్నాడు. స్వామిగారికి ప్రియమైనవాడు కూడా. తమ ముగ్గురికీ సంబంధించి వంతవరకూ మంచివాడే. కొండమీద వున్నారు గాబట్టి యీ కుండపోత వర్షంగాని, పెల్లుబికి వస్తోన్న వెల్లువగాని తమకేమీ కాదనుకోవడం అందువలన దాని అవసరం లేదనుకోవడం, పల్లెలోని వూరియిళ్ళలో నిలవిల్లాడే సంసారుల ఆశ గురించి ఆలోచించక పోవడం సంకుచితం—అదీ పూర్వాపరాలని ముడి వేస్తున్న మరణించని జ్ఞానం.

ఈ లోయని, గుహనీ స్వామిగారు నాలుగేళ్ళ క్రితం చూసారు. అప్పట్లో యీ లోయ జంతు భయంతో నిండివుండేది. ఈ గుహలో చిరుతపులు లుండేవని పలువురి నమ్మకం. స్వామిగారు ఓ చిన్న పాక వేయించారు. పక్కనే వేసవిలో యింకిపోయే సెలయేరు. శాలకి పశ్చిమంగా చిన్న నుయ్యి తవ్వించారు అందుకే.

మందుల కుపయోగించే మొక్కలు, పూల మొక్కలు సంపాదించి నుయ్యికీ, శాలకీ మధ్య పాతిగ్గజాల పూలతోట పరచారు. శాలలో ఓ శుభ ముహూర్తాన హోమగుండం యేర్పాటుచేసి నిత్యాగ్ని పూజని ఆరంభించారు.

ఆ దీక్షతో చుట్టుప్రక్కల గ్రామస్తులలో కొంత సంచలనం రేకెత్తించి, తన కోరికను విన్నవించి, భారతీయ వైదిక సాంప్రదాయాలని పునః స్థాపించమని కోరారు. తత్ఫలితమే యీ పాక—యాగశాలగాను, గుహ—గుడిగాను మారడం.

ఆ జనంకి యాగమంటే అర్థంకాదని, తన కృషి వృథా అవుతుందనీ రెండేళ్ళ తరువాత స్వామిగారికి అర్థమయిన వెంటనే గుడిలో అన్నపూర్ణను స్థాపిస్తానన్నారు. అలాగేనని ప్రజలు కూడా అంగీకరించడంతో ఆ పీఠాన్ని ఓ పర్వదినంనాడు, భారీ యెత్తున అన్నదానాలతో స్థాపించి దాని అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారు. అలాంటి సమయంలో తనకున్నది కొంత సహాకరిస్తూ, అంటుకొన్నవాడు సీతారామయ్య. తర్వాత దినాల్లో యీ సాధువుగారు వచ్చారు.

శాలలోకి వర్షపు జల్లులు కొట్టడంతో, తడిసిపోవడంవలన సాధువుగారు లేచి, హరికెన్ దీపం ప్రక్కనవున్న పడక కుర్చీలో కూచొని, బల్లమీది పుస్తకాన్నొకదాన్ని విప్పారు అక్కడవున్న ఆ

మేనేజర్:-(గుమాస్తాతో) ఏమయ్యా! అన్ని భాషలూ మాట్లాడ్డానికి రావాలంటే ఏం చెయ్యాలి?

గుమాస్తా:-వెంటనే ఉద్యోగానికి రాజీనామా యిచ్చి హోటల్లో సప్లయర్‌గా చేరాలి సార్!

ఎన్. అప్పారావు (తుంగభద్రా డామ్)

ముగ్గురిలోనూ సాధువుగారు జ్ఞాని. ఆ విజ్ఞానం నొప్పులు యింకా తగ్గక బాధ పెటుతున్నా యిపుడు. సంస్కృతాంధ్రాంగ్లాలలోను, తమిళంలోను విద్వాంసులు వేదాలు, స్మృతులు మొదలుకొని—ప్రపంచ రాజ్యాంగాలు—పరిపాలనాధోరణులు వరకు మాటాడగల పరిపూర్ణులు. అక్కడ బల్లమీదవున్న కొద్ది పుస్తకాలూ ఏవో అనుకొంటున్న నిరక్షరాస్యజనం యింకా గుర్తించలేదు వాటి ప్రాశస్త్యాన్ని.

అంతటి సాధువుగారు కూడ అన్నపూర్ణ కావిడి భుజంమీద వేసుకొని, గంటలు గణ గణ మ్రోగుతోంటే, ఆ చుట్టుప్రక్కల రెండు మూడు గ్రామాలు శంఖనాదంతో పవిత్రంచేసి, తిరిగి భిక్ష తెచ్చి అన్నపూర్ణ పూజలు చేస్తున్నారంటే, స్వామి గారిలోని మహాత్మ్యంనీ, యీనాటికి సాధువుగారు తన జీవితంలోకి వరంగా, బాధ్యతగా తెచ్చుకొన్న వోర్పునీ, తనకు అర్థమయిన సత్యం పరిపూర్ణతనీ ఆలోచించాల్సివుంటుంది.

మాలచ్చిమి గురించి సాధువుగారు ఆలోచిస్తున్నారు. ఆ కావ్యంలో ప్రధానపాత్ర సీతారామయ్యది. మాలచ్చిమి అతని పాదసేవాభాగ్యానికి నోచుకున్న సేవకురాలు. ఆమె తన నాలుగు పుష్కరాల జీవితంలో ముప్పాతిక తన ప్రభువు కోర్కెలకీ, సుఖాలకీ, గౌరవాలకీ వినియోగించి యిపుడు కుమారునికీ, తండ్రికీ మధ్య వుంది, స్వర్గానికీ, భూమికీ మధ్య వున్నట్టు. ఆమె కళ్ళు చుట్టూ యేర్పడిన నల్లని నీడల్లో పేరుకొన్న వ్యథా మాలిన్యం, చూపుల్లో కన్నీరు, వాక్కులో అంతిమ త్యాగాలతో నిండిన సాహసం, భర్త అంగీకారంకోసం ఆమె రోదన కుంగదీస్తున్నాయి సాధువుగారిని. అక్షరాలమీద మనసు నిలుపుకోవాలనుకొంటున్న తన మనసు మాలచ్చిమితో నిండిపోతోంది.

సాధువుగారు వాలు కుర్చీలో నడుమువాల్చి నిట్టూర్చారు. ఈ నిట్టూర్పులు జీవితంలో లేకండా చేసుకోవాలనే తన యత్నం యీదినం మరోసారి పరాజయమయింది.

శేషజీవితాన్ని కరుణతో వెలిగించుకోవాలని, సేవకి అంకితం చేసుకోవాలనీ అనుకొన్న తన ధ్యేయానికి వెనక నుయ్యి, ముందు గొయ్యి.

హింస. . . . .క్రౌర్యం. . . .

ఏ బంధాలనించి విముక్తుడయిపోయి, యీ లోయలోని జంతుభయవలయంలో, జ్ఞానం, సమాధిలోవుండే మెట్టుమీద అడుగుమోపాడో—ఆ అనురాగాల ఆకర్షణలో చీకటి చిత్రహింస యింకా విడిచిపెట్టలేదు

పూలతోట. తను పువ్వు కాకూడదు. తుమ్మెదా కాకూడదు. సూర్య చంద్ర తారకలూ కాకూడదు. వాయువాకాశాలూ కాకూడదు. తీర్థమూ కాకూడదు. అవన్నీ పరిపాలిస్తే తను ప్రేక్షకుడవాలి. స్వార్థమూ వద్దు. పరమార్థమూ వద్దు. ఈదినం పెంచడం రేపు తెంచడం తనకి వద్దు. ఈ క్షణం మురిసిపోవడం, రేపు మరచిపోవడం—ఊహూ! ఈనాడు స్వీకారం—మరునాడు తిరస్కారం—భగవాన్—వద్దు. నాలోని చేతన నన్నుగా నిలపడానికే వుపయోగించనీ—భగవాన్ !

మేఘం బరువు మోస్తో వచ్చింది. కన్నీరు కురిసింది. కాని యీ పర్వతం కరగదు. పోనీ కరగలేదు. ఆ చల్లదనమూ—ఆ చిలకరింపూ అనుభవమైపోయి ఔస్మృతి యేర్పడింది

గతం సాధువుగారికి ప్రత్యక్షమయింది. తనకు తల్లి వుంది. తండ్రి వున్నాడు. పెరిగాడు. ఆ యిద్దరూ లేరు. మూడోది వుంది. నాలుగోవాడు తయారయాడు. పెరిగాడు. కృశించిపోయే దగ్గరికి, ఒకడు చిన్న—కొత్త—అయినవాడు తరిగాడు. మూడోది పోయింది. అతనికి మిగిలింది ఆ చిన్న చరిత్ర. అందులోని పాత్రలూ, రూపాలూ, నటనలూ, సంభాషణలూ, సన్నివేశాలూ. అప్పటినుంచి తీర్థయాత్రలు—సన్యాసం — అన్వేషణ—చీకటిలో, చలిలో, న్నత్యంలో, అగాధంలో.

సీతారామయ్యకు అన్నీ వున్నాయి. కూతుర్ను కాపరంలో వున్నారు. కొడుకు ఉద్యోగంలో వున్నాడు. వ్యక్తిత్వాన్ని పెళ్ళినాడు ముప్పయ్యారేళ్ళ దూరంలో మరచిపోయి, హిందూధర్మాలతో, ఆచారాలతో మలచబడిన భార్యయి, తల్లిగా మారి, యీనాడు యిల్లాలయి మిగిలిన మాలచ్చిమి వుంది. పదెకరాల ఆస్తి వుంది. సమాజంలో గౌరవించే స్థానం వుంది.

అలాంటి సీతారామయ్య యీ సన్యాస సహచర్యం యిలా గుండెలు కొండలు చేసుకోవడం ససేమిరా సాధువుగారికి సహించడం లేదు

అరుదుగా కొండల్లో ఉరుములు ప్రతిధ్వనిస్తున్నాయి మెరుపులు చూపులను కొరుకుతోన్నాయి ' జల్లుల తుంపర్లు గాలితో రాలుతున్నాయి కొండమీంచి జారుతోన్న నీరు శాలలోకి వురకకుండా పునాది గోడ ఆపుతోండగా, తూర్పుగా సెలయేర్లో, వెర్రిగా పిలుస్తూ, కలుస్తోంది.

సాధువుగారిలో భిన్నవాదాలు రేగుతున్నాయి. సీతారామయ్యకు బుద్ధులు చెప్పాలని అణగారిన ఓ శక్తి మూలుగుతోంది అది చెప్పాల్సిన విధం తెలీడంలేదు అంతలోనే అతనిలో మార్పు కలుగుతోంది తనెవరు? చెప్పడమేమిటి? చెప్పుతున్న దెవరికి? ఎందుకు? అన్నీ చెప్పేవాడూ, చేయించేవాడూ తనా? అందుచేత సాధువుగారు మళ్ళీ మౌనం వహిస్తున్నారు తనలోంచి ప్రాపంచికజ్ఞానం కొనవూపిరితో చిగురిస్తోంది

ఈదినం మాలచ్చిమి పూజాపళ్లెరంతో వచ్చి తన అచంచలతని కరిగించింది ఆమె మాట మాధుర్యంలో మాతృత్వం పాలు యెక్కువయి తనని అల్పజ్ఞుణ్ణి చేసేసింది

కొడుకు—

తండ్రి గడప తొక్కననడంతో అసలు సీతారామయ్యలో మొదటి మార్పు కలిగి వుండొచ్చు కొడుకు మహమ్మదీయ వనితని పెండ్లాడడంతో సంఘంలో విలువ దెబ్బతిని, ఆస్తిని కూతుళ్ళకు రాసేసి, చిల్లర సన్యాసులతో కూడి యీ గంజాయాది అలవాట్లతో విస్మృతి కోరాడేమో! కాని వేలాది దివాల స్మృతులు యెలా విస్మరించాడో యిపుడు అర్థంకాని కొన్ని విషయాల్లో ఇదివకటి

'నీవే చేశావు మాలచ్చిమీ నిన్ను నరికినా పాపం లేదు' అని మాతృప్రేమని నిర్లక్ష్యంచి భర్త ఉరిమిన రోజున తను చనిపోయుంటే యీ కష్టాలేవీ వుండేవికావని రోదిస్తుంది

మాలచ్చిమి కుమారుడు అర్థరాత్రివచ్చి, 'నన్ను నమ్మి తల్లినీ, తండ్రినీ, ఆస్తినీ, బంధువులనీ విడిచి వొచ్చేసింది నేను మోసం చేయాలంటే చచ్చిపోవాలమ్మా' అని కన్నీటితో పూజించి, పాద ధూళి ఫాలాని కద్దుకొన్నపుడు ఆమె వేదన పెద పులిలా పెకలలేదు


తనకు చూపించడానికి కోడలిని పొరుగూరు, ఎవరికీ తెలీకండా చాటుగా తెచ్చినపుడు, యవ్వన పరిమళాలతో పెరిగిన దేహాన్ని చూసి, తనకు తెలీని యే పాత రోజుల అవ్యక్తఛాయల్లోనో నిలబడి, కరుణలతో కరుగుతోన్న కళ్ళని చూసి భగవంతుని మనసునిండా నింపుకొని ఆశీర్వదించింది

సాధువుగారు సీతారామయ్య భంగు తొరపడం ధ్వనితో చలించారు భంగు యెంత తొరిపితే అంత మత్తు, రుచి వస్తుందని చెపుతారు. సీతారామయ్య యింకోవిధంగా ఆలోచించడంలేదు. భంగు వాసనలతో, రంగులతో రుచి వూహిస్తూ, చెయ్యాల్సినవన్నీ క్రమం తప్పకండా నిదానంగా చేస్తూ, తన వోర్మిని అవిధంగా వినియుక్త చేసుకొంటున్నాడు ఆ చిన్న సంఘటనచాలు సీతారామయ్య అమాయికత నించి పుట్టి పెరుగుతున్నా దాను కోవడానికి

కోడలు గర్భవతి అయిందని అక్కడనుండి వచ్చిన ఓ మనిషి చెప్పిన రోజునుండీ ఆమె పరిస్థితి అగమ్యముగా వుంది ధైర్యంచేసి పురుడు పోయడానికి తెచ్చుకోవాలని ఆమె బాధ. అయితే ఆయన ఊ అనాలి. సీతారామయ్య ఉహూ అని కళ్లెర్రజేస్తాడు అందుకు ఆమె భయం ఆ విషయం భర్తతో మొరపెట్టుకొనే ధైర్యం హిందూ సమాజం ఆమెకి ప్రసాదించని దురదృష్టానికి పర్యవసానంగా సాధువుగారితో ఉదయం చెప్పుకొంది— పాదాలని చూస్తూ

సాధువుగారు అభయమిచ్చారు— చెప్పినవన్నీ విని అప్పుడనుకోలేదు—ఈ విషయం చెప్పడంలో యింత కష్టం వుంటుందని సీతారామయ్య తన మాట ధిక్కరించలేడని నమ్మకముంది తన మాటకి యెదురు ప్రశ్న కూడా వేయలేని బలహీనుడు తన దగ్గర—అన్న విషయం కూడా సాధువుగా రెరుగును కాని తన రక్షణకి భద్రత లేదని తెలిసినపుడు పిల్లికూడా కళ్ళు పీకడానికి వురుకుతుంది కప్ప కరుస్తుంది

సీతారామయ్యా! పూతేరు— దండగుచ్చు చందనం తీయ్ గుడి కడుగు శాల వూడ్చు కర్రలుతే పొయ్యి వెలిగించు భోగంకోసం వంట చెయ్ పొరుగూరు వెళ్ళి ఫలానా ఫలానా తీసుకోరా అన్నీ చేస్తాడు— అవసరమొస్తే ఎక్కడో దాచుకొన్న తన వ్యక్తిత్వం రక్షించుకోవడంకోసం యెన్నిదగ్గర్లన్నా మనిషి బానిసయిపోతాడు ఆ వ్యక్తిత్వానికి సంబంధించిన దగ్గర యితరులు ఆగి తలవంచనపుడు ప్రమాదాలు వస్తాయి అందుకు యీనాడు సాధువుగారు తను మాలచ్చిమికి యిచ్చిన అభయంగురించి పూర్వాపరాలు ఆలోచిస్తున్నారు



సమాధిలోంచి లేచిన జ్ఞానం

'పరవాలేదమ్మా. అన్నీ చెబుతాలే బాగానే జరుగుతాయ్' అని మాలచ్చిమికి ధైర్యమిచ్చినపుడు పరమానందసంభరిత అయిపోయి, ఆనందాశ్రువులు తుడుచుకోవడం చూసిన సాధువుగారు, తన విధినిర్వహణకోసం మళ్ళీ మళ్ళీ ఆలోచిస్తున్నారు.

వర్షం తగ్గింది గాలి హెచ్చింది శాల వూగుతోంది పాతపడింది శాల. పుచ్చిపోయి విరిగిపోయాయి కొన్ని కర్రలు. ఒరిగిపోయింది. ప్రమాదం లేకండా అడ్డంగా కొయ్యిలు నిలబెట్టి పైకప్పుని నిలబెట్టారు. సాధువుగారు లేచి గాలికి పడిపోవడానికి వీల్లేకండా యింకోకర్ర, పశ్చిమపక్క, దక్షిణచూరుకి దన్నుపెట్టారు. ఈ శాలతో తమ కార్యంకాదు తమ సౌకర్యంకోసం కాక ఆశాలకోసం తమ శక్తి వృధా అవుతోంది. అక్కడా మానవుడికి మిగులుతున్నది పరాజయమే. కొత్త పునాదులు వేశారు. భవనం కావాలి. నిర్మాణానికి యింకోశక్తి కావాలి. ప్రజ ఉత్సాహం, త్యాగం కావాలి. అదే లక్ష్యంతో స్వామిగారు విభూతితో అలంకరించుకుని, అరుణిమల అగ్నిదరి నిశ్చలులై, సత్యాగ్రాహిగా కూచున్నారు.

చిన్న జ్వాల నీలంగా పైకెగసి నాట్యం చేస్తోంది. నివురు రాల్తోంది. ఉష్ణం ఓ పక్క సాధువుగారిని హింసిస్తోంది. అయినా ఆయన లక్ష్యం నిర్వికల్పమై, జపమాలాలంకృత హస్తాలతో, జితేంద్రియత్వంతో ఆసీనులయ్యారు. మెడలో వక్షస్థలంమీదుగా వ్రేలాడుతోన్న రుద్రాక్షమాల పక్కనే కమండలం

'భగవాన్. . . . భగవాన్. . భగవాన్. . . • ఓం ఓం ఓం' అని ప్రణవం ప్రతిధ్వనించ నినదించి, సీతారామయ్య నిప్పుకి భంగు నైవేద్యం సమర్పించి, స్మరించి, ఓంకారం పునరోచ్చరించి సేవించాడు. ఆ నిగనిగలాడే నిప్పులో ఆవిరైపోయింది సీతారామయ్య వేసిన నైవేద్యం. శనివారం—సాధువుగారికి. స్వామిగారిని భంగం చేయరాదు

కెంపురంగు చీర కట్టుకొంది. పసుపు శరీరం నిండా పూసుకొంది వదులు జుత్తు ముడి వ్రేలాడుతోంది ఎంతటి మహాత్ముమైనా అనసూయలా పిల్లలని చేసేసే ప్రవర్తన. వంగపండు రంగు శరీరం—సన్నగా అమ్మ. కావ్యాల్లో చదివిన అన్నపూర్ణ ఆమె.

క్రమంగా ప్రకృతి కాంతివంతమయింది. సెలయేర్లో చంద్రికలు ప్రవహిస్తున్నాయి. పొలాల్లో తేలిన నీళ్లల్లో నక్షత్రాలు మెరుస్తున్నాయి. మేఘాల చీకటి వెన్నల్లో కరిగిపోయింది.

సీతారామయ్య సాధువుగారికి ఎదురుగా కింద చాపమీద కూచొని, 'యీ ప్రవాహం వేసవిలో కూడా యిలానేవుంటే యెంత బావుణ్ను స్వామీ' అన్నాడు. మత్తు కమ్మలేనట్టుంది కనురెప్పలు యింకా బరువు కాలేదు.

చేతిలోని పుస్తకం సాధువుగారు పక్కబల్లమీద

పెట్టారు. ఏం జవాబు చెప్పలేదు. విన్నట్టు గ్రహించాడు సాధువుగారు మాటాడలేదంటే, అతనన్నమాట బరువైనదని, ఆలోచిస్తున్నారని సీతారామయ్య అభిప్రాయం

'ఏమిటో ఆ పరమేశ్వరుని విలాసం—ఇంకి పోతుంది కొన్నాళ్ళు ఒడ్డు లొరుసుకు ప్రవహిస్తుంది కొన్నాళ్ళు. మురికై కంపుకొటుతుంది మరికొన్నాళ్ళు' అతీతశక్తి చర్చాధోరణిలో అన్నాడు,

సాధువుగారు సత్యతత్వచింతలో వున్నట్టు మౌనాన్ని అర్థం చేసుకొన్నాడు సీతారామయ్య

ప్రవహిస్తోంది—

ఈ నవ వెల్లువ ప్రమాదంగా, బురదతో, క్షాళన చేస్తో వస్తుంది. ఇది ఉపకరించదు శక్తి వంతమే అవనీగాక.

జలపాతంపాట—

కాని క్రమంగా విర్మలమవుతుంది. స్వచ్ఛమవుతుంది. ఈ ఉద్రిక్తం తగ్గుతుంది మాతృత్వంలో నడలూ, హాయలూ.

మత్తెక్కిన తాగుబోతులా నక్కలు ఊళలు వేస్తున్నాయి.

నీరింకిపోతుంది. దుర్గంధం పేరుకొంటుంది. అందులో పురుగులు కదులుతాయి.

లోకం నల్లని మేఘాలు ఆవరించి భయపెట్టి వష్టపెట్టి కడిగేస్తాయి.

'మాలచ్చిమికి కొడుకంటే ప్రేమ కాని కొడుకు మాలచ్చిమి పరువూ ప్రతిష్ఠ ఏముంచాడు? జాతీ, నీతీ యేం నిలబెట్టాడు—స్వామీ!

తులసివనంలో గంజాయిమొక్క పెరిగింది!

భర్త నోరారా మాలచ్చిమీ అని పిలవడం ఆమె వరంగా స్వీకరిస్తుంది.

'కులవిద్యకు సాటి లేదన్నారు పెద్దలు. ఎప్పుడు దాన్ని కాదన్నాడో వాడు భ్రష్టుడే. తురకల కూడు తిన్నాడు. నా కళ్ళెదుటపడుంటే బలిద్దును' మత్తులో వస్తున్నట్టున్నాయి మాటలు. సాధువుగారు వింటున్నారు. కొన్నిదగ్గర్ల బాధ కలిగిస్తున్నాయి. తనూ తురకల కూడు తిన్నాడు! అందుకు.

బాధ—సంతోషం—వద్దు అని హృదయాన్ని తేలిక చేసుకొంటున్నారు సాధువుగారు.

'కూతుళ్ళిద్దరూ కళ్ళు పండుగ్గా కాపరాలు చేస్తున్నారా—మాలచ్చిమికి ఆ సంతోషముండొద్దూ ఆస్తి వాళ్ళపేర రాసేస్తానంటే లంకణాలు చేసింది పోపొమ్మని రాసేశాను '

పరిత్యక్తసుతుడు కర్ణునికోసం విలపించే కుంతి జ్ఞాపక మొచ్చింది—సాధువుగారికి భగవాన్ చెడిపోతున్న తన బిడ్డలకోసం పరితపించినట్టు తల్లిప్రేమ అన్వేషిస్తుంది

'పుట్టిన్నాడే చచ్చాడనుకొంటాను స్వామీ—చనిపోతే యేం చేసేవాడిని స్వామీ?'

క్షణం తలవంచేవాడేమో!

'ఆనాడు చనిపోయినా సంతోషిద్దును ఈ కులాన యీ బాధలు, లోకంలో యీ అవమానం పడాలని భగవాన్ రాశాడు—స్వామీ—రాశా డా భగవంతుడు '

సాధువుగారి ఆలోచనలు సీతారామయ్య పేలా వనలకి కదులుతున్నాయి ఆ బాటలో నడుస్తు న్నాయి

మానవ మమతల్లోకి యింత మాలిన్యం, అనహనం యెలా వచ్చి కలిసాయి? కొడుకు స్వతంత్రంగా జీవించడం తప్పా? యవ్వనంలో తనకి కావలసిన సుగుణాల యవ్వనాన్ని కోరుకోవడం తప్పా?

ఉద్యోగానికి వెళ్ళడం—కొత్త వాతావరణంలో తిరగడం

"ఈశ్వర అల్లా తేరేనామ్
సబ్‌కో సన్మతి దే భగవాన్"

పాటలు పాడడం—మంచినంతా వెతికి పూల తోట వేసుకోవాలనే సాహసం—యివన్నీ యెక్కడ వీగిపోయి బలైపోతున్నాయి?

సంకుచిత సరిహద్దులకి

సనాతనత కంపుకి.

విశ్వంవేపు పెరగని స్వార్థార్థంలో పరిభ్రమణానికి

హాస్టల్ మేనేజరు:- [హాస్టల్ వరండా ప్రవేశించి నేలపై పడివున్న సిగరెట్టు ముక్కను చూసి, కోపంతో, అప్పుడే అటువెళ్తున్న ఒక విద్యార్థిని గమనించి పిలిచాను. ఆ విద్యార్థి రాగానే, మహా కోపంతో సిగరెట్టు ముక్కను చూపిస్తూ] ఎవరిదీ?

విద్యార్థి:- (వినయంగా) నాది కాదండీ. కావాలంటే తమరు తీసుకోవచ్చు.

మాడవ నిత్యానందం, (పుదిపట్ల)

కారణాలు తెలుసుకాని, చెప్పి, హితబోధ చేయాలనిలేదు. తన మౌనం అతనిలో అశాంతి జ్వాలల వెల్గించి కలుషాన్ని కాల్చగలదని నమ్మకం

చల్లగాలి స్వచ్ఛ స్వేచ్ఛాలను చల్లుతోపోతోంది. రాత్రి నిశ్శబ్దంతో, నిద్రతో, మైమరచిపోయింది జలపాతం అర్థంకాని సంగీతాన్ని విన్పిస్తోంది ఆ సంగీతానికి యే క్రూరజంతువులు తలలూపుతున్నాయో—పరవశంతో ఏమో. లేక మీనాలు విశ్రాంతి నెరగని నృత్యంలో లీనమయాయో!

* * *

వర్షం కడిగిన ప్రకృతి హరితవర్ణంమీద, తూర్పు దిక్కు పగడాల రాసుల క్రిందినించి సువర్ణ చ్ఛాయలు కరిగి కురుస్తోన్నాయి. నెమలి లేచి, ప్రార్థన చేసి, చెట్టుక్రింద విప్పారినచంద్రికలతో నర్తిస్తోంది

స్వామిగారు పూజ చేస్తున్నారు. సాధువుగారు సెలయేర్లో స్నానంచేసి సూర్యవందనం చేస్తున్నారు సీతారామయ్య పూలు కోస్తున్నాడు.

కొండ మలుపు దగ్గర, సుమారు ఫర్లాంగ్ దూరాన పశ్చిమంగా నలుగురైదుగురు మనుషులు చేరి కేకలు వేస్తున్నారు అరగంటలో అక్కడ జనం రద్దీ హెచ్చింది

యాగశాలవద్దకి పాలవాడు వచ్చాడు సీతారామయ్య పాలు తీసుకొని "ఏంట్రా అది—అక్కడా జనం?' ప్రశ్నించాడు.

'ఎవరో శవం బాబూ. వయసుగడిచిన మనిషి. తేలొచ్చి చెట్టుకి టిక్కవడింది. ఆడమనిషి. వొంటిమీద గుడ్డన్నాలేదు బాబూ' అన్నాడు బాధ పడుతూ

సీతారామయ్యకి భయమేసింది ఆడమనిషి. వయసుగడచిన మనిషి. ఎవరు? తన మనసులో నీడ. ఆడమనిషి. పాలక్కడ విడచి పరుగెత్తాడు పాలవాడు ఆశ్చర్యపోతున్నాడు. తడివస్త్రాలతో వస్తోన్న సాధువుగారు 'పిచ్చాడిలా పరుగెడతాడేం' అని చిన్న పిల్లాడిలా నవ్వుతున్నారు అతనలా జారుతో గట్లంబడి పరుగెత్తడం, చూడడం అదే ప్రథమం అక్కడ భాష అర్థంకాక పాలవాడు కావిడి మోసుకొంటో వెళ్ళిపోయాడు

చెట్టుకింది నెమలికి యీ ప్రపంచంలోని బంధాలేమీ తెలీలేదు. ఆహారం వెతుక్కొంటోంది. స్వామిగారు పూజ ఆరంభించారు సాధువుగారు గుహ తలుపు తెరచి కడుగుతున్నారు

మెల్లగా, బరువుగా అడుగులు వేసుకొంటో, చూపులతో పాదాలని కట్టి వస్తున్నాడు. అతనిలో లోకంలోని వెలుగు మనసులో చీకటయింది అంత దీక్షణ ఆరంభమయింది అశాంతి రగిలింది

'ఆ కోళ్ళని కోళ్ళలా వుండనీయండి అవి పోటాడుకొన్నా పరవాలేదు పేరు పెట్టి, కత్తులు కోళ్ళకి కట్టి, విడదీసి ఉషారెక్కించి విడవద్దు రక్తాలు కారి, నరుక్కుని పౌరుషంతో చస్తాయి అంతే యీ మతాలు కూడ' అని యెప్పుడో ఓ సాధువుతో స్వామిగారు చెప్పిన విషయాలు ఇప్పుడు రింగుమంటున్నాయి సీతారామయ్య చెవిలో

'ఎవరో ఒక ఆడమనిషి నీటిలో దూకి చనిపోయింది స్వామీ!'

'ఆహా' అన్నారు సాధువుగారు

ఏ ఆశ్చర్యమూ ధ్వనించకపోవడం వింతనిపించింది.

పూవు పూసిందంటే సంతోషపడతావు ఆ చుట్టూ ఆ లావణ్యాన్ని చూపులతో తాగుతో తిరుగుతావు మరునాడు వాడి రాలిందంటే ఏడ్చి కృంగిపోతావు అదీ నీ బలహీనం—కాని అదే బ్రతుకు

ఆ మాటలు యెవరూ చెప్పలేదు అక్కడి మౌనం అలా ధ్వనించింది నిశ్శబ్దానికి భావవ్యక్తీకరణ శక్తి వుంది ఆ సమాధినించి జ్ఞానం నిద్రమాని లేవాలి.

'ఇంటికెళ్ళి మాలచ్చిమిని చూసొస్తానండీ' అన్నాడు. ఆ మాటలు మరుగున చూడాల్సిన వ్యక్తులు యింకా వున్నారు.

స్వామి తలూపారు

సీతారామయ్య తొందర తొందరగా నడుస్తున్నాడు. ★

చేపలూ, హంసలూ! ఇంకో పక్క—కాయగూరల పొదలూ, వాటి పూలూ, పిందెలూ, కాయలూ! భవనానికి వెనక బాగా, దుబ్బుగా పొడవుగా ఎదిగిన గడ్డీ, రెల్లూ! వాటి మధ్య వేళ్ళూ, మేకలూ, గొర్రెలూ, ఆవులూ! ఇంకో మూల పావురాలూ కోళ్లూ, కౌజులూ, నెమళ్లూ! అన్నిటికీ పైన ఎత్తయిన నీలికొండలూ, ఆ కొండలనుండి పారుతూన్న సెలయేరూ, ఏటికి రెండు వేపులా గోధుమ, వరి, శనగపంటలూ, ఆ కొండలకు పైగా భాన ఆకాశంలో-అప్పుడే ఉదయిస్తున్న సూర్యుడూ, అతని అరుణకిరణాలు!

ముగ్గురు కోడళ్లూ ఆ చిత్రం చూసి వెర్రి ఆనందంతో గంతులు వేశారు! తల్లి ప్రశాంతంగా నవ్వి, తృప్తిగా నిట్టూర్చింది!

అంతలో పడమటిదిక్కు నుంచి అకస్మాత్తుగా, ఉధృతంగా పెనుగాలి చెలరేగింది! చూస్తూ చూస్తూండగా సుందరచిత్రాల్తో శోభిల్లుతూన్న ఆ పట్టుదుప్పటి ఇంట్లోనుండి బయట పడిపోయింది! గాలితో మీదకు లేచిపోయింది!! ఆకాశమార్గాన—తూర్పుదిక్కుగా ఎగిరిపోయింది!!!

ఆ విపరీత సంఘటన గమనించి తన్నూ మెరుపులా బయటకు వెళ్లింది! గాలిపాటున పోతూన్న తన అమూల్యధనాన్ని, ప్రాణప్రదమైన కష్టార్జితాన్ని ఆ పట్టుదుప్పటిని ఉరకపరుగుల్తో వెంబడించింది. కాని పాపం! కొద్దిగడియల్లో అది కనుమరుగై పోయింది! తాన్నూ మూర్ఛపోయింది! ఆమె వెనకనే వస్తున్న ముగ్గురు కోడళ్లూ ఆమెను లేవనెత్తి లోనికి తీసుకుపోయారు! శైత్యోపచారాలు చేసిన కాసేపటికి ఆమెకు తెలివొచ్చింది! పెద్ద కొడు

పట్టుదుప్పటి

(27-వ పేజీ తరువాయి)

కును చూసి, మెల్లిగా, దృఢస్వరంతో ఇలా అన్నది—

"లీమె! తక్షణం తూర్పుదిశగా పోయి నా ప్రాణంకన్నా మిన్న అయిన ఆ పట్టుదుప్పటి తీసుకురా! వెళ్లు!"

లీమె క్షణంపైనా ఆలస్యం చెయ్యకుండా తూర్పు దిక్కుగా బయల్దేరాడు. పట్నాలూ, పల్లెలూ అడవులూ దాటాడు. నెల్లాళ్లైంది. ఒక లోయలోకి చేరుకున్నాడు. ఆలోయలో బండరాళ్ళతో కట్టిన ఒకయిల్లూ ఆయింటికి కుడిపక్కగా ఒక రాతిగుఱ్ఱమూ కనిపించాయ్! ఆ గుఱ్ఱం నోరు బారచాపుకొని ఉంది! దాని చూపంతా సమీపంలో ఏపుగాపెరిగిన లేతపచ్చిక మీద ఉంది!

ఆయింటి ద్వారందగ్గర ఒక ముసలమ్మ కూచుని ఉంది. ఆమె శతవృద్ధు! ముగ్గుబుట్టలా తల పండిపోయింది! చర్మం బాగా ముడతలు దేరింది! కాని చూపుమాత్రం మందగించలేదు. లీమేను చూడగానే "ఎవరునాయనా నువ్వు?" ఎక్కణ్ణుంచి వస్తున్నావ్!.. ఎక్కడకు వెళ్తావ్?" అని ప్రశ్నించింది.

లీమె తన వృత్తాంతం పూసగుచ్చినట్టు వివరించాడు. తరవాత అవ్వా! మాఅమ్మకు ఆ దుప్పటిని తీసుకుపోయి ఇవ్వకపోతే బెంగతో చచ్చిపోతుంది. దానిగురించి నీకు ఏమైనా తెలిస్తే చెప్పి పుణ్యం కట్టుకో!" అన్నాడు.

ముసలమ్మ బోసినోటితో నవ్వి అన్నది-"ఆదుప్పటి సూర్యపర్వతం మీది అప్సరసలు తీసుకుపోయారు. దాని పనితనం అందం చూసి వాళ్లు ముగ్ధులై పోయారు. అలాంటిది తయారు చేసుకోవాలని వాళ్ళ సంకల్పం! ఐతే ఆసూర్యపర్వతం చేరుకోవటంమాత్రం చాలా చాలా కష్టం!"

"లేదవ్వా! నేను మాయమ్మకు మాటిచ్చాను ఎలాగైనా ఆదుప్పటి తెచ్చియిస్తానని!... ఐతే ఆసూర్యపర్వతం ఎలా చేరుకోవాలో నేను ఏమేమి చేయాలో దయవుంచి చెప్పావంటే నీమేలు ఏనాటికీ మర్చిపోను!"

"సరే విను!...ముందుగా నువ్వు ఆ కనిపిస్తున్న రాతిగుఱ్ఱాన్ని బతికించాలె! ఎలాగంటే? నీ నోట్లో ముందర దంతాలు రెంటిని ఊడబెరుక్కొని వాటిని ఆ గుఱ్ఱంనోట్లో వెయ్యాలి! అవి పడీ పడ్డంతో గుఱ్ఱానికి ప్రాణంవస్తుంది. తరవాత అది ఆపచ్చగడ్డిమీదకుదుంకుతుంది. దాన్ని మేయనారంభిస్తుంది. పది గుక్కలుతినగానేదానిమీదకుఛంగున ఎగిరి తోలాలి! పదిగుక్కలకు ఎక్కువైనా, తక్కువైనా ఆ గుఱ్ఱం నీకు మరి కనిపించదు! దానిమీద స్వారిచేసుకు పోయావంటే అది నిన్ను సూర్యపర్వతం మీదకు తీసుకుపోతుంది!... కాని తోవలో జ్వాలాముఖి పర్వతం ఒకటి అడ్డువస్తుంది. దానికి నాలుగుముఖాలా మహాగ్ని జ్వాలలు చెలరేగి ఉంటాయ్! ...ఆజ్వాలల్ని ఆ గుఱ్ఱం మీదనుంచే దాటాలి! ఆదాటే సమయంలో నువ్వు ఊపిరి బిగబట్టి ఉండాలి! కాసంత శ్వాస బయట పడ్డా, పిసరంత బాధ కనబర్చినా నువ్వూ నీతో యీగుఱ్ఱమూ మాడి బూడిదకుప్ప ఐపోతాయ్! అలా

దాన్ని దాటుకుపోయ్యావూ అంటే తరవాత మంచుకొండల్తో నిండిన స్సముద్రం అడ్డంవస్తుంది! ఆ సముద్రంమీదనుంచి వచ్చేగాలి సూర్యబింబాన్నయినా నీరు చేసేటంతశక్తివంతమైంది! దాన్నికూడా నువ్వు ప్రాణాలు బిగబట్టి దాటాలి! ఆ చలికి ఏమాత్రం కంపించినా, ఆమంచు సముద్రంలో గుజ్జంతో పాటు సమాధి ఐపోతావు! ధైర్య సాహసాల్తో యీ రెంటినీ దాటుకు వెళ్లావంటే, మరేదీ అడ్డురాదు. తరవాత సూర్యపర్వతం చేరుకుంటావ్! అక్కడున్న అప్సరసలదగ్గర ఆపట్టు దుప్పటి దొరుకుతుంది!—"

ముసలమ్మచెప్పిన మాటలు వినే సరికి లీమె శరీరంలోని రక్తం గడ్డ కట్టుకుపోయింది—'బాప్రే! ఆజ్వాలాముఖ పర్వతమూ, ఆమంచుకొండల సముద్రమూ మానవమాత్రుడు దాటగలడా అని? ... అమ్మో! ప్రాణాలు హరీమనవూ?—' అనుకున్నాడు.

లీమె వైఖరి ముసలమ్మ గమనించింది. నవ్వి అన్నది—"అబ్బాయీ! ఎందుకొచ్చిన బాధలివన్నీ నీకీ? నీకు బంగారంతో నిండిన పెట్టె యిస్తాను. దాన్ని పట్టుకొనిపోయి హాయిగా బతుకు!"

లీమె ఆలోచించి ఆనందంగా "అవునవ్వా! బ్రతికుంటే బలుసాకు తినొచ్చు. ఎవరుపడతారీ తంటాలు? బంగారం చూసేసరికి మా అమ్మకు కూడా మనసు మారిపోవచ్చు" అన్నాడు.

ముసలమ్మ యింట్లోకి వెళ్ళి ఒక పెట్టె తెచ్చి లీమెకు అందించింది. లీమె దాన్ని తెరిచిచూశాడు. పచ్చని బంగారం కణికెలు అతని కండ్లకు జిగేల్ మనిపించాయ్! దాన్ని చక్కగా చంకపెట్టుకొని యింటి మార్గం పట్టాడు. తోవలో లీమె ఆలోచించాడు — 'ఈ బంగారంతో

పాపాయి - పరికిణీ

జి. రాజేశ్వరి

అనగనగ ఒకవూరు
బహు పెద్ద దావూరు
ఆ పెద్ద వూరులో
అందాల చినమేడ
చూచుటకు ముచ్చటగ
కానబడు చినమేడ
కిటికీలు ఎన్నెన్నొ
ఆమేడ కున్నాయి
అందులో ఒక కిటికి
పాపాయి గది కిటికి
ఆరోజు ప్రొద్దున్న
ఆరుగంటలు అయిన
పాపాయి ప్రక్కలో
నుంచి లేవనేలేదు.
పాపాయి అమ్మమ్మ
పరిగెత్తు కొచ్చింది
పాపాయి లేపింది
వళ్ళు తోముకొమంది
పాపాయి బద్ధకం
గా లేచి చూచింది
'ఉ' 'హు' నేను లేవనూ
అంటు పరుండింది.
అన్నలందరు, అమ్మ
మేడపయి కొచ్చారు
ఓ పాప నా పాప
లేవవే తొందరగ
ఈ వేళ మీ నాన్న
ఊరినుం చొస్తారు
ఇప్పుడే గంటలో
రైలుదిగి వస్తారు
నీకు చాలాచాల
బొమ్మాలు తెస్తారు
ఓ పాప నా పాప
లేవవే తొందరగ
ఈ మాట విన్నాది
చెవులతో పాపాయి
శీఘ్రముగ లేచింది
వళ్ళు తోముకుంది
మొఖం కడుగుకొని
బొట్టు పెట్టుకొని
పౌడరద్దుకొని
కాఫీ సేవించేసి
బుద్ధిగా కూర్చుంది
నాన్నరాకా కొరకు.
గంట గిఱ్ఱున తిరిగ
పాపాయి నాన్నొచ్చె
గబగబా పాపాయి
పెట్టె తాళం తీసి
అందులో అందాల
పరికిణీ తీసింది
చూసింది, చూసింది
పాపాయి పరికిణీ
ముదురాకు పచ్చనా
ఎరుపు కలసినరంగు
చక్కన్ని నల్లటీ
చుక్కలెన్నొ కలవు
చుక్కల మధ్యలో
చాల పువ్వులు కలవు
ఎన్నెన్నొ కుచ్చిళ్లు
పెట్టి కుట్టినదదె
ముచ్చటగ చూచుటకు
మురిపెముగ నున్నాది
పాపాయి ముఖములో
ముద మావరించింది.
పరికిణీ చేపట్టి
గదిలోకి పోయింది.
పాపాయి మెల్లిగా
గదితలుపు తెరిచింది
"ఎవరో ఈ పాపాయి
మనయింటి కొచ్చింది."
అన్నారు నాన్నారు
సరదాకి అమ్మతో
"నేను మీ పాపనే
ఈ ఇంట్లో వుంటాను
పరికిణీ మా నాన్న
ఎంచక్కా తెచ్చారు"
అంటూ సంతోషంగా
గర్వంతో ఠీవిగా
పాపాయి చెప్పింది
అందరూ నవ్వారు.

యింటికి వెళ్తాను. నాతల్లీ! తమ్ముళ్లూ ఎంతో ఆనందిస్తారు. వాళ్ళు మరి ఏ పనిపాటు చెయ్యకుండా దీన్ని కాస్తా కాస్తా కరగగొసుకు తింటుంటారు. ఇలా తింటూపోతే ఎన్నాళ్ళకు వస్తుందని? ఒకటి కాదు–రెండు కాదు! నాల్గుప్రాణాలు దీనిమీద విరుచుకుపడితే ఏమవుతుంది?... ఆఁ.. నేను ఒక్కణ్ణే ఐతే చాలా జాగ్రతగా కాలక్షేపం చేసుకొంటే జీవితమంతా ఏ యిబ్బందీ లేకుండా హాయిగా గడిచిపోతుంది!... ఇంకా...ఏదైనా వ్యాపారంలోగాని ఉపయోగిస్తే ఆవచ్చిన లాభాలు... నాకే అన్న మాటేవిటి... నా భార్యా...పిల్లలూ...ఇంకా ఆ తరవాత తరాలవాళ్ళూ చక్కగా అనుభవించగలరు!..." ఈఆలోచనతో లీమెలో పెద్దమార్పు వచ్చింది. ఇంటినీ తల్లినీ తమ్ముళ్లీ మర్చిపోయాడు! అడ్డతోవను పడి ఒక మహా పట్నం వేపు నడకసాగించాడు.

ఇక్కడ తాన్యా–కొడుకు వస్తాడనీ ప్రాణప్రదమైన తనపట్టుదుప్పటి తెస్తాడనీ ఎదురుతెన్నులు చూస్తూ దినం ఒక యుగంగా గడుపుతున్నది. అప్పుడే రెండునెలలైంది. లీమెపత్తా, ఫికరులేదు. పాపం తాన్యా బెంగతో చిక్కి శల్యమైంది!

పట్టు దుప్పటి

ఒకనాడు రెండోకొడుకును పిల్చి అబ్బాయీ! నీ అన్న వెళ్లి ఎంతో కాలమైంది. ఇంకా తిరిగిరాలేదు. నువ్వయినా పోయి నా ప్రాణానికి ప్రాణమైన ఆపట్టుదుప్పటితీసుకురా! అది చూడనిది నేను బతకను!" అన్నది.

లీటె తల్లిమాట మన్నించి బయల్దేరాడు. నెల్లాళ్లూ ప్రయాణం చేశాడు. లీమే చేరుకున్న లోయ చేరుకున్నాడు. ముసలమ్మను కలుసుకున్నాడు. ఆమెచెప్పిన కథ సాంతంగా విన్నాడు. అతనుకూడ "ఎందుకీ • బెడదలు?" అనుకొని ముసలమ్మ అందించిన బంగారపు కణికలపెట్టె పట్టుకొని, యింటికి వెళ్ళక మరోమార్గాన ఎక్కడకో ఉడాయించివేశాడు!

మరో రెండునెలలు గడిచాయ్! లీటే అంతూ పొంతూ లేదు. తాన్యా మంచం పట్టిపోయింది. బల్లిలా దాన్నంటుకుపోయింది. కేవలం ప్రాణంతోఉన్నట్టు ఊపిరి తీస్తూ, ఆఊపిరి నిలబెట్టుకోవటానికి ఇంత ఎంగిలిపడుతూ రోజులుగడుపుతున్నది. ఇరవైనాలుగు గంటలూ ద్వారంవేపే ఆమె చూస్తూఉండేది; ఏ సమయాన ఏ కొడుకు దుప్పటి పట్టుకొస్తాడో ఎప్పుడు దాన్ని కన్నులపండువుగా చూస్తానో అని ఆమె తహతహలాడిపోతున్నది! కాని ఆమెకోరిక ఫలించలేదు! వెళ్ళిన యిద్దరు కొడుకులూ తిరిగి రాలేదు!

తల్లి దురవస్థ గమనిస్తున్న లీశె ఒకనాడిలా ఆమెతో అన్నాడు—

"అమ్మా! అన్నయ్యలు వెళ్ళి నాలుగు నెలలు దాటిపోయింది. వాళ్ళ జాడజవాబుల్లేవు. తోవగాని తప్పిపోయి ఏ కొండల్లోనో అడవుల్లోనో చిక్కులు పడుతున్నారో, లేక అసలు ఆదుప్పటిగురించి ఆచూకీ తెలిసిందో లేదో–కాక—ఒకప్పుడు వాళ్లేదైనా ఆపదల్లో చిక్కుకున్నారో ఏదీ తెలీదు!... నేను బయలుదేరి వెళ్తాను. ఎన్నికష్టాలొచ్చిపడ్డా లెక్కచెయ్యను! నీపట్టుదుప్పటి తెచ్చియిస్తాను! నువ్వు మాత్రం ధైర్యంగా ఉండు! నిన్ను జాగ్రతగా చూస్తూ ఉండాల్సిందని యిరుగుపొరుగువాళ్ళకు చెబుతాను. ఏది ఏలా ఉన్నా–పట్టు దుప్పటి మాత్రం తెచ్చితీరుతాను! దాన్ని చూడ్డానికినువ్వు తయారుగా ఉండాలి. నువ్విలా బెంగ పెట్టుకుంటే ఏం లాభం? నే నొచ్చేసరికి నువ్వు ఆరోగ్యంగా ఆనందంగాఉంటే నా శ్రమ ఫలిస్తుంది" (సశేషం)

పువ్వులు

(19–వ పేజీ తరువాయి)

ఆ యిండ్లలోగలవారి సంస్కారాన్ని ఊహిస్తాము. తోటవని ఒక చక్కటి హాబీ. ఏమీ తోచడం లేదు అని కాలాన్ని వ్యర్థపరిచేవారు, ఇలాంటి వాటితో కాలాన్ని సద్వినియోగపరుచుకుంటే తోచక పోవడమనే సమస్యే ఉండదు.

పూల మొక్కలు పెంచడంలో విదేశీయుల కున్నంత నేర్పరితనం, మనవారికి అంతగా లేదేమో అనిపిస్తుంది. వారిలో ప్రతి ఒక్కరి యింట్లోనూ అనేక రీతులుగా పూల మొక్కలు పెంచుతారట. కొంచెం స్థలం కూడ వృథా పోనివ్వరట. "మా దొడ్లో ఎంతో స్థలంలేదు. ఇంకెక్కడ పెంచుతాం' అంటారు చాలామంది. పెంచాలంటే ఎలా అయినా పెంచొచ్చు—కొన్ని తీగలు కిటికీలకు ప్రాకించొచ్చు. తొట్టెల్లోనూ, చిన్న చిన్న చెక్క పెట్టెల్లోనూ వేసి కిటికీలలో పెట్టొచ్చు. కుండీలలో వేసి, వరండాలో అలంకరించొచ్చు. పైనుంచి ఉట్టెల్లాకట్టి వాటిలోంచి క్రిందకు వ్రేలాడదీయొచ్చు. ఎన్ని రకాలుగానైనా పెంచవచ్చు.

ఈ పువ్వులతో తనివిదీరని మనవాళ్లు కొత్తరంగా, ఒక్క రోజులో వాడిపోని విధంగా తయారు చేయించి తృప్తిపడుతూంటారు. ఈమధ్య రక రకాల పూలలో ప్లాస్టిక్ పూలు వస్తున్నాయి. కొంచెం ఖరీదు ఎక్కువే అయినా ఫ్లవర్ వేజులో క్రొత్తగా చూసినవాళ్లు నిజం పువ్వులని భ్రాంతి పడుతున్నారు. కొందరు బంగారంతో చామంతి పూలలా చేయించుకుని అలంకరించుకుంటారు. ఇంకొందరు తలుపులమీద, ప్రాకారాలమీద స్తంభాలమీద పూలు చెక్కిస్తారు. అదే కళా ప్రియులైన మొగలాయీ చక్రవర్తులైతే అంతటితో విడిచిపెట్టలేదు. ఆ పువ్వులమీద రత్నాలూ, ముత్యాలూ కూడ తాపడం చేయించారు

ఇన్నెందుకు? వేసవికాలంలో తెల్లనిచీర, చల్లని వెన్నెలలో సువాసనలను వెదజల్లే మల్లెలు మనకు ఎంత ఆహ్లాదాన్ని కల్గిస్తాయి! ఎవరినైనా చూడడానికి వెళ్ళినప్పుడు, వట్టి చేతులతో వెళ్ళక ఒక చక్కటి గులాబీని తీసుకెళ్ళి యివ్వండి ఆ వెలలేని కానుక ఎంతో తృప్తి నిస్తుంది. ★

భూగర్భంలోనికి సాహసయాత్ర

(24వ పేజీ తరువాయి)

యజమాని భోజనశాలద్వారా తన గదిలోకి దూసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఈ శీఘ్ర ప్రవేశంలోనే బొమ్మ చెక్కిన పిడి కర్ర వొకమూలకు విసిరి, బల్లమీద పెద్ద టోపీ పడవేసి, తన తమ్ముడు కొడుకునైన నన్ను అలవాటు ప్రకారం ఈవిధంగా సంబోధించాడు :

"అక్సెల్, ఇటురా !"

అంతలోనే, నే వింకా కాలు కదిలించేలోపుగా, ప్రొఫెసర్‌గారు చిరాకుగా, "ఇంకా ఏమి టాలస్యం!' అని అరిచాడు.

మా 'మాస్టరు' గారి గదిలోకి ఒక్క గంతు వేశాను.

హోట్టో లిడెన్‌బ్రోక్ మంచివాడు కాదని నేనే ముందుగా ఒప్పుకుంటాను. కాని కొంచెం శాంతం అలవరచుకుంటే తప్ప—ఇది జరిగేపని అని ఎవరికీ నమ్మకం లేదు!—బ్రతికి ఉన్నన్నినాళ్ళూ తిక్క మనిషిగానే ప్రవర్తిస్తాడు.

ఆయన సెయింట్ జాన్స్ కాలేజీలో ధాతు శాస్త్రోపన్యాసకుడు. ఉపన్యాసాలలో తరచు రౌద్ర రూపందాలుస్తూ ఉండేవాడు. విద్యార్థులు సక్రమంగా క్లాసులకు వస్తున్నారా, శ్రద్ధగా వింటున్నారా, ముందు ఎప్పటికైనా బాగుపడే లక్షణాలు ఉన్నాయా అనేది ఆయనకు అనవసరం. తన తృప్తికోసం కేవలం 'ఆధ్యాత్మికంగా'—జర్మన్ తత్వశాస్త్రంలో చెప్పినట్లు—తప్ప ఇతరులకోసం బోధించేవాడు కాదు కనుక. ఆయన అహంకారానికి ఆయన పాండిత్యమే సాటి. తన విజ్ఞానం ఇతరులతో ఎందుకు పంచుకోవాలని అనుకునేవాడు. అంటే, విద్యను విధిని పేర్చినట్లు పేర్చేవాడన్నమాట.

జర్మనీలో ఇటువంటి ప్రొఫెసర్లు నిజంగానే ఉన్నారు.

సన్నిహితులవద్ద మంచి వాగ్ధాటి ప్రదర్శించినా మా పెద్దనాన్నకి సభలలో మాట తడబడేది. ఉపన్యాసకులలో ఇది ఒక లోటే. అసలు కాలేజీలో మాట్లాడుతూ ఉంటేనే మాట మధ్యలో ఆగిపోయేవాడు. నోరు తిరగని పదంతో పోరాడి చివరకు సరిగ్గా ఉచ్చరించలేక తిట్టుకునేవాడు. కోపం ఆపుకోలేక మండిపడిపోయేవాడు.

ధాతుశాస్త్ర పరిభాషలో సగం గ్రీక్, సగం లాటిన్ అయిన పదాలు ఎన్నో ఉంటాయి. వాటిని పలకటం చాలా కష్టం—మంచి వక్తలకే నోరు తిరగక బాధపడవలసి వస్తుంది. ఈ శాస్త్రం అంటే నాకు చులకన కాదు. కాని 'రాంబో హెడ్రోనిక్', 'క్రిస్టలైజేషన్స్', 'రెటినా స్పాల్‌టిక్' 'రెజినస్' మొదలయిన పదాలు ఎటువంటివారి నాలికలకైనా మెలికలు వేయగలవు.

మా పెదనాన్న నత్తి విషయం అందరకూ తెలుసు. ప్రత్యేకం అందుకోసం ఆయన ఉపన్యాసాలకు వెళ్ళేవారు. కష్టమైన పదాలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూసేవారు. ఆయన కోపం చూసి నవ్వేవారు. లిడెన్‌బ్రోక్ ఉపన్యాసాలకు గుంపులు గుంపులుగా వచ్చే జనంలో చాలా భాగం ప్రొఫెసర్‌గారి ఉగ్రావతారాన్ని చూసి ఆనందించేవారే.

ఒక విషయం మాత్రం మళ్ళీ మళ్ళీ చెప్పాలి. మా పెదనాన్న నిజంగా పండితుడు. అవసరంలో పరీక్షిస్తున్న వస్తువులను పగలగొట్టే అలవాటు ఉన్నప్పటికీ భూతత్వ శాస్త్రజ్ఞుడికి ఉండవలసిన ప్రతిభ, ధాతు శాస్త్రజ్ఞుడికి కావలసిన నిశిత దృష్టి ఈ రెండూ ఆయనకు ఉన్నాయనవచ్చు. సుత్తి, ఉక్కుపార, దిక్ దర్శకయంత్రం, వస్త్రజనికామ్లమూ ఉంటేచాలు ఏ ధాతువునైనా వెంటనే కనిపెట్టేసేవాడు.

అందుకనే అన్ని విద్యా కేంద్రాలలోనూ, సమితులలోనూ లిడెన్‌బ్రోక్ పేరు ప్రశస్తంగా ఉండేది. హంఫ్రీ డేవీ, బారన్‌ఫాన్ హంబోల్డ్‌ట్, కాప్టెన్ ఫ్రాంక్లిన్, కాప్టెన్ సాబీన్‌లు హాంబర్గుకు ఎప్పుడు వచ్చినా ఆయన దర్శనం చేసుకోకుండా వెళ్ళేవారు కాదు. చెకురెల్, ఎబెల్‌మాన్ బ్రూస్టర్, దూమా, మిల్న్ ఎడ్వర్డ్‌స్, సాంగ్—క్లెయిర్ డెవిల్ ప్రభృతులు రసాయన శాస్త్రంలో వివాదాస్పదమైన విషయాలపైన ఆయన అభిప్రాయం తెలుసుకోనకుండా ఉండేవారు కాదు. ఈ శాస్త్రం నిజంగా ఈయనకు ఋణపడిఉన్నదనాలి. 1853 లో లైప్‌జిగ్‌లో ప్రొఫెసర్ హోట్టో లిడెన్‌బ్రోక్ స్ఫటికశాస్త్రంపైన వ్రాసిన పెద్ద గ్రంథం ఒకటి ప్రచురించారు. (కాని ఖర్చులేమీ మిగలలే దనుకోండి).

ఇంతేకాక మా పెదనాన్న, రష్యన్ రాయబారి ఎం. స్ట్రూవె ధాతువుల 'మ్యూజియం' కు అధికారిగా పనిచేసేవాడు. ఈ మ్యూజియం ఐరోపా ఖండంలో ప్రఖ్యాతి పొందిన వాటిలో ఒకటి.

నన్ను ఇప్పుడు పిలుస్తున్న వ్యక్తి ఎటువంటివాడో మీకు అర్థమయి ఉంటుంది. సన్నగా, పొడుగ్గా, ఉక్కువంటి శరీరంతో ఉన్న ఏభై ఏళ్ళకన్నా పది సంవత్సరాలు చిన్నవాడినిగా కనిపించేట్లు చేసే బంగారు రంగు జుట్టు కల మనిషిని చిత్రించుకోండి. కొద్దిగా, అట్టహాసంగా ఉండే కళ్ళజోడు వెనుక మిడిగుడ్లు ఒక్క క్షణం స్థిరంగా ఉండేవి కావు. ముక్కు సన్నగా, పొడుగ్గా కత్తిలాగ పదునుతేరి ఉండేది. గిట్టనివారు ఇదొక సూదంటురాయివలె ఇనుముని ఆకర్షిస్తుందనేవారు; కాని ఇది నిజంకాదు ఆయన ముక్కు ఆకర్షించేదల్లా నశ్యం ఒక్కటే—ఇదిమాత్రం కావలసినంత.

మా పెదనాన్న అడుగు సరిగ్గా ఒక గజం ఉంటుంది. పిడికిళ్ళు ఎప్పుడు చూసినా బిగించి పట్టుకునేవాడు. దీనినిబట్టి ఆయన కోపిష్టి అని గ్రహించగలుగుతారు.

కోనిగ్‌స్ట్రాస్‌లో ఆయన చిన్న ఇల్లు సగం చెక్క, సగం ఇటికగా ఉండేది. పాత హాంబుర్గ్‌లో ఒక కాలవ ప్రక్కనే ఉండేది. పాత ఇల్లు కాబట్టి కొంచెం వాలిఉన్నమాట నిజమే. మధ్యభాగం తక్కినవాటికన్నా లావు ఎక్కువగా ఉండటం కూడా నిజమే. పైకప్పు ఏదో టుగెన్‌బుండ్ విద్యార్థి టోపీ ఒక చెవిమీదికి పడిపోయినట్లు వంగిపోయి ఉండేది. ఉండవలసినంత నిటారుగా లేకపోయినా పక్కనే ఎదుగుతున్న 'ఎల్మ్' వృక్షాన్ని ఆనుకుని ముచ్చటగానే ఉందనిపించేది. ఇదే 'ఎల్మ్' పువ్వులు వసంతకాలంలో కిటికీ అద్దాలకు రాసుకుంటూ ఉండేవి.

జర్మన్ ప్రొఫెసర్లలో మా పెదనాన్న భాగ్యవంతుడే అనాలి. ఇల్లు అతని స్వంతం. ఇల్లు మాత్రమేకాక ఇంట్లో వస్తువులు కూడా స్వంతమైనవే. వస్తువులంటే, ఆయన దగ్గర పెరుగుతున్న పదిహేడేళ్ల గ్రేచెన్, (ఈమెది అసలు ఫిన్‌లాండ్) పనిమనిషి మార్టా, నేను. నా తలిదండ్రులు చిన్నప్పుడే పోయారు కనుక తన పరిశోధనలలో సహాయంగా ఉంటానని నన్ను పోషిస్తున్నాడు.

నాకు ధాతుశాస్త్రమంటే చాలా ఇష్టం. ధాతువులతో విసుగూ, విరామం లేకుండా ఎంతకాలమైనా గడపేవాడిని. ఒక ముక్కలో చెప్పాలంటే ఈకోనిగ్‌స్ట్రాస్ ఇంటిలో అందరం హాయిగా బ్రతికేవాళ్లం—యజమాని కంగారు మనిషి అయినప్పటికీ! ఎప్పుడైనా నామీద విసుక్కున్నా మా పెదనాన్నకి నామీద వాత్సల్యం లేకపోలేదు. ఇక పోతే సహనం ఏ కోశానా లేని మనిషి అని చెప్పాలి. (ఏప్రిల్‌లో తొట్లలో చిన్న మొక్కలు నాటి, ప్రతిదినం ఉదయం వాటి ఆకులను పట్టి సాగదీసేవాడు, శీఘ్రంగా ఎదుగుతాయేమోనని).

ఇటువంటి వింతమనిషితో వేగాలంటే చెప్పినది వెంటనే చెయ్యటం మంచిది. ఆయన గదిలోకి ఒక్క గంతు వేశానని అందుచేతనే అన్నాను.

2

ఆగది ఒక 'మ్యూజియం' లాగ ఉండేది. శాస్త్రానికి తెలిసిన ప్రతి ధాతువూ సక్రమంగా పేర్లతోబాటు అమర్చి ఉండేవి ఇవన్నీ నాకు సుపరిచితమైనవే కదా ! ఎన్నిసార్లు తోటి వయస్సు పిల్లలతో ఆడుకోకుండా వీటిని తుడుస్తూ కూర్చున్నానో లెక్కలేదు ! వాటిలో కొన్ని 'బిట్యుమెన్' 'రెజిన్' లకు ఒక్క ధూళికణం కూడా అంటకుండా అతి శుభ్రంగా ఉంచాలి ! శాస్త్రం దృష్టిలో బంగారువంటి లోహాలకు కూడా ప్రత్యేకమైన విలువ ఉండదుకదా ! ఈ గదిలో రాళ్ళు కోనిగ్‌స్ట్రాస్‌లో మా ఇల్లు కట్టడానికి సరిపోగా, నాకు మరొకగది కూడా కట్టేందుకు మిగిలిపోయేవి !

కాని గదిలోకి ప్రవేశించినప్పుడు ఈ వింతలు గమనించే అవకాశం లేకపోయింది. నా దృష్టి అంతా

కొడుకు:-నాన్నా, అమ్మ నన్ను ఎప్పుడూ వీపు చిట్లకొడుతుంది. (బిగ్గరగా ఏడుస్తాడు.)

తండ్రి:-అలా అని నాతో చెబితే ఇంకా నాలుగు బాదుతుంది. ఊరుకోరా బాబు.

సి. హెచ్. కుసుమ (గుంటూరు)

భూగర్భంలోనికి సాహసయాత్ర

మా పెదనాన్నమీదే ఉన్నది. ఒక పెద్ద వెల్వెట్ కుర్చీలో కూర్చుని చేతిలో పట్టుకునిఉన్న గ్రంధాన్ని విస్మయంతో తిలకిస్తున్నాడు.

"ఆహా! ఏం పుస్తకం! ఏం పుస్తకం!" అని అరిచాడు. తీరిక కలిగినప్పుడు ప్రొఫెసర్ లిడెన్ బ్రోక్ పాత పుస్తకాలంటే వెదికేసుకుంటాడన్న విషయం జ్ఞాపకం చేసింది నా కీ ఆరువు. అయినా సులభంగా దొరకని దయితే గాని, కనీసం చదవటానికి వీలులేని దయితే గాని, పుస్తకానికి విలువ కట్టేవాడు కాదు.

"ఏం, నీ కీ పుస్తకం సంగతి ఇంకా తెలిసి వట్టు లేదే? అమూల్యం! హెవెలియస్ అంగడిలో వెతికి సంపాదించాను."

"అమోఘం!" అన్నాను కావలసినంత ఉత్సాహాన్ని తెచ్చిపెట్టుకుంటూ. కాని దళసరిగా బైండు చేసినంత మాత్రాన ఈ పాత పుస్తకాన్ని గురించి ఇంత హడావుడి ఏమిటి? ఎంత పురాతన గ్రంథమో కాని పచ్చబడిపోయి ఉన్నది. చదివే వారికి గుర్తుగా పనికివచ్చేందుకు కాబోలు రంగు పాలిపోయిన చిన్న కుచ్చు కూడా ఒకటి వేళ్లాడుతున్నది

ప్రొఫెసర్‌గారి విస్మయం అంతటితో ఆగలేదు.

"చూడు, అందంగా లేదూ? ఆహా, ఎంత చక్కగా ఉంది. బైండింగ్ ఎలా ఉంది? తెరిచేందుకు తేలిగ్గా ఉందా? ఉంది, ఏ పేజీ దగ్గర తెరిచినా మూసుకుపోకుండా బల్లమీద వదిలెయ్యవచ్చు! మళ్లీ ముయ్యటం సాధ్యమా? బహు చక్కగా, అట్టలతోబాటు పేజీలన్నీ ఎంత కుదురుగా, బొత్తుగా ఉన్నాయో చూడు! ఏడు వందల సంవత్సరా లయింది కదా, ఒక ముడత కూడా లేదే!"

మాట్లాడుతున్నంతసేపూ మా పెదనాన్న పుస్తకాన్ని మూస్తూ, తెరుస్తూ కూర్చున్నాడు. ఇక చేసేదిలేక, గ్రంథం ఏమిటని అడిగాను, నాకే మాత్రం తెలుసుకోవాలని లేకపోయినా. "ఈ అద్భుతగ్రంథం పేరేమిటి?"

"ఇదే, పన్నెండవ శతాబ్దం ప్రఖ్యాత ఐస్‌లాండిక్ రచయిత స్నోరెటుర్లెసన్ వ్రాసిన 'హైమ్స్‌క్రింగ్‌లా'; ఆ ద్వీపాన్ని పాలించిన నార్వేజియన్ రాజుల చరిత్ర" అన్నాడు ఆయన, ఉత్సాహాన్ని ఆపుకోలేక.

"నిజంగానా!" అని నే నరిచాను. 'జర్మన్ అనువాదమా?"

"అనువాదమా!" ప్రొఫెసర్‌గారు గర్జించారు. "నాకు నీ అనువాదాలతో ఏం పని? అనువాదా లన లెవరిక్కావాలి! ఇది ఐస్‌లాండిక్ భాషలోనే ఉంది. నిజంగా, ఆ భాష నాకెంతో బావుంటుంది. భాష సులభమే అయినా వ్యాకరణంతో పదాల నెన్ని రకాలుగా మార్చుకోవచ్చు!"

"అచ్చు జర్మన్‌లాగే నన్నమాట!" ఇకిలిస్తూ అన్నాను.

"అంతే!" అన్నాడు మా పెద్దనాన్న. "ఐస్‌లాండిక్ భాషలో మూడు లింగాలు. నామవాచకాల విభక్తి ప్రత్యయాలు లాటిన్‌భాషలో వాటిని పోలిఉంటాయి."

"అలాగా!" నా కప్పటికి కొంచెం అదేమిటో తెలుసుకోవాలని అభిలాష కలిగింది. "ముద్రణ బావుందా?"

"ముద్రణ! ముద్రణ సంగతి ఎవరెత్తారోయ్, ఆక్సెల్! దీని విషయమే వేరు. ఇదేదో అచ్చుగుద్దిన గ్రంథ మనుకుంటున్నావా? మూర్ఖుడా, ఇదొక వ్రాతప్రతి—'రూనిక్' వ్రాతప్రతి."

"రూనిక్!"

"అవును! ఆమాట కర్థమేమిటో అడగవూ?"

"అంతపని మాత్రం చెయ్యను!" అన్నాను, ఆత్మాభిమానం దెబ్బతిన్నవాడి స్వరంలో. కాని మా పెదనాన్న వినిపించుకోలేదు. ఉత్సాహంతో చెప్పుకుంటూ పోయాడు. అనుకోకుండా నాకేమాత్రం నేర్చుకోవాలనిలేని దాని సంగతి బోధించాడు.

"రూన్స్ అనేవి మొట్టమొదట ఐస్‌లాండిక్‌లో వ్రాసేందుకు అక్షరాలుగా వాడారు. అసలు వీటిని సృష్టించినది 'వోడిన్' అంటారు! వీటికి నమ

నర్స్ :- మీలో ఎవరైనా సన్నాయి వాయించగలరా?

వాద్యగాడు :- (ఆస్పత్రి కొచ్చినా గిరాకీ తగిలిందనే సంతోషంతో) నేను బాగా వాయించగలనండీ. మీరు తగినట్లు బహుకరించాలి.

నర్స్ : అయితే, ఈ రబ్బరు తిత్తిని కాస్త ఊదిపెట్టు.

కొజ వెంకట కమల, (విజయవాడ)

స్కారం చెయ్యి— దేవతాసృష్టి, ఏమనుకున్నావో!" అన్నాడు.

నమ్మితే నమ్మండి లేకపోతే లేదుకాని సమాధాన మివ్వకుండా సాష్టాంగ నమస్కారం చెయ్యపోతూ ఉండగా—(ఇది దేవుళ్లకూ, రాజులకూ కూడా నచ్చే వ్యాపారమేకదా. దానివల్ల వారికేం నష్టం?)—మా సంభాషణకు ఒక అంతరాయం కలిగింది.

పుస్తకంలోంచి చిన్న 'తృణ్పత్రం' (వ్రాతప్రతిగా వాడే పలుచని చర్మ పత్రం) జారినేల మీద పడింది.

మా పెదనాన్న ఎగిరిపడి దానిని పట్టుకున్నాడు. 'పురాతన లిఖిత గ్రంథం ఏదైనా ఆయన దృష్టిలో విలువ లేకుండా ఉండదు. అందులో ఏళ్ల తరబడి ఒక పాత పుస్తకంలో గుప్తంగా ఉండిపోయినదంటే ఇక చెప్పనక్కరలేదు.

"ఇదేమిటి?" అని అరిచాడు.

జాగ్రత్తగా ఆ చర్మపు ముక్కను బల్లమీద పరిచాడు. సుమారు అయిదంగుళాల పొడవూ, మూడంగుళాల వెడల్పూ ఉండి ఉంటుంది. ఏవేవో వింత 'అక్షరాలు' వ్రాసి ఉన్నాయి.

ఇదిగో దాని నకలు! నీకు వాటి పరిచయం కలగాలనే నా ఉద్దేశ్యం. ఎందుచేతనంటే ప్రొఫెసర్ లిడెన్ బ్రోక్, ఆయన తమ్ముడు కొడుకూ కలిసి చేసిన అద్భుతయాత్రకు ఇవి మూల కారణం.

ప్రొఫెసర్‌గారు కొంతసేపు వాటివైపు చూస్తూ ఉండిపోయాడు. ఆ తర్వాత కళ్లజోడు సరిచేసుకుని, "ఇది రూనిక్ లిపి. ఈ అక్షరాలు కూడా స్నోరె టుర్లెసాన్ వ్రాతప్రతిలోని వాటిని పోలి ఉన్నాయి! కాని వాటి అర్థం ఏమై ఉంటుంది?" అన్నాడు.

అమాయకులను ఏడిపించడానికే ఈ రూనిక్ లిపిని పండితులు కనిపెట్టారని నాకు అనిపించింది. కాబట్టి మా పెదనాన్నకే ఏమీ అర్థం కాలేదంటే సంతోషం కలిగింది. కనీసం ఆయన వేళ్ళతో బల్లమీద దరువు వెయ్యటంచూస్తే అర్థం కాలేదనుకున్నాను.

"ఐస్‌లాండిక్ కాకపోతే మరేమిటి?" అని లోలోపలే గొణుగుకున్నాడు.

బహుభాషాప్రవీణులైన ప్రొఫెసర్ లిడెన్ బ్రోక్ ప్రపంచంలోని రెండువేల భాషలూ, నాలుగువేల ఉప భాషలూ ధారాళంగా మాట్లాడలేడేమో కాని వాటిలో కొన్ని ఆయనకు బాగా వచ్చు.

ఈ అంతరాయంవల్ల ఆయన స్వభావం తెలుసు కనుక, పెద్ద గొడవ చేస్తాడేమోనని ఎదురుచూసి దానికి సిద్ధమయ్యాను. ఇంతలో గదిలో గడియారం రెండు కొట్టింది.

వెంటనే మార్టా తలుపు తెరిచి, "సూప్ వడ్డించాను" అన్నది.

"ఈ సూప్, అది చేసినవారూ, తాగేవారూ అందరూ తగలబడిపోనూ!" అని కేకలు వేశాడు మా పెదనాన్న.

మార్టా హడలి పారిపోయింది. నేనూ ఆమె ననుసరించి అవసరంలో ఏమి చేస్తున్నానో తెలియకుండానే భోజనాలగదిలో నే మామూలుగా కూర్చునే చోటకువెళ్లి కూర్చున్నాను.

కొన్ని నిముషాలు ఆగిచూశాను. కాని ప్రొఫెసర్‌గారు రాలేదు. నాకు తెలిసినంతవరకూ, ఇంతకు ముందెప్పుడూ ఆయన భోజనం మానుకోలేదు. భోజనమంటే సాధారణమైన భోజనమేమీ కాదు! అవలయిన విందు!

ఇంత విందూ, ఒక పాత 'కాగితం' ముక్క కోసం మానేస్తున్నాడన్నమాట. చేసేదేమీలేక ప్రియ సోదర పుత్రుడిని కాబట్టి ఆయన వంతు కూడా నేనే ఆరగించటం నా కర్తవ్యమని భావించి ఏ లోటూ లేకుండా ఆ పని ముగించాను.

"ఎప్పుడూ చూడలేదే! లిడెన్‌బ్రోక్‌గారు భోజనం మానివెయ్యటమా!" అన్నది మార్టా.

"నమ్మటానికి కష్టంగానే ఉంది."

"ఏదో ప్రమాదం తప్పేట్టులేదు!" ఆవృద్ధ పరిచారిక తల ఆడిస్తూ, తన అసంతృప్తి ప్రకటించింది.

తన వంతు భోజనం కూడా ఖర్చు అయిపోయిన దని తెలిస్తే మా పెదనాన్నగారు చేసే గలభాతప్ప వేరేప్రమాదమేమీ సంభవించబోదని నేననుకున్నాను. మిగిలిపోయిన 'ష్రింప్' (రొయ్య) అందుకుంటూ ఉండగా ఒక సుపరిచిత కంఠస్వరం అడ్డు తగిలింది. ఒక్క అంగలో భోజనశాలనుంచి మా పెదనాన్న గది చేరుకున్నాను. (సశేషం)

వాల్చి తలను పక్కకు తిప్పుకొని ఏమీ మాట్లాడక కూర్చుంది.

ఉన్నట్టుండి రాజుకి ఏదో ఆలోచన కలిగింది. ముఖంలో వికాసం పోయింది.

యువతి :—ఎందుకలా ఉన్నట్టుండి భయపడిన ట్లున్నావు?

రాజు :—సుందరీ! ఇప్పుడు మనం పలుకుల విరులతో అల్లుతున్న వేడుక కాలమాల ఏకారణం చేతనైనా తెగిపోతుందేమోనని భయపడున్నాను. మన ప్రియోక్తులతో మొదలెట్టింది నా జీవితం. ఎప్పుడు మన సంభాషణ అంతమౌతుందో, నా జీవితంకూడా అప్పుడే అంతమౌతుంది. లోభిలాగ నేను కాపాడవలె ననుకున్న వస్తువే నాకు అశాంతిని కలుగజేస్తుంది. మన సుఖమంతా ఎక్కడ పోతుందోననే కలత నామనస్సు నావరించింది. ప్రతి చిన్న చప్పుడు వెరపుకలిగిస్తోంది. నీవు హఠాత్తుగా ఈ నదీప్రవాహంలో కలిసి వెళ్ళిపోతావేమోననే ఆందోళన కూడా కలుగుతోంది. నువ్వు నన్ను విడి వెళ్ళకుండా నా గుర్రాన్ని కట్టినట్టు నిన్నుకూడా ఒక చెట్టుకు భద్రంగా కట్టేస్తా.

ఈ మాటలు వినగానే ఆమె గట్టిగా నవ్వింది.

యువతి :—అంత భయపడవలసిన అవసరం లేదు. నాకు నిన్ను విడిచి వెళ్ళాలనిలేదు. పైగా నీళ్ళలో దూకి ప్రవాహంలో వెళ్ళడానికి నేనేమన్నా మత్స్యకన్నా?

రాజు :—మీనాక్షీ! జలాంతర్భాగంలో నివసించే అందమైన మత్స్యకన్యలనుగూర్చి మీ నాన్న నీకెప్పుడూ చెప్పలేదూ? లేక ఒకవేళ నీవే ఒక మత్స్యకన్యయ్యి నన్ను మోసగిస్తున్నావా?

యువతి :—ఎందుకొచ్చిం దా అనుమానం?

రాజు :—ఎందుకంటె వాళ్ళు కూడా నీలాగే అత్యంత సౌందర్యవతులు. నీలాగే నదుల ఒడ్డున కూర్చున్నట్టుగానే ప్రత్యక్షమౌతారు. నాలాంటి ప్రయాణీకు ల్నందరిని ఆకర్షించి, వారి జీవితాలను దుఃఖమయం చేస్తారు.

యువతి :—ఎలా?

రాజు :—ఏముంది? మెరపులాగా వారికి కనిపించినట్టే కనిపించి వారి హృదయాలను దోచుకొని వెళ్ళిపోయి మళ్ళీ తిరిగిరారు. ఇక వ్యధతో నిండిన ఆ అభాగ్యులను ఎవరు ఓదార్చగలరు? అలాగే నీవు కూడా నన్ను విడిచి వెళ్ళిపోయావంటె నేను ఆ అభాగ్యులలాగ ఇక్కడే కృంగి నశించిపోతా. నన్నాస్థితికి తెచ్చిన నేరస్థురాలివై నీవు శిక్షార్హురాల వౌతావు. తెలుసా?

ఆమె పకపకా నవ్వింది. ఆ నవ్వు రాజు చెవులకు ఇంపైన సంగీతంలా వినబడింది.

యువతి :—బాగుంది ఈ న్యాయం! ఇందులో ఆ కన్యల తప్పేముంది? దారినపోయే కళ్ళున్న బాటసారులచేత చూడబడడం వాళ్ళ తప్పా? అలాగే నీవు నన్ను చూడడంలో నా తప్పేముంది? అసలు నేనున్న అరణ్యంలోకి రావడం నీదే తప్పు. తెలుసా?

రాజు :—లతాంగీ! మనిద్దరం ఇలా ఉన్నంతకాలం ఎవరి తప్పూ లేదు. నువ్వు నన్ను విడిపోకుండా వుంటె చాలు. ధన్యుణ్ణి.

స్వప్నము

(23-వ పేజీ తరువాయి)

యువతి :—మరి నీవు నన్ను విడిచిపోతావనే భయం నాకుమాత్రం వుండదా? స్త్రీ జాతేనా మోసం చేసేది? కనపడి మాయం అయ్యే పురుషులు లేరా?

రాజు :—(ఆతురతగా) అయితే ప్రేయసీ! నే నిక్కణ్ణుంచి వెళ్ళిపోతే నీవు నిజంగా విచారిస్తావా?

ఆమె కొంచంసేపు ఆలోచిస్తూ ఆగింది. తరువాత చిరునవ్వుతో కొంటెగా చూస్తూ ఇలా అంది.

యువతి :—మరి ఈ ప్రపంచంలో చాలామంది పురుషులున్నారని నీవేగా చెప్పావు? ఈ అరణ్యంలోకి ఇవాళ ఒకరొస్తే, రేపు ఇంకొకరొస్తారు.

రాజు :—(అదిరిపడి, తనలో) ఆహా, ఈమె నాతో

కొడుకు:—నాన్నా! మా మాష్టారు నాకు బ్రహ్మాండమైన తెలివితేటలున్నాయి, ముందు ముందు చాల పైకివస్తానన్నారు.

తండ్రి!—బాగా శ్రద్ధగా చదువుతున్నావు కాబట్టి అని వుంటారు.

కొడుకు:—మన దొడ్లో కాసిన అనపకాయకోసి వారికిచ్చిన తర్వాత అలా అన్నారు.

వి. హెచ్. కుసుమ (గుంటూరు)

ఆసక్తిని పురిగొల్పుతోంది. యుక్తిగా నన్ను పరీక్షిస్తోంది. నిజంగా ప్రకృతిలోనే స్త్రీ స్వభావం మిళితమై వుంది. అందుకే ఈ అరణ్యంలో వుండికూడా స్త్రీకి గల సహజమైన చెలాకీతనం ఈమెకు అబ్బింది. (ప్రకాశముగా) అప్సరసతనయా! నేనుతప్ప ఇంకెవరన్నా ఇక్కడికి వస్తారనే భయం అక్కర్లేదు. ఈ స్థలానికి ఎవర్నీ రానీకుండా ఈ అడవిచుట్టూ నా సేనలను కావలాపెడ్తా. వాళ్ళు ఎవర్నైనా హతమార్చగలరు.

ఆమె అతనివైపు ఒకసారి దీర్ఘంగా పరికించింది.

యువతి :—చూడు. చెప్తాను, చెప్తాను అని నువ్వే నాకేమి చెప్పలేదు. నేనుమాత్రం నాకు తెలిసిందంతా నీకు చెప్పేశాను. సేనలను అడవిచుట్టూ కావలా పెట్టానంటున్నావు. నీవు రాజువా?

రాజు :—(ఉలిక్కిపడి తనలో) ఆ, ఏమిటి ఈ యువతి బుద్ధిసూక్ష్మత! నన్ను పెద్ద చిక్కులో పడేసింది. అయినా నేను రాజుననే సంగతి చెప్పను. అలా చెప్తే రాజభోగాలకాంతికి భ్రాంతిచెంది నన్ను ప్రేమించడం మానేస్తుందేమో! (ప్రకాశముగా) సుందరీ, మన ఆటప్రకారము నీవు రాణివైతే నేను మరి రాజునేగా! నేను మంచి రాజపుత్రవంశ సంజాతుడను. ఊరకే మాట వరుస కనుకుందాం. నే నొకవేళ నిజంగా రాజునై వుండి, రాజ్యంనుండి వెడలగొట్టబడివుంటె నువ్వు ఇందాక చెప్పినట్టు నా వెంబడి వస్తావా?

యువతి :—(నవ్వి) నీతో అలారావడానికి నేను నీ రాణిని కానుగా. అది నీ రాణి, లేక రాణుల కర్తవ్యం. నాదికాదు.

రాజు :—(తనలో) ఈమె తనకిష్టంవచ్చింది మాట్లాడుతూందా? లేక అసూయతో తనకు సవతులున్నారేమో కనుక్కోడానికి ఇలా ప్రశ్నిస్తోందా? (ప్రకాశముగా) సుందరీ, నేను రాజునుకానీ, కాకపోనీ నాకు నువ్వుతప్ప ఇంకెవ్వరూ లేరు. వుండబోరు. ఇప్పుడు స్పష్టంగా అడుగుతున్నాను. చెప్పు. నేనే రాజునైతే నువ్వు నాతో వచ్చి నా రాణిగా వుంటావా?

యువతి — అనిర్ణయం నేనెలా వెయ్యగలను? నేను నద్యంశానికిచెందిన కన్యను. అస్వతంత్రురాలను. నా భవిష్యత్తు నిర్ణయించవలసింది మా నాన్న. నేను కాదు.

ఈ మాట నోటినుండి రాగానే, ఏదో ఒకబాధ కలిగినట్టు కేకవేసి ఆయువతి ఛటుక్కుమని లేచి నిలబడింది. రాజు అదిరిపడి, 'ఏమిటి, ఏమిట'ని పదేపదే అడిగాడు. ఆమెను ఏదైనా పాము కరచిందేమోనని భయపడ్డాడు. కానీ అతనికి అక్కడేమీ కనిపించలేదు. ఆమెదగ్గరకు వెళ్ళాడు. ఆమెముఖం వెలవెలబోయింది. మండుటెండలో నీళ్ళులేక వాడిపోయిన పుష్పంలాగ ఆముఖం కృంగిపోయింది. రాజు దిగులుతో "అలివేణీ! ఏం జరిగింది?" అని అడిగాడు. కానీ ఆమె జవాబు చెప్పకుండా మౌనంగా నదివైపు చూస్తూ కూర్చుంది. రాజు లేచి ఆమెను ప్రేమతో, ఆవేదనతో తిలకిస్తూ ప్రక్కనే నిలబడ్డాడు.

దివాకరుడు పడమటికొండలచాటుకు వెళ్ళాడు. వెలుగంతాపోయి కొద్దికొద్దిగా చీకటి ఆవరించడం మొదలెట్టింది. నది ఒడ్డునవున్న చెట్లవెనుక నుంచి, దొంగలాగ దాక్కొనివున్న పున్నమి చంద్రుడు ఇను డస్తమించగానే అతని రాజ్యాన్ని ఆక్రమించుకునేందుకు కాచుకొని వున్నాడు. దూరంగా దక్షిణాన ఆకాశంలో ఒకే ఒక నక్షత్రం కనబడుతోంది. క్రింద నీటిలో దాని ప్రతిబింబం మిణుకు మిణుకుమంటోంది. చీకటిలో కలిసిపోయి గబ్బిలాలు చిన్న చిన్న దయ్యాలలాగ ఆ ప్రదేశమంతా విహరిస్తున్నాయి. అడవిలోని కిలకిలారవములంతా పోయి అంతటా నిశ్శబ్దంగా వుంది. చెట్లమధ్య మిణుగురుపురుగులు అటూ ఇటూ ఎగురుతున్నాయి. చాలాసేపట్నుంచి కట్టివేయబడి వుండడంచేత విసుగెత్తి కాబోలు, గుఱ్ఱం ఒకసారి సకిలించింది.

* * *

చాలాసేపటివరకు ఆమె కదలకుండా మౌనంగా వుండడంచూచి చివరికి రాజే ఇలా అన్నాడు:

రాజు :—ప్రియా! నీ మౌనానికి నాకు కారణం తెలీడం

స్వప్నము

లేదు నా జీవితాన్నైనా ధారపోసి నీ కే కష్టమూ కలుగకుండా కాపాడుతాను. పగలు పోయి ఇప్పుడిప్పుడే చీకటి కమ్ముకుంటోంది. ఇక్కణ్ణుంచి వెళ్ళిపోవలసిన సమయం సమీపించింది. కానీ నేను నిన్ను విడిచిపోలేను. మళ్ళీ ఇంకొకసారి నిన్ను అడుగుతున్నాను. నువ్వీ కీకారణ్యం వదిలి నాతో రావూ? ఈరోజు మనం ఆటలతో గడిపినట్లు నాతో ఎల్లకాలం జీవించవూ? మనమిద్దరం కలుసుకొని ఒక్క ఘడియ మాత్రమే కావస్తోంది కానీ అలా అనిపించడంలేదు. నూరువేల సంవత్సరాలనుండి ఇలా వున్నావేమో అనిపిస్తోంది. ప్రతి జన్మలోనూ మనం రాజు, రాణిలుగా వుండి, మన అనురాగ బంధంయొక్క శక్తివల్ల ఈ జన్మలోకూడా మళ్ళీ ఈ విధంగా కలుసుకునేట్టు విధి నిర్ణయించాడనే ధృఢనిశ్చయం కలుగుతోంది. నేను చెప్పినదానికన్నా, వెయ్యింతలు ఎక్కువగా నిన్ను సుఖపెడ్తాను. నీకు తల్లినై, తండ్రినై కాపాడ్తాను. నీవు సంతోషించినపుడు సంతోషిస్తూ, దుఃఖించినపుడు దుఃఖిస్తూ, అద్దంలో ప్రతిబింబంలాగ, అర్ధనారీశ్వరుని స్వరూపం లాగ వుంటాను. మీ నాన్నను వదిలి రావడం నీ మనస్సుకు కష్టంకలిగిస్తే చెప్పు. నీ వెప్పుడు ఇక్కడికి రావాలనుకుంటే అప్పుడు నిన్నిక్కడికి తీసుకవస్తాను ఈ మంటపమూ, ఈ పొదరిండ్లూ మనకు విలాసమందిరాలుగా వుంటాయి ప్రకృతిని ప్రతిబింబించే నీ రెండు నేత్రాలను నేను మొట్టమొదటిసారిగా చూసి పరవశుణ్ణైన మధురక్షణాలను జీవితాంతం వరకు జ్ఞాపకం చేస్తాయి

వెంటనే ఆమెకళ్ళలో నీళ్ళు తిరిగాయి. పొంగి వచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక ఏడుస్తూ ఇలా గన్నది.

యువతి —ఇప్పుడు నువ్వెలా వచ్చావో అలాగే వెళ్ళిపోవాలి. ఈ అరణ్యంలోకి ఎందుకొచ్చావు? నా హృదయాన్ని ఎందుకు కలవరపెట్టావు? నువ్విక్కడికి రాకపూర్వం ఈనది, ఈ పుష్పాలు, ఈ చెట్లు చూస్తూ ఆనందంగా కాలం గడిపాను. ఇప్పు డవన్నీ నా కళ్ళకు ద్వేషం కలిగిస్తున్నాయి. నిన్ను విడిచి వుండలేను కానీ నీతో రాలేను

రాజు :—(నిరాశతో) అయ్యో! ఏమిటీ మాటలు? నాతో ఎందుకు రాలేవు?

యువతి —ఎలా రాను? మా నాన్న ఇష్టప్రకారమే నేను పెళ్ళిచేసుకోవాలి. నిన్ను చూచిన క్షణం నే నావిషయమంతా పూర్తిగా మరచిపోయాను నీ రూపాన్ని చూస్తూ, నీ మధుర కంఠస్వరాన్ని వింటూ మైమరచిపోయాను. నాలో విచక్షణాజ్ఞానం నశించింది. కానీ, ఉన్నట్టుండి మా నాన్నపేరు అన్నప్పుడు, ఆనాడు మా నాన్న చెప్పిందంతా జ్ఞాపకానికి వచ్చింది. దాంతో మన కలయిక ఎంత ఆనందాన్ని కలుగచేసిందో, ఇప్పుడంత దుఃఖాన్ని కలుగచేసింది. ఏమైనా, జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు అంతా మారిపోయింది. నువ్విక్కణ్ణుంచి వెళ్ళిపోయి నన్ను మరచిపో మా నాన్న నా కెప్పుడో వరుణ్ణి నిశ్చయించారు. ఆయన అభీష్టాన్ని తిరస్కరించి, మా వంశానికి అప్రతిష్ఠ తీసుక రాను

రాజు :—సుందరీ, ఇది అసంభవం ఊరకే ఇలా అంటున్నావు. మీ నాన్న నీకు నిర్ణయించిన వరుడెవరో నాకు చెప్పు. (తనలో) అతను ఎవరైనా సరే. వెతికి అతన్ని నిర్మూలించి, ఈ యువతిని నా దానిగా చేసుకుంటాను.

యువతి :—నేను పెరిగి పెద్దదాన్నైనపుడు, నన్ను ఎవరికిచ్చి పెళ్ళిచెయ్యాలో తెలీక మా నాన్న మా అమ్మను అడిగారు. మా అమ్మకు కూడా తెలీక దేవేంద్రుని అడిగితే, ఇంద్రుడు భూత వర్తమాన భవిష్యత్తులు తెలిసిన మహేశ్వరుని అడిగాడు. అప్పుడు ఈశ్వరుడు ఇలా చెప్పాడు. చాలా దూరాన, ఉత్తర దిశలో ఈ అరణ్యానికావల రుద్రాలకుడనే రాజున్నాడు ఎప్పుడో ఒకరోజు అతనే ఇక్కడకువచ్చి, నన్ను చేపడ్తాడు అని. ఇంకొకరిభార్యగా నిర్ణయింపబడిన నేను ఇంత వరకు నీతో ఇలా మాట్లాడడమేతప్పు. కనుక నువ్వెంతత్వరగా వెళ్తే అంతమంచిది జరిగిందంతా మరచిపో.

రాజు గర్వానికి, సంతోషానికి మేరలేదు. ఇప్పుడు ఆమె అశ్రువులు అతనికి ఆనందాన్ని కలిగించింది.

రాజు :—(తనలో) నిస్సందేహంగా ఈమె సద్వంశ సంభూతురాలు. తన వంశానికి జ్యోతి. తనకు ఇష్టంలేకున్నా తలిదండ్రుల మాటలను జవదాటక ధర్మబద్ధురాలైన పవిత్రురాలు. అయినా, నే నెవరో చెప్పడానికిముందు అగ్నిలో బంగారాన్ని పరీక్షించినట్టు ఈమెను కడసారిగా పరీక్షిస్తా. ఒకవేళ ఈ పరీక్షలో తప్పిందంటె? పరవాలేదు ఆమెను మన్నించి నాకోసం తన హృదయాన్ని అర్పించినందుకు సంతోషించి నాతో తీసుకువెళ్తా. అలా కాక, నిశ్చలహృదయంతో తన కర్తవ్యమే ప్రధానమంటూ, నన్ను నిరాకరించిందంటె, ఈ పరీక్షలో నెగ్గిందన్నమాట. అప్పుడు ఈ మహాసాగరంలో ఇదొక అమూల్య ముత్యం అనడంలో సందేహమేముంది? (ప్రకాశముగా) ఎవడీ రుద్రాలకుడు? నల్లని మేఘంలా వచ్చి పండువెన్నెలలాంటి మన ఆనందాన్ని చీకట్లో ముంచ ప్రయత్నిస్తున్నాడు. ఏ ఆటంకమూ కలుగకుండా మనల్ని చేర్చిన విఘ్నేశ్వరుణ్ణి, మనల్ని అనురాగబంధంలో కట్టివేసిన కాముని, ప్రతిఘటించగల శక్తిసంపన్నుడా ఈ రుద్రాలకుడు? నీ వతనిపేరు వినడంతప్ప చూసి ఎరుగవు. అసలు అటువంటి వ్యక్తి ఉన్నాడనే నమ్మకమేముంది? అది వృద్ధుడైన మీ నాన్నకు కలిగిన భ్రమ కాకూడదా? అలాంటప్పుడు ఆ భ్రమనే నమ్ముకొని నీ సౌఖ్యాన్ని, నన్ను త్యాగం చేస్తావా? (ఒక్క క్షణంఆగి) చూశావా, నీవే సందేహిస్తున్నావు ఇరువైపుల నుంచి వీచే గాలికి ఊగులాడే పువ్వులాగ; నీ కర్తవ్యం, నా ప్రేమల మధ్య నిర్ణయించుకోలేకున్నావు. అవును. నీ వొక పుష్పంగనుక ఒక పువ్వే నీ సందిగ్ధావస్థను తీర్చనీ. నీ వక్షస్థలాన్ని అలంకరించిన ఈ ఎర్రటి కలువకు నీ హృదయం సంగతి బాగా తెలిసుంటుంది. నీ భవిష్యత్తును ఈ కలువే నిర్ణయించనీ.

అంటూ ఆ కలువను తన చేతిలోకి తీసు

కున్నాడు ఆమె అడ్డు చెప్పలేదు. పువ్వులోని రేకులను తుంచుతూ ఇలా అన్నాడు.

రాజు —మోహనాంగీ, చూశావా. ఇందులో ఒకదళం నీకు, ఒకదళం నాకు. ఇలా ఒకటి నీకు, ఒకటి నాకులంటూ పంచుకుందాం కడపటిదళం నీదైతే నీ పీ అరణ్యంలోనే వుండిపో. నిన్ను విడిచి వెళ్ళిపోతా అలా కాకుండా చివరిదళం నాదైతే అరుద్రాలకుణ్ణి విడిచిపెట్టి నాతోకూడా వచ్చెయి.

అంటూ కలువరేకులను తుంచుతూ, ఇద్దరికీ పంచాడు ఆమె అశ్రువులతో మెరిసే కళ్ళతో అలాగే చూస్తూ నిలబడింది. కడపటిదళం వచ్చేటప్పటికి రాజు విజయంతో "చూశావా సుందరీ! ఇది నాకు" అంటూ చిరునవ్వు నవ్వాడు ఆమె పక్కున నవ్వింది. ఆ నవ్వులో దుఃఖమూ, క్రోధమూ రెండూ ఇమిడున్నాయి

యువతి .—నీవు చాలా మోసగాడివి క్రూరుడివి. కలువకు పదహారుదళాలుంటాయని తెలుసుకొని కడపటిదళం నీకు వచ్చేట్టు పంచుకున్నావు. కుతంత్రంతో నా కర్తవ్యాన్ని మరచిపోడానికి ప్రోత్సహిస్తూ, నా బాధను ఎక్కువ చేస్తున్నావు. నేను నీకు లొంగడం నీకు ఇప్పుడు సమ్మతమైనా, మున్ముందు నీవే నన్ను దోషిగా పరిగణిస్తావు వెళ్ళిపో త్వరగా వెళ్ళిపో నేను నీతో రాలేను.

ఈ మాటలు చెప్తూంటె ఆమె ముఖం వివర్ణమైంది. కళ్ళు తిరిగాయి క్రిందపడకుండా చెట్టు బోదెను పట్టుకుంది.

యువతి —(దుఃఖంతో) ఆలస్యం చెయ్యకు నీ గుర్రాన్ని తీసుకొని ఇక్కణ్ణుంచి ఇప్పుడే వెళ్ళు ఈ నిర్ణయం నాకు చెప్పరానికష్టం కలిగిస్తూంది. నేను ఇక భరించలేను. ఇంకొక్క క్షణం మరొకరికి చెందిన కన్యను వరించ యత్నించావంటె అది నీ శీలానికే కళంకం.

రాజుకు ఆమె అంటె ఆశ్చర్యం, గౌరవభావం కలిగింది

రాజు —ఏమిటీ విచిత్రం! ఇంతకుముందు నేను కలుసుకున్న అమాయకురాలైన అడవికన్య ఎక్కడ ? సకలధర్మ విచక్షణాజ్ఞానంతో విజృంభించిన ఈ స్త్రీమూర్తి ఎక్కడ? ఇప్పుడు ఆమెముందు నేను నేరస్థునిలా నిలబడి వున్నాను. అయిననూ ఈమె నిరాకరణ నాలోని సంతోషాన్ని వెయ్యింతలు చేసింది

ఇలా ఆమెను లోలోన పొగుడుకుంటూ, ఉప్పొంగుతున్నసమయంలో చెట్ల నడుమనుంచి గుర్రాల గిట్టలచప్పుడు వినవచ్చింది అది విని రాజు గుర్రం గట్టిగా సకిలించింది. కొద్దిసేపట్లో రాజ పరివారం గుర్రాలనుండి దిగి రుద్రాలకుడు, అళిచుంబిత వున్నచోటుకి వచ్చి, నమస్కారం చేస్తూ భయ భక్తులతో చుట్టూ నిలబడ్డారు

అళిచుంబిత నిర్ఘాంతపోయి, రాజును, అతని సేవకులను చూస్తూ, వేటగాళ్ళు చుట్టుముట్టితే కదలలేక బెదిరిచూసే జింకలాగ నిలబడింది

రాజు —(తనలో) నా సేవకులు మంచి సమయానికే వచ్చారు. ఏమి వింత? ఈ సుందరిని చూడగానే వారికి గౌరవభావము కలుగుతోంది. అవును. ముల్లోకములను ఏలునది సౌందర్యమే. ప్రభువులని చెప్పుకునేవారంతా ఉట్టి పై తళుకులు. కల్ల. డాబు. అంతే. నేను అపరిచితుణ్ణైవుంటె వారెవ్వరూ నన్ను లక్ష్యపెట్టేవారుకారు కానీ నేను చెప్పకుండానే నా రాణిని వీరు దేవతాస్వరూపంగా ఎంచి ఆమె ఒక్క చూపుకు దాసులయ్యారు. (ప్రకాశముగా, దళాధిపతిని ఉద్దేశించి) ఈ సుదతీమణికి మీ రెవ్వరో విన్నవించండి.

దళాధిపతి సవినయంగా ముందుకువచ్చి "అమ్మా మేము శ్రీ రుద్రాలక మహారాజుగారి నమ్మిన బంట్లలో కొందరము. పగలంతా వీరికోసం వెతుకుతూ, ఆఖరుకు ఇప్పుడు వారి ఉనికిని కనుక్కున్నాం. మా రాక మీ ఏకాంతానికి భంగం కలిగించినందుకు క్షమించమని ప్రార్థిస్తున్నాం" అన్నాడు. రాజు వెంటనే "పరవాలేదు దళపతీ నీవు నా గుర్రాన్ని,

---

"ఒక మనిషి పోలీస్ స్టేషనుకు హడావిడిగా ఫోను చేసి, తన కారులో స్టీరింగువీలు, డేష్ బోర్డు ఏక్సిలేటరు ఎవరో కాజేశారని రిపోర్టు చేశాడు. పోలీసు సార్జంటు కేసు నోటు చేసుకొని, తక్షణం దొంగను వెతకటానికి పోలీసులను పంపుతున్నానని ఫోను పెట్టేశాడు. కొన్ని క్షణాల తర్వాత అదే మనిషి మళ్లీ ఫోను చేసి "క్షమించండి. పొరబాటున కారు వెనుక సీట్లో ఎక్కి దొంగలెత్తుకపోయారనుకొన్నాను" అన్నాడు

ముట్టిగుంట రామకృష్ణ (చీరాల)

పరివారాన్ని తీసుకొని నా ఆజ్ఞను వినగలిగినంతదూరం వెళ్ళి వేచి ఉండు"మని మళ్ళీ ఆజ్ఞాపించాడు. రాజాజ్ఞప్రకారం భటులంతా వెనుకకు అడుగులు వేస్తూ, తమ నూతన రాణిని గౌరవ పూర్వకంగా చూస్తూ చెట్లలోంచి అదృశ్యులైపోయారు.

అలజడితోను, సిగ్గుతోను ఏమీ తోచక నిలుచున్న అళిచుంబితను ప్రేమతో దగ్గరకు లాక్కుంటూ, రుద్రాలకుడు "ప్రాణేశ్వరీ, సత్యం తెలుసుకున్నావుగా? ఇప్పుడు మీ నాన్నగారి ఆజ్ఞప్రకారం మహేశ్వరుని. నిర్ణయంప్రకారం నిన్ను చేపట్టడానికి వచ్చిన వరునితో వచ్చి అతని రాణిగా వుండటానికి సమ్మతిస్తావా?" అని అడిగాడు ఆమె ముఖం ఆనందంతో వికసించింది. నోట మాట రాలేదు. ఆనందాశ్రువులు ధారగా రాలాయి. అతను ఆమెను దగ్గరకు చేర్చుకున్నాడు. ఆ ఆలింగనలో ఆమె అతని అర్ధాంగి అయిపోయింది.

కొద్దిసేపటికల్లా రాజు ఎడమచేతితో గుర్రపు కళ్ళాన్ని పట్టుకొని, కుడిచేత్తో తన రాణిని ముందు కూర్చోపెట్టుకొని రాజ్యాభిముఖుడై ప్రయాణ మౌతున్నాడు. ఇలా వెన్నెలలో, చెట్ల నీడలలో వెళ్తూంటె ఉన్నట్టుండి రాజు కళ్ళకు మనకకప్పినట్లు అయింది. తన హృదయేశ్వరి గాలిలా స్వరూపంలేకుండా అదృశ్యమౌతున్న ట్టనిపించింది. దిగులుపడి కళ్ళు తెరిచి చూశాడు. అళిచుంబిత స్వరూపం ఆరిపోయే దీపంలా ఒక్కసారి ప్రకాశంగా వెలిగి అంతర్ధానమయింది

మరుక్షణం చూస్తే అతని చుట్టూ అడవీలేదు, గుర్రమూలేదు. తన భార్య చెయ్యిపట్టుకొని అంతరిక్షంలో తేలుతూ పోతున్నాడు. రాజు అయోమయంగా "ఆ, ఏమిటిది? ఇప్పుడే నిన్ను అడవిలో కోల్పోయాను. ఈ గగనవీధిలో మనిద్దరం కలిసి వున్నాం. ఇంతవరకు జరిగిన మనిద్దరి ప్రణయ గాథ స్వప్నమేనా?" అని అడిగాడు.

ఆమె అవునంటూ అతనిచెయ్యి గట్టిగా పట్టుకుంది వారి సుఖానికి అంత్యం సమీపించిందనే సంగతి తెలిసి ఆమె హృదయం విషాదంతో నిండింది. రాజుకు జరిగిందంతా స్ఫురణకువచ్చి, దాన్ని మరచిపోలేక ఇలా అన్నాడు.

రాజు .—దేవీ! నిన్ను నా రాజ్యానికి తీసుకవచ్చేటప్పుడు అరణ్యంలో మరువరాని మన విహారం, మన ఆనందం జ్ఞాపకం వుందా? నీవు అలసిపోయి పడుకుంటే నేను నిన్ను అంతఃపురానికి ఎత్తుకపోయి హంసతూలికాతల్పంమీద నిదుర పుచ్చాను. నీకు మెలకువరాగానే ఎంతో విస్తుపోయి, ఆశ్చర్యంతో చూస్తుంటే నీవు చూడ ఎంత ముచ్చటగా ఉన్నావో తెలుసా? అప్పట్నుంచి నేను రాజుగా, నీవు రాణిగా మన జీవితమంతా ఒక ఆట అయింది. నీ కాంతితో అంధకారమైన అంతఃపురాన్ని వెలుగుతో నింపావు. నీ కలకల నవ్వు అంతఃపుర మందిరాల్లోంచి ప్రతిధ్వనించి వసంతకాలములోని కోకిలనినాదంలాగ రతీమన్మథులను నాట్యానికి పురికొల్పేది మనము ఆటలాడుకున్నప్పుడు నీవు దాగుకొని కొంతసేపు నాకు కనబడకపోతే, నాకు దిగులు పుట్టేది. ఇవన్నీ నీకు జ్ఞాపకం వుందా? చివరికి యుద్ధానికి వెళ్ళిన నేను నీ మరణ వార్తను వినడానికే వాయువేగంతో తిరిగివచ్చాను

ఇలా మాట్లాడుతూవుండగానే రాజు హృదయంలో ఏదో శూలం గుచ్చుకున్నట్లైంది. వెంటనే అతని రాణి అదృశ్యమైంది. పైనుండి క్రిందికి దొర్లించిన రాయిలాగ, రాజు శూన్యమైన విశ్వంలో క్రిందికి పడిపోతున్నాడు. భూలోకానికి తిరిగి వెళ్ళిపోతున్నాడని తెలుసుకున్న రాజు ఎదలోంచి ఒక విషాదమైన రోదన బయల్వెడలింది. ఏడుస్తూ, పోరాడుతూ, తన గమనాన్ని ప్రతిఘటించాలని ప్రయత్నించాడు. కానీ విఫలుడయ్యాడు.

"నా మనోహరీ! నా హృదయేశ్వరీ! నా అర్ధాంగీ! నిన్ను విడిచి నేను భూలోకానికి వెళ్ళలేను. వెళ్ళలేను. వెళ్ళను" అంటూ రాజు ఆక్రందన దిగంతాల్లోంచి ప్రతిధ్వనించింది. (సశేషం)

మూడు కటకమున గజపతులగు కాళింగులది. తక్కిన రాజ్యములన్నియు పరస్పరము కలహించుచు, గెలుచుచు, ఓడుచు ఈ మూడు పెద్ద రాజ్యములలో ఏదో యొకదానితో మైత్రి చేయుచు, ఇతర రాజ్యములతో కలహించుచు, తుదకు క్రమక్రమముగా మూడు మహారాజ్యములలో ఏదో యొకదానిలో లీనము కాజొచ్చెను.

ఈ కథాప్రారంభమునాటికి శ్రీ విద్యానగర ప్రభువు దేవరాయలు బహమనీసుల్తాను ఫిరోజ్ షా. కళింగప్రభువు నాల్గవ భానుదేవుడు

ఈ కథకు సంబంధించిన చిన్న రాజ్యములు రెండు అందులో మొదటిది పెదకోమటి వేమారెడ్డి పాలించుచున్న కొండవీటి రెడ్డిరాజ్యము. అది కృష్ణవేణ్ణానదికి దక్షిణమున నున్నది. రెండవది కృష్ణానదికి ఉత్తరముననున్న రాచకొండ వెలమ రాజ్యము. పూర్వము ఒకానొకప్పుడు ఆ రెండును కొంత పెద్దరాజ్యములే కాని, అవి యిప్పుడు చిన్నవై కొనయూపిరితో నున్నవి.

కొండవీటి రాజ్యము పూర్వ మొకానొకప్పుడు పశ్చిమమున అహోబలమువరకు, తూర్పున తీర రేఖవెంట సింహాచలము దాటియు, దక్షిణమున ఉదయగిరివరకును వ్యాపించియుండెను. ఈ కథాప్రారంభమునాటికి అది రెండుగా చీలి తూర్పున కృష్ణదాటి కొండపల్లివరకే వ్యాపించియుండెను. దక్షిణమున చాలభాగము విద్యానగరరాజ్యములో లీనముకాగా, అక్కడ స్వతంత్ర ప్రభువులై పాలించిన పంటరెడ్లు పలువురు శ్రీ విద్యానగర రాజ్యములో ఉన్నతోద్యోగములలో నుండిరి. పశ్చిమమున వినుకొండవరకుకూడ నశ్శి పోయినది. అది నేటి వినుకొండ ఒంగోలు తాలూకాలులేని గుంటూరుమండలమునను, కొలదిగా కృష్ణా మండలమునను మాత్రమే వ్యాపించియుండెను.

అవల కృష్ణ కుత్తరమున రాచకొండ రాజ్యము కూడ పూర్వము పెద్దదే యైనను, బహుకాలము క్రిందటనే సోదరరాజ్యములగు రాచకొండ దేవరకొండ రాజ్యములుగా చీలిపోయెను. పశ్చిమభాగమును ఉత్తరభాగమును బహమనీ సుల్తానులు ఆక్రమించిరి. తూర్పున కళింగప్రభువులును రాజమహేంద్రవర రెడ్డిప్రభువులును కొంత గ్రసించిరి. రాచకొండ, దేవరకొండ రాజ్యములు కలసి నేటి నల్గొండజిల్లాయు, మహబూబునగర్ జిల్లాలో తూర్పు భాగమునను మాత్రము వ్యాపించి యుండెను. ఈ కథాప్రారంభమునకు రెండు సంవత్సరముల క్రిందటివరకు వారికి మిత్రుడుగా ఉండిన బహమనీసుల్తాను తన సేనలను అకస్మికముగా వీరి పానగల్లుకోటమీదికి పంపుటచే రాచకొండ దేవరకొండ ప్రభువులు విద్యానగరరాజ్యముతో మైత్రికి రాయబారములు సాగించుచుండిరి.

ఇట్లు కొండవీటిరాజ్యమును రాచకొండ రాజ్యమును క్షీణదశలోనున్నను, ఆ రాజ్య ప్రభువులకు బహుకాలమునుండి వచ్చుచున్న స్పర్ధమాత్రము పోలేదు. కృష్ణాతీరము వెంబడిని మధ్య లంకలలోనను వారి సేనలు తరుచుగా పోరాటములు సలుపుచునే యుండెను. మధ్యమధ్య ప్రభువులు కూడ తలలు పోగొట్టుకొనుచుండిరి కొలదికాలము క్రిందటనే పెదకోమటి వేమారెడ్డి సోదరుడును, కొండపల్లి దుర్గాధిపతియునగు మాచారెడ్డి తలను రాచకొండవారు కొట్టగా, వారిప్రభువు తలను

కవిసార్వభౌముడు

(18-వ పేజీ తరువాయి)

పెదకోమటి వేమారెడ్డి సేనలు కొట్టించియుండెను. రాచకొండ దేవరకొండల ప్రభువులు ఇప్పుడు పెదకోమటి వేమారెడ్డి తల నెట్లు కొట్టుటాయని కాచుకొనియున్నారు. ఈ రెడ్డి వెలమ రాజ్యముల స్పర్ధ కేవల రాజ్య విస్తృతికే పరిమితమై యుండినచో, చిరస్మరణీయమై యుండెడిది కాదు. ఆస్పర్ధ సర్వతోముఖమై కళలకు, వాఙ్మయమునకు సంస్కృతికిగూడ వ్యాపించియుండుటచే ఇప్పటికిని స్మరణీయమై యున్నది రాజకీయ స్పర్ధ పరస్పరనాశనమునకు కారణభూతమయ్యెను. సాంస్కృతిక స్పర్ధ ఉత్తమ కళాకారులను, కవులను, పండితులను, కావ్యాదుల నిర్మాణమునకు ప్రోత్సహించెను. డెబ్బదినంవత్సరముల పైకాలము నుండి రాచకొండ, కొండవీటి నగరముల కీ సాంస్కృతికస్పర్ధ సాగుచుండెను.

కొండవీటిదుర్గము కొండపైగల యనేక శిఖరములకు వ్యాపించి బురుజులతో ప్రాకారరేఖలతో హత్తింపబడినది. నగరము సరోవరములతో విశాల రాజమార్గములతో మనోజ్ఞ భవనములతో

భార్య:-ఏమండోయ్, మీరు రోజూ యిలా నా మీద విసుక్కున్నారంటే-సముద్రంలో పడి ఛస్తాను ఆఁ!! ...

భర్త:-అందుకోసమేగా నేను విసుక్కుంటున్నాను.

అచ్చి రఘురామరెడ్డి (మద్రాసు)

స్పృహణీయమై యుండి కొండ దిగువనుగూడ నగరము పెరిగిపోవుచుండెను. కొండపై వేణు వనమును దావి సమీపమునగల వెదుళ్లచెరువును నాగరకుల నెక్కువ యాకర్షించుచుండెను. వెదుళ్ల చెరువు మధ్యను పద్మాకృతిగా చంద్ర శిలా మండప మొకటి కలదు. అది చిరుతరగల తాకిడికి ఊగుచున్న సితాంభోజమువలె దోచుచుండెను

రాచకొండయు, మొదట ఆ కొండ కుత్తరమున కొలది దూరమే వ్యాపించి, చిన్నదిగా నుండెడిది. క్రమముగా నది నాగానాయనికొండవరకు వ్యాప్తమై ఆ రెండు కొండలను చుట్టివేసి బలిష్ఠమగు ప్రాకారములతో, నగాధమగు పరిఖతో దుర్గమ దుర్గముగా వెలసినది. శిల్పులు స్థపతులు, ఖనకులు నేర్పుతో నక్కడ నీటి యెద్దడి తీర్చి జలసమృద్ధి కల్పించుటచే, నిప్పుడది మనోహర సరోవరములతోడను, జలజలపారు సెలయేళ్ళతోడను ఉద్యానములతోడను కలకలలాడు జనసమూహములతోడను, దివ్య భవనములతోడను కన్నులపండువుగా నున్నది. వేణు వనమునకు ప్రతిగా నక్కడ దారువనమును, నాగానాయనికొండపై విశాలవాపిమధ్యమున రత్నాల నౌకయు అవతరించినవి.

సాలీలు సన్నని రంగురంగుల మగిషీల వస్త్రములు నేయుటలోనను, చిత్రకారులు చిత్ర నిర్మాణమునందును, విగ్రహశిల్పులు గంభీర మనోజ్ఞ విగ్రహములు గండరించుటకును, కంసాలులు కనక రత్నాభరణాదులు నిర్మించుటయందును, కంచరులు, మహాపాత్రలు పోతపోయుటలోనను, కమ్మరులు ఉత్తమ ఖడ్గాదులు చేయుటయందును, సుగంధకారులు సువాసనలుకల అత్తరులు సిద్ధము చేయుటలోనను ఒకరితో నొకరు స్పర్ధ పడుచుండిరి. ఈ స్పర్ధలో ఒక విశేషముండెను. వారు ఒకరి నొకరు మించుటకు యత్నించుచుండిరే కాని, అవలివారి గుణములను దోషములుగా నీసడింప యత్నించుటలేదు. ఇట్టి స్పర్ధతోడనే బహువిధముల నాట్యశాలలు దేవాయ తనములు ఉత్సవములు వృద్ధిగాంచినవి

తక్కిన విద్యారంగములందు వలెనే ఆ రెండు నగరముల ప్రభువులు వేదవిదులను, విద్వాంసులను, కవులను, గాయకులను ఆకర్షించి గౌరవించుచుండిరి. ఉత్కళదేశములో గ్రంథము సంకిత మిచ్చుటయన్న ఆ గ్రంథకర్తృత్వమే కృతిపతి కర్పించు నాచారమున్నది. అది చాటుగా కాక, సభా సమక్షముననే జరుగును. ఈ ఉత్కళ దేశాచారము ఈ కథాకాలమున నాంధ్ర దేశమునగూడ కొంతవరకు వ్యాపించినట్లు తోచును. ఇక్కడను, అక్కడను ప్రభువులపేర వ్యాఖ్యానగ్రంథములును, నాట్య సంగీత సాహిత్య గ్రంథములును కావ్య నాటకములును విశేషసంఖ్యలో ప్రకటింపబడినవి. వానిలో నధికభాగము వారాదరించిన విద్వాంసులు రచించినట్టివని అనుమానించుటకు ఆధారము లున్నవి. రాచకొండలో విద్వాంసులు తమ ప్రభువును సర్వజ్ఞబిరుదముతో నలంకరింపగా, కొండవీటివిద్వాంసులు పెదకోమటి వేమారెడ్డిని సర్వజ్ఞ సార్వభౌమ బిరుదముతో నలంకరించిరి.

రాచకొండ విద్వాంసులలో నగ్రగణ్యుడు విశ్వేశ్వర కవి. అతడు రస మీమాంసాగ్రంథకర్తయగు కాశీశ్వరమిశ్రుల శిష్యుడు అతడు తనపేరనే ప్రకటించుకొనిన గ్రంథములలో "చమత్కార చంద్రిక" యను సాహిత్య శాస్త్రగ్రంథము (ఇది యముద్రితము వ్రాత ప్రతులున్నవి.) అపూర్వమైనది. దాని యాధారముతోడనే తర్వాతి కాలమున జగన్నాథపండితరాయలు రసగంగాధరములో పూర్వాచార్యుల మతములు ఖండించె నందురు. మరియొక రాచకొండ పండితుడు బొమ్మకంటి అప్పయార్యుడు

ఇక్కడ పెదకోమటి వేముని యాస్థానములో నున్న పండితులకు లెక్కలేదు అక్కడి విశ్వేశ్వరుని సోదరుడగు నృసింహభట్టు ఇక్కనుండి కాదంబరీకథను ఐదంకముల నాటకముగా రచించెను. పెదకోమటి వేముని పేరనున్న సాహిత్య చింతామణి తరుచుగా ఈ కాదంబరీ నాటక శ్లోకములను ఉదాహరించుచున్నది. విశ్వేశ్వరుడును నృసింహభట్టును ప్రతాపరుద్ర యశోభూషణ గ్రంథకర్తయగు విద్యానాథుని మేనల్లని కుమాళ్ళు. ఇతనికంటె ప్రసిద్ధుడైన కవి వామనభట్టబాణుడు. గద్యకవి సార్వభౌమ, సాహిత్యచూడామణి, సాహిత్యసామ్రాజ్య ధురంధర—ఇత్యాది బిరుదము లాతనికి కలవు. వీరనారాయణ చరితమను నామాంతరముగల వేమభూపాల చరితమను సంస్కృత గద్యకావ్యము జగత్ప్రసిద్ధి నొందినది. అందులో నతడు

పెదకోమటి వేమ భూపాలుని చరిత్రయే వ్రాసెను. అతని శృంగారభూషణ భాషణములో శ్రీ విద్యానగరములోని శ్రీ విరూపాక్షేశ్వరుని చైత్ర యాత్రా సమయమున విలాసశేఖరుడను శృంగార నాయకుడు నగర వేశ్యావీధిని వర్ణించెను. అతడే కనకలేఖయను నాటికను, కలాభ్యుదయము, రఘునాథ చరితము అను మహా కావ్యములను, హంససందేశమును రచించెను. మిత్రుడైన శ్రీనాథకవి తన యాంధ్ర కావ్యములలో వామనుని కావ్యములనుండి పాదములకు పాదములే కూర్చుకొనెను. ఇతడు శ్రీ విద్యారణ్య భారతీయతీంద్రుల శిష్యుడు. మరియు నా యాస్థానములో దైవజ్ఞశిఖామణియగు పెద్దియజ్వయు నాతని కుమాళ్లు రామచంద్ర గంగాధర జ్యోతిషికులును కలరు. పరహిత వైద్యుడేకాక, వ్యాకరణ న్యాయవైశేషిక శాస్త్రవిద్వాంసుడగు సింగనాచార్యుడుండెను. ప్రధానియగు మామిడి సింగన స్వయముగా జ్యోతిష శాస్త్రవేత్త.

పెదకోమటి వేమారెడ్డి కొండవీటి ప్రభువు కాకముందే శ్రీనాథుడు అక్కడికి వచ్చి కొన్ని శాస్త్రము లభ్యసించి మహామేధావియను కీర్తి సంపాదించుచుండెను. ముప్పదేండ్లు నిండకముందే క్రమాంతము వేదాధ్యయన మొనర్చి, శ్రౌతక్రియ నభ్యసించి సాంఖ్య న్యాయ వైశేషిక వ్యాకరణ సాహిత్య శాస్త్రములు క్షోదక్షమముగా నధిగమించి, ఇతిహాస పురాణాగమ రహస్యములు గ్రహించి, సంస్కృతాంధ్రములలో కవితానిపుణుడని పేరు పొందెను. ఆతని యశస్సు రాజకొండకు వ్యాపించినది. రాజకొండప్రభువు ఆతనికి తమ యాస్థానమునకు రమ్మని యాహ్వాన మంపెను. ఇది తెలిసిన వెంటనే పెదకోమటి వేమభూపాలుడు మంత్రులతో మంత్రించి, అప్పటికి వయస్సున పిన్నయని శంకింపక, సగౌరవముగా శ్రీనాథుని బిలిపించి కొండవీటి విద్యాధికారి పదవిలో ప్రతిష్ఠించెను.

తమకు శ్రీనాథుడుండు గౌరవము దక్కకపోయినను, రాజకొండ ప్రభువులకును, విద్వాంసులకును, నాగరకులకును ఆతనియం దభిమానము పోలేదు. ఆతని శాలివాహన సప్తశతితోడనే ఆంధ్ర భాషలో మహాకవి అవతరించెనను వార్త ప్రాకినది. శృంగారనైషధమును సింగనప్రధానికి కృతి సమర్పణమొనర్చి పఠించు మహాసభకు రాజకొండనుండి వైశ్య కుమారులును, నాగరకులును పాతికమందికి పైగా వచ్చిరి. వారు రాజకొండకు వెళ్ళి చేసిన ప్రశంసలతో రాజాచలము నాగానాయని కొండల కోనలు ఘూర్ణిల్లెను. నెల రోజులు దాటకముందే అక్కడికి ఐదువందల ప్రతులు వ్రాయించి పంపవలసి వచ్చినది సప్తశతిలోనివియు శృంగారనైషధములోనివియు కొన్ని పద్యములైన నోటికి రానివాడు విరసుడుగా పరిగణింపబడుచుండెను. శ్రీనాథ కవిప్రశస్తి కొండవీటి రాజ్యములోని అద్దంకి కొండపల్లి బెల్లముకొండ నాగార్జునకొండలకును, విద్యానగర రాజ్యములోని నెల్లూరు ఉదయగిరి కందుకూరు వినుకొండ దుర్గములందును, రాజకొండ దేవరకొండ రాజ్యములందంతటను మారుమ్రోగెను. సంవత్సరము లోపల కొన్నివేల ప్రతులు వ్రాయించవలసివచ్చు గౌరవము అంతకుముం దే గ్రంధమునకును లభ్యమై యుండలేదు.

ఆ కాలమే యంత కవితాభిమానము కలది. జక్కన విక్రమార్క చరిత్రమ్ము అనంతుడు భోజరాజీయము, కొరవి గోపరాజు సింహాసన ద్వాత్రింశిక ఈ కాలముననే వెలసినవి. గౌరన ద్విపదహరిశ్చంద్ర నవనాథచరిత్ర కావ్యములును, భాస్కర రామాయణములో కొన్ని కాండములును రచింపబడిన కాలమిదే. వినుకొండ వల్లభరాయడు క్రీడాభిరామము రచించుచుండెను. శివలెంక కొమ్మన మాహేశ్వరము పూర్తిచేసి శివలీలావిలసము రచించుచుండెను. నేటికిని ఆంధ్రులకు గౌరవపాత్రులైన ఈ కవులేకాక మరెందరో కవి కోకిలలు గానములొనర్చిన ఈ కవితా వసంతకాలమున శ్రీ నాథుని కవితాప్రౌఢి సర్వాతిశాయియై ఆంధ్ర కవితకు సంస్కృత ప్రాకృతములతో సమాన గౌరవము, పూర్వ మెన్నడులేనిది మొదటిసారి సంపాదించెను

పెదకోమటి వేమారెడ్డి స్వయముగా మహావీరుడు. ఆతని సేనానాయకులు మంత్రులు సమర్థులు. ఐననేమి? కాలము కలసి రాలేదు. ఒక్కొక్క సంవత్సరము గడచినకొలదియు నాతని రాజ్యములో ఒక్కొక్క ఖండమే ప్రక్క రాజ్యములు కబళించుచుండెను. తాను వృద్ధుడగుచున్నాడు. తన యాయుర్దాయమువలెనే కొండవీటి రాజ్యముగూడ చమురై ఆరిపోవుచున్న దీపమువలెనే ఉన్నదని

ఒకడు :- ఆహా! ఆ వైమానికుడెంత ఎత్తున ఎగురుతున్నాడో గదా! స్వర్గం చేరుకోవాలంటే ఇంకెంతెత్తు వెళ్లాలో!?

మరొకడు :- ఎంతెత్తుందుకూ! అక్కడనుంచి క్రింద పడితే చాలు!

మూదన నిత్యానందం, (వుదిపట్ల)

విదితమగుచున్నది. మహాతపస్వియు, త్రికాలవేది అనేక యజ్ఞయాజి హారీతగోత్రుడు నగు పెద్దియజ్వను రావించి పూజించి ఎన్నియో మారులు తన రాజ్యమునుగూర్చి ప్రశ్నించెను. ఆ తపస్వినోట ఈ రాజ్యము వృద్ధియగుననుమాట రాలేదు.

“నాయనా, నీ యాస్థానము విద్వన్నిలయము. నీ యాస్థానకవులకు చక్రవర్తి యాస్థానాదులలో అపూర్వగౌరవములు ప్రాప్తింపనున్నవి. నీవు విద్వత్పక్షపాతవి, మహాదాతవు అను యశస్సు నీకు చిరకాల ముండగలదు. అంతకంటె నేమి కావలె నాయనా! నీవంటి బుద్ధిమంతునికి వేరుగా చెప్పవలెనా? భగవంతు డనుగ్రహించిన దానితో మనము తృప్తిపడవలె! — ఇవే పెద్దియజ్వ తనతొంబదియవ సంవత్సరమున పరమపదించుటకు పూర్వము వేమభూజాని కుపదేశించిన చివరి వాక్యములు!

ఐనను వేముని హృదయములోని రాజ్యకాంక్ష త్రవ్వివేయ సాధ్యము కాలేదు. అది శల్యమువలె వేధించుచు యుద్ధములకు పురికొల్పినది. ఒక్కొక్క యుద్ధముతో ఒక్కొక్క రాజ్యఖండము తరుగుచుండెను. ఆ బాధ విస్మరించుటకై విద్వాంసుల నాదరించుచు, అగ్రహార దానములతో సత్కరించుచు, విద్వద్గోష్ఠులతో కాలక్షేపము చేయుచుండెను.

శ్రీనాథుని సర్వతోముఖ ప్రతిభ దిగంత వ్యాప్తి నొందుట చూచి యాతని శ్రీ విద్యానగరమునకు పంపవలెనను యూహ జనించినది. తన విద్యాధికారి శ్రీనాథభట్టు శ్రీ విద్యానగర విద్యాధికారి కవి సార్వభౌమ అరుణగిరినాథ డిండిమభట్టారకులను జయించినచో, తాను శ్రీ విద్యానగరరాజ్యముపై రాజకీయముగా సాధింపలేకున్న విజయము, విద్వద్విజయరూపమున సాధింపవచ్చుననియు, దానితో తన రాజ్య ప్రతిభ భరతలోకమందంతట వ్యాపించుననియు నాతడు తలంచెను. అది ఎరిగినంతన సింగనప్రధాని ఆ యూహకు ప్రోదిచేసెను. శ్రీనాథభట్టు తాను మధించిన శాస్త్రములలో నిధులగు విద్వాంసులతో నిరంతర గోష్ఠులు కావించుచు, నైశిత్యము వృద్ధిచేసికొనసాగెను.

శ్రీనాథున కప్పటికి నలుబదిమూడేండ్లు. దేహము పటువై శక్తి కలది. బుద్ధి తీక్ష్ణమైనది. హృదయాంతరంగము ఆర్ద్రమైనది.

ఆతని మిత్రము వామనభట్టబాణుడు వయస్సులో పెద్దవాడు. ప్రతిభలో తక్కువవాడుకాడు. ఆతడు పూర్వము విద్యానగరములో నున్నప్పుడు అరుణగిరినాథునిచేపరాభవింపబడినవాడగుటచేమాత్సర్యముచేశ్రీనాథునిప్రోత్సహించుచుసహకరించుచుండెను.

ఎట్లో శ్రీనాథుని యాత్రా వార్త రాజకొండకు ప్రాకినది. అక్కడివారికి శ్రీనాథుడు తమవాడేయను నభిమానము పోలేదు. అక్కడి ప్రభువులకును, తమ రాజ్యమునకుగూడ అవసాన దశ ప్రాప్తింపనున్నదని అంతర్యములలో తెలియక పోలేదు. వా రేకాంతమున విశ్వేశ్వరదేశికులను రావించి శ్రీనాథుడు డిండిములను జయించుట కుపకరించు శాస్త్ర రహస్యములు పంపవలెనని యర్థించిరి. విశ్వేశ్వరుడును పూర్వము అన్యాయముగా డిండిములచే నవదీరింపబడినవాడు. అతడు దీర్ఘముగా నాలోచించి, తనయొద్ద శాస్త్రాభ్యాసమునకై వచ్చియున్న బమ్మెర తిప్పనకు తన చమత్కారచంద్రిక ప్రతి యొకటిచ్చి కొండవీటిలో తన తమ్ముడగు నృసింహభట్టునొద్దకు పంపెను.

ఆకస్మికముగా నొకనాటి యర్థరాత్రివేళ పెద్దియజ్వ చివరి మాటలు వేమప్రభువుకు నిద్రపట్టకున్నసమయమున కొట్టవచ్చినట్లు స్మరణకు వచ్చినవి. శ్రీనాథుని విద్యానగర యాత్ర ఇక నేమాత్ర మాలసింపరాదని నిశ్చయించెను.

ఆ మరునాడే సింగనప్రధానితో నాలోచించి పెద్దియజ్వకుమారులగు రామచంద్ర గంగాధరుల రావించెను. తన విద్యాధికారియగు శ్రీనాథభట్టుకు విద్యా విజయ యశస్సు కామించి పెదకోమటి వేమారెడ్డి శా. శ. 1341 వికారి మార్గశీర్ష మాసమున ధనుస్సంక్రమణ పుణ్యకాలమున బ్రహ్మసూర్యాది సిద్ధాంత రహస్యైకవేదియగు గంగాధర జ్యోతిషికునకు రుద్రవరము అగ్రహారము కావించి దానముచేసి విద్యాధికారి శ్రీనాథునిచే శాసనశ్లోకములు వ్రాయించి తామ్ర శాసనము ప్రసాదించెను.

పెదకోమటి వేమారెడ్డి కావించిన తుది దానశాసన మదే. ఆతని విద్యాధికారి శ్రీనాథుడు రచించిన చివరి శాసన కావ్యము అదే! వెంటనే శ్రీనాథుని విద్యానగర యాత్రకు సర్వసన్నాహములు వైభవముగా చేయుటకు ప్రభువు ప్రధాని నాజ్ఞాపించెను.

(సశేషం)

వెళ్ళి ఒక్కటే కొట్టాడాయన. ఇంతలో రామయ్యన్న విసురుగా వచ్చి; ఆయనను దూరంగా తోసేశాడు. మీ అల్లుడిసంగతి తెలుసుగా — ఎవ్వరిమైకీ వెళ్ళరు. దూరంగా నిలబడి పొగలు క్రక్కుతూ చూస్తున్నాడు. నేనేం చేశాను ఇలా కొట్టారని అడిగాను ఏడుస్తూ—అంతే. నోటి కొచ్చినట్లల్లా అని ఇంక ముఖం చూడనంటూ పోయారయ్యా!'' అని ఏడవసాగింది.

''ఎంతవని జరిగింది—'' అన్నాడు తిరుపతయ్య వణుకుతున్న కంఠంతో.

''అసలు విషయం చెప్పనీయయ్యా'' అని ఆగింది

''ఇంకేం చెబుతావు—అల్లుడు కోపమున్నవాడు. ఆ రామిగాడి కేం వచ్చిందే మధ్యన వచ్చాడు. . . .'' అన్నాడు అలా వణికిపోతూ. అతని కళ్ళ వెంబడి నీళ్లు కారుతున్నాయి.

''నన్ను చెప్పనీ అయ్యా—నేను కాళ్ళమీద పడదామన్నా అందక వీధిన పోతున్నాడాయన. నేను గట్టిగా ఏడుస్తూ కేకలేస్తూ వీథిన వెళ్ళాను'' అని ఆగి—''ఇంతలో నిద్ర మెలుకవ వచ్చిందయ్యా'' అన్నది ఊపిరి బిగపట్టి.

క్రుంగిపోతున్న తిరుపతయ్య ఉలిక్కిపడ్డాడు.

''ఏమన్నావు తల్లీ—ఏమన్నావు?'' అన్నాడు ఆ దుఃఖంలో ఆత్రంగా.

''అవునయ్యా—ఏమీలేదు'' అన్నది తండ్రి వంక చూస్తూ—

ఏమీ మాట్లాడక కూతురివంక చూస్తూ వున్నాడు తిరుపతయ్య. తండ్రిని చూసి మెల్లగా ''అయ్యా! ఇది నిజంగా నాకు జరిగితే నేనే మవుతానే'' అన్నది ఆదిలక్ష్మి.

''ఛీ! ఏమిటా అశుభపు మాటలు'' అన్నాడు బాధగా విసుక్కొని.

''నువ్వు బాధపడ్డావుకదూ!''

''బాధపడటం— ! ఎంత కొట్టుకులాడి పోయింది గుండె. ఎంత భయపడిపోయాను. నాకు మతిపోతున్న ట్లనిపిస్తే—'' అన్నాడు తేరుకుంటూ.

''అయ్యా!—ఇది ఇలా నాకు జరుగుతే నువ్వే మయ్యేవో అలానే ఒక కూతురికి—నీలానే ఒక్కగా నొక్కకూతురు కలవాడికి—జరిగితే వాని తండ్రి నీలానే అవ్వడూ'' అన్నది బొంగురుపోయిన కంఠంతో.

''ఎందుకు కాదే—'' అన్నాడు తిరుపతయ్య.

ఆదిలక్ష్మి తండ్రివైపు సూటిగా చూస్తూ— ''నాకు ఇది జరగలేదు. కాని వింటుంటేనే నీ గుండె లవసిపోతున్నట్లనిపించింది. నిజంగా ఇది ఒకరికి జరిగి దాని తండ్రిగుండెలు పగులుతున్నాయే అయ్యా!'' అన్నది కొద్ది గట్టిగా ఏడుస్తూ.

కూతురువంక అయోమయంగా చూస్తున్నాడు తిరుపతయ్య.

''నువ్వు పగతో పుట్టావు. నీకు ఎదురు చెప్పినవాళ్ళు నాశనమవ్వాల్సిందే తప్ప నువ్వు వాళ్ళను వదలవు. వాళ్లేకాదు. వాళ్ళ సంతానం యావత్తూ నాశనమవ్వాల్సిందే. ఇది నీ పగ—'' అన్నది ఆదిలక్ష్మి తండ్రిని చూస్తూ.

తిరుపతయ్య మాట్లాడలేదు. కూతురు

కలత నిదుర

(17 వ పేజీ తరువాయి)

మొహమాటంలేకుండా చెబుతుంది ముఖంమీద. ఎందుకింత నిష్ఠూరంగా మాట్లాడుతుందో అర్థం కాలేదు.

''నీకు కావల్సినంత డబ్బు వుంది. ఇంకా సంపాదిస్తున్నావు—వేలకువేలు. ఆ సంపాదనంతా ఎందుకు—నా కివ్వటానికా! నాకుగాక ఎవరికిస్తావు? ఉన్న కొడుకు నొక్కడిని మనసు విరిచి పట్నం తగిలేసావు. అప్పన్న అన్నయ్య నీ సొమ్ములో కాణీ ముట్టుకుంటాడంటే నాకు నమ్మకంలేదు''

నేను క్లాసులో నుండి బయటికి వెళ్ళి నాలుగు స్వీట్స్ కొనుక్కొని వచ్చి క్లాసులో కూర్చున్నాను. మా మాస్టారు నేను బయటకు వెళ్ళిన తర్వాత పుస్తకము తీసి 'ప్రాడిగల్ సన్' అనే పాఠాన్ని చెబుతున్నాడు. నేను త్వరగా వచ్చి సీట్ లో కూర్చున్నాను. మాస్టారు నాకేసి చూచి "ప్లీస్, గివ్ మి, మై, షేర్" అన్నాడు. నేను తత్తరపాటులో రెండు 'స్వీట్'లు తీసి మేస్టారి ముందుంచాను. క్లాసంతా గొల్లుమన్నారు. ఏం చెయ్యాలో నాకు తోచలేదు.

గనిపిశెట్టి శంకరయ్య (చిట్టగుంట)

అని ఒక్కక్షణం ఆగి మెల్లగా ''వాడెందుకు పోయాడయ్యా ఇల్లు విడచి?'' అనడిగింది.

''అమ్మా!'' అన్నాడు తిరుపతయ్య అతి కష్టం మీద.

''జ్ఞాపకంలేదా అయ్యా! నువ్వు నాంచారుపెళ్ళి చెడగొట్టావు. ఊరులో పెళ్ళివాళ్ళు దిగారు. ప్రొద్దుట పెండ్లయితే ఆరాత్రి నాంచారు గుణం చెడ్డదన్నావు. నీ కొడుకుతో సంబంధం వున్నట్లు నీ పాలికాపు కుఱ్ఱాళ్లతో వాగించావు. ఇదంతా అప్పన అన్నయ్య ఊర్లో లేకపోవటంతో జరిగింది. గ్రుడ్డి ముండావోళ్ళు—పెళ్ళివాళ్ళు చీకొట్టిపోయారు. ఆ దెబ్బతో సింహాచలం మామయ్య పాతాళానికిపోయాడని సంతోషించావు. నీ కొడుకు మనసు విరిగి నీతో ప్రతికలేక పట్నంలో దూకాణాల్లో గుమస్తాగిరిలో బ్రతుకుతున్నాడు. వాడు పోయాడని నీకు ఇంతయినా చింతలేదు. నీకు డబ్బు కావాలి. సంపాదిస్తున్నావు. ఎవరికి—నాకా! ఛీ—నేను పుచ్చుకుంటానా? మాకు కావల్సినంత వుంది. నీతోనే నీ డబ్బునూ తగలేస్తాను. ఈ ఇంటి నుండి చీపురుపుల్ల పట్టుకెళ్ళను—'' అన్నది ఉద్వేగంగా కోపంగా దుఃఖంతో—

తిరుపతయ్య ఏమీ మాట్లాడక మూగపోయి పిచ్చివాడిలా కూతురివంక చూస్తున్నాడు.

''అయ్యా! నీ పగ సాధించుకున్నావు. రెండు సంవత్సరాలబట్టి తీసుకుంటున్న సింహాచలం మామయ్య పక్షవాతం ఎక్కువయి గంటలమీద వున్నాడు. పొలం బాగుచేసుకోవటానికి నీలాగే అతడూ అప్పుకు పెడితే నీకు రాకుండా ఆయనకు వచ్చిందనేగా పగపెట్టుకున్నావు! కూతురు పెండ్లి మీద దెబ్బకొట్టావు. ఇదిగో దాని ఆఖరిఘట్టం—సింహాచలం మామయ్య చచ్చిపోతున్నాడు. నాంచారమ్మ వీధులవెంటపడి దిక్కులేనిదౌతుంది. దాని ఉసురు నీకు తగుల్తుంది—నేనిక ఈ ఇంట ఉండను. రేపే మా అత్తగారింటికి పోతున్నాను. మీ అల్లుడు ప్రతిరోజూ నా కోసం రావడం నాకే సిగ్గుగావుంది. ఈ ఇల్లూ ఆ డబ్బూ పెట్టుకో—ఇంకా ఎవరైనా ఉన్నారేమో చూడు. వాళ్లవెంటపడు. వాళ్లను వాళ్ల వంశాంకురాలతో సహా మాడ్చివేయి—'' ఆదిలక్ష్మి ఇంక మాట్లాడలేకపోయింది. లేచి నిలబడి—''సింహాచలం మామయ్యను మిషినాసుపత్రిలో వేశారంట. ఉన్న పదెకరాలు అమ్ముకొని రోగం నయమవుతుందేమోనని చూశాడు ఈ రెండు సంవత్సరాలు. పెళ్ళికానిపిల్లకు కాణీ లేకుండా చేసి పోతున్నాడు'' అన్నది.

తిరుపతయ్య నిరుత్తరుడై అలానే కూర్చొని వున్నాడు. రాయిలా మాట్లాడక కూర్చున్నాతడు వింటున్నా, వినకపోయినా తనే చెప్పుకుపోయింది. హాలు విడచి వెళ్తూ వెళ్తూ వెనుతిరిగి—''అయ్యా! మధ్యాహ్నం కబురందింది. సింహాచలం మామయ్య చచ్చిపోతే నాంచారమ్మ గతేమిటని ఆలోచించావు. నేనే నాంచారమ్మనయితే ఎలాగౌతా ననుకున్నావయ్యా!'' అన్నది బాధగా దుఃఖంతో రుద్ధమైన కంఠంతో—

తిరుపతయ్య చటుక్కున కూతురివంక చూశాడు. అతడిలో ఎటువంటికళా లేదు. పాలిపోయి క్రుంగిపోతున్నట్లున్నాడు.

ఆదిలక్ష్మి పెరటిలోకి వెళ్ళిపోయింది. లేచి నిలబడ్డాడు తిరుపతయ్య. కాళ్ళల్లో సత్తువ లేనట్లనిపించింది. తప్పటడుగులు వేసుకుంటూ భోషాణంగదిలోకి వెళ్ళాడు. దానిని చూడగానే వరనరాలలో ఏదో శక్తి విజృంభించింది. గబగబా దానిమీద సామానునంతా దింపి భోషాణం తెరచి ప్రొద్దుట తెచ్చిన రెండువేలూ తీసి రొండిన కట్టుకున్నాడు. తిరిగి భోషాణం మూసి కర్ర తీసుకొని హాలులోకి వచ్చాడు. ఆదిలక్ష్మి వచ్చింది. ఆవిడ ముఖంలోకి చూడలేకపోయాడు.

''చూడు తల్లీ! తలుపు వేసుకో—అప్పన్నబాబు నాంచారమ్మతో వచ్చి తలుపు తియ్యమన్నప్పుడు నాకూ తలుపు తియ్యి'' అన్నాడు వీధిగుమ్మం దాటుతూ.

★

సినీవిహారం

(11 వ పేజీ తరువాయి)

ఫోటోతో సరదాగా సంపూర్తి కావటం చిత్ర సంప్రదాయమైపోవడమే.

నవంబర్ 18 వ తేదీన వాహినీ స్టూడియో 3 వ ఫ్లోర్ లోకి అడుగు పెట్టగానే నాగేశ్వరరావు, సావిత్రి, గుమ్మడి, నాగయ్య, రమణారెడ్డి, గిరిజ, రేలంగి అంతా కలకల లాడుతూ కనుపించారు. వారితోబాటు నిర్మాతలు రంగారావు, రాజేంద్రప్రసాద్‌లు, దర్శకుడు వి. మధుసూదనరావు ఆరోజు పెట్టుపై షూటింగ్ పూర్తి చేశారు. 14 రీళ్ల చిత్రం పూర్తయింది. ఇంకొక్క రీలు అంటే సుమారు వెయ్యి అడుగుల చిత్రం దబ్బా తయారుకావాలి. మూడు పాటల చిత్రీకరణ మిగిలివుంది. మాటలు గల సన్నివేశాల శేషం తయారైపోయింది. ఈ నెలలో చిత్రానికి చివరి మెరుగులు అందించబడతాయి.

అటు షూటింగు కార్యక్రమం, ఇటు పాటల రికార్డింగ్ సందడి జరుపుతూ జగపతివారు కొత్త తాజా రచించిన పాటను రికార్డు చేశారు. ఇది లక్ష్మి (గిరిజ) జన్మదినోత్సవంనాడు ఒక అబ్బాయి ఒక అమ్మాయిగా అయుతూ పాడుతూ పాడే పాట. "ఏమంటా వేమంటావోయ్ బావా! అంటావంటే మంటవోయి బావా! నువ్వు నామాటకే మంటవోయి బావా!" అని అమ్మాయి పరంలో వినిపిస్తుంది. "కోపంట కోపంట కోపి పిల్లా! నీమాట కొనంట కోపిపిల్లా, నువ్వు నీమన్న సైయంట ఓసిపిల్లా" అని అబ్బాయి అదాలిస్తుంది. నాగేశ్వరరావు వాణిలో పీఠాపురం నాగేశ్వరరావు స్వరపరిచిన తియ్యని స్వరంతో ఈపాట తయారైంది



అన్నపూర్ణావారి 'డాక్టర్ చక్రవర్తి'లో జానకితో సావిత్రి, నాగేశ్వరరావు.

గులేబకావళి కథ

ప్రతి పెట్టుని పెద్ద ఎత్తులో తయారు చేయటం, అందులో కొత్తదనం చూపినోదాన్ని సేవ శక్తి చూపించటం ఎన్. ఎ. టి. సంస్థ చిత్ర నిర్మాణ సత్ప్రవర్తయుం. వారి తాజా చిత్రం "గులేబకావళి కథ" నిర్మాణం జోరుగా సాగుతోంది. వాహినీస్టూడియో ఏడో ఫ్లోర్‌లో వెలిసిన సెట్ వరం చాలా ఖర్చుతో కమల విందుగా తయారు చేశారు. ఒక కొలను చుట్టూ చిన్న నెమలి పెద్ద నెమలి బొమ్మలున్నాయి. వాటిలోంచి నీళ్లు కవనాన్నా, స్నానాల కొంటుని విందుతున్నాయి ఇక్కడ హీరో హీరోయిన్ల ప్రేమ మొలిచింది యుగళగీతంగా సత్యం పొందిన సన్నివేశాల చిత్రీకరణలో ఒక భాగం మనకు తెరపై కనుపిస్తుంది ఈ గీతంలో నారాయణరెడ్డి రంగరించిన మాధుర్యం ఎంత ఉందో సంగీత కళాదర్శకుల కాన రేఖల సౌందర్యమూ అంతగానూ ఉంది జమున సుంటపాటల స్వరం అంత కమ్మగానూ ఉంది కొత్త అమ్మాయి నాగరత్నం గులేబకావళిగా నటిస్తోంది. ఆమె ప్రియుడుగా ఎన్. టి. రామారావు నటించాడు. ఈ చిత్రం కూడా కొత్త సంవత్సరం కాకుండా సమర్పించటానికి నిర్మాత త్రివిక్రమరావు సన్నాహాలు జరుపుతున్నారు.


ఈ చిత్రంలో అదనపు ఆకర్షణ జమున ఈ మధ్యకాలంలో జమున, రామారావులు కలిసి నటించిన తెలుగు చిత్రం తయారుకాలేదు ఈ జంట తెరమీద తిరిగి కలిసి నటించిన తొలిచిత్రం ఇదే ఈచిత్రంలో ఆమె యుక్తిమతిగా నటించింది

కొత్త కళాదర్శకుడు కె నరసింహారావు, కొత్త సంగీత దర్శకుల జంట జోసఫ్, వేలూరి కృష్ణమూర్తి ఈ చిత్రంతో పరిచయం కాబోతున్నారు

మిస్సెంద్రమణి, ఛాయాదేవి, కె వి ఎస్ శర్మ, ముక్కామల, లంకసత్యం, పద్మనాభం, బాలకృష్ణ, పేకేటి ఈ చిత్రంలోని ఇతర తారలు

పదండి ముందుకు

"మా కొద్దీ తెల్ల దొరతనము" అని ఆంధ్రులు ఆవేశపూరితులై సహాయ నిరాకరణోద్యమం సాగించిన 1930 నాటి రాజకీయ చైతన్యం రోజులలో సాంఘిక జీవనంలోని సంచలనాన్ని చూపించే చిత్రాన్ని జాగృతీవారు చిత్ర "పదండి ముందుకు" పేరుతో హైదరాబాద్‌లో తయారు చేస్తున్నారు. ఇది తెలుగు చిత్రనిర్మాణంలో సరికొత్త రకం చిత్రం 1930 వాతావరణం కళ్లకు కట్టినట్లు ఇందులో



జగపతివారి 'ఆరాధన'లో డా॥ శివరామకృష్ణయ్య, రమణారెడ్డి.

సినీవిహారం

చూపించటానికి నిర్మాత కృష్ణమూర్తి, కథకుడు చంగయ్య, సంభాషణల రచయిత, హీరో జగ్గయ్య కృషి చేశారు.

ఆగస్టు 18 న షూటింగ్ కార్యక్రమం ప్రారంభించిననాడే ఈ చిత్రాన్ని రిపబ్లిక్ దినోత్సవం జనవరి 26 న విడుదల చేయాలని నిర్మాతలు నిశ్చయించుకున్నారు. ఆ నిర్ణయం ప్రకారం నిర్మాణంలో ముందుకు పోతున్నారు. ఆరోజే విడుదల చేయగలుగుతారు.


ఈ చిత్రంలో జగ్గయ్య, జమున, గుమ్మడి, జీ. వరలక్ష్మి, రమణారెడ్డి, హేమలత, కాంతారావు, కె. వి. ఎస్. శర్మ ప్రధాన పాత్రలు నిర్వహిస్తున్నారు. సంగీతం: కోదండపాణి, దర్శకత్వం : వి. మధుసూదన రావు.

ఆంధ్రరత్న దుగ్గిరాల గడుగ్గాయి మెట్టిన సీరాలలో ఔట్‌డోర్ దృశ్యాల చిత్రీకరణను కూడా నిర్మాతలు పూర్తి చేయటంతో చిత్రానికి ముగింపు మెరుగులు అందివ్వటంలో నిమగ్నులౌతారు.

సిరి సంపదలు

పద్మశ్రీ పిక్చర్స్ నిర్మాత కె. వెంకటేశ్వర్లు, దర్శకుడు పి. పుల్లయ్య తమ కొత్త చిత్రానికి "సిరి సంపదలు" అనే నామకరణం చేశారు. ఈ చిత్రాన్ని వారు సెప్టెంబరు 16 న ప్రారంభించారు. ఇప్పటికి ఏడున్నర రీళ్ల చిత్రం తయారై పోయింది

ఈమధ్యనే రఘుపతి జమిందారుగారి వాల్తేరు గిల్ల భవంతిలో ఒక భాగం విజయా స్టూడి



హైద్రాబాద్ మూవీస్ వారి "పెళ్ళికాని పిల్లలు"లో జగ్గయ్య, జమున.


యోలో తయారుచేసి అక్కడ జరిగే దృశ్యాల చిత్రీకరణమ కొనసాగిస్తున్నారు. సిరిసంపదలు గల కుటుంబం రఘుపతిగారిది. ఆ దివాణం అంతటి గొప్పదనాన్ని చూపిస్తోంది. గోకులాష్టమి పండుగ నాడు ఆయన కొడుకు, కూతురు, అల్లుడు, మనుమలతో కృష్ణభగవానుడికి వేదోక్తంగా పూజ జరిపించి ఊరిలోనివా రందరికీ వస్త్రదానం చేశారు.

రఘుపతి జమీందారుకి ఒక కొడుకు. ఆయన పేరు జగపతి. (గుమ్మడి), కూతురు పార్వతి (శాంత కుమారి), అల్లుడు చక్రధరం (జూనియర్ ఎ. వి. సుబ్బారావు), ఆయన ఎస్టేట్ మేనేజర్ గరటయ్య (రమణారెడ్డి), మిసెస్ గరిటయ్యా భద్రమ్మ (సూర్య కాంతం). రఘుపతిగారికి నమ్మినబంటు, దివాణం షౌఖరు అంజయ్య (చదలవాడ), వీ రందరూ గోకులాష్టమి పూజను కనులపండుగ చేశారు. జగపతికి ముగ్గురు ఆడపిల్లలను అందించి ఆయన భార్య కన్ను మూసింది. ఆ పిల్లలే పద్మ (సావిత్రి), రమ (గిరిజ,)లత(వాసంతి) అటు కూతురు పార్వతమ్మకో కొడుకు—ప్రసాద్ (నాగేశ్వరరావు). ఈ పండుగ జరిగిన కాలం నాటికి మనుమడు, మనుమరాండ్రూ చిన్న వయసులో ఉన్నారు. కథ అక్కడ ప్రారంభమై వారితోబాటు పెరిగి పెద్దదై సిరిసంపదలు గల కుటుంబంలో జీవితాల సంఘర్షణ వరకూ సాగి లోకానికి చెప్పదలుచుకున్న నీతి పాఠాలన్నిటినీ చెప్పేస్తుంది.

ఈ చిత్రానికి కథ, మాటలు పిని శెట్టి, సంగీతం. వేణు, కళ : కృష్ణారావు, కామెరా : మాధవ్ బుల్ బులే. ఈ చిత్రంలో పై పూజకు వచ్చినవారు కాకుండా రేలంగి, రాజనాల, చలం కూడా ప్రముఖ పాత్రలు నిర్వహిస్తున్నారు. ★

వనితలకు మనవి

వనితావాణికి పంపే ఉత్తరాలు క్లుప్తంగా ఉండాలి. వీలైనంతవరకూ పత్రికలో సగం 'కాలం' మించకుండా ఉంటే బాగుంటుంది. వ్రాసినవారి పేరు వగైరా తెలుగులోనే వ్రాయాలి. ఇంగ్లీషులో ఉండకూడదు.


1936 నుంచి
దక్షిణ భారతానికి
చేస్తున్న సేవ
మెట్టూరు ఇండస్ట్రీస్ లిమిటెడ్
మెట్టూరు డామ్ ఆర్. ఎస్. సేలం జిల్లా
దక్షిణ భారత దేశానికి
25 సంవత్సరాల సేవ
మేనేజింగు ఏజంట్లు:
డబ్ల్యు. ఏ. బియర్డ్‌సెల్ & కంపెనీ (ప్రైవేట్) లిమిటెడ్
8, సెకండ్ లైన్ బీచ్, మద్రాసు - 1.

హరివంశం

(15-వ పేజీ తరువాయి)

సంబోధించెను. ఇప్పుడు పౌండ్రక ! యనుచున్నాడు. ఇంతవరకు మందుని వలె ఉన్నవాడు అంతలో నిప్పుడు తీక్ష్ణుడై పోయినాడు.

"పౌండ్రక !"

"ఆచార్య మహానంద !"

"నీకు ఒక్క విషయము చెప్పమందువా !"

"అట్లులనే !"

"జనకుని గురించియే చెప్పెదను. నీవు అష్టావక్రుని గూర్చి ఎప్పుడైనను విన్నావా ! గౌతముడైన అరుణికి ఆయన దౌహిత్రుడు. శ్వేతకేతువునకు మేనయల్లుడు. మరి అరుణియు, శ్వేతకేతువును ఎట్టివారు ? వారు పరమ బ్రహ్మవిదులు. వారికన్నను బ్రహ్మవిద్యలో అష్టావక్రులు మిన్న. ఆయన ఒకసారి జనకుని దర్శింపబోయెను. జనకుడాయనను గౌరవించి ఇట్లు ప్రశ్నించెను. స్వామి! ప్రభువా ! జ్ఞానము సిద్ధించుట యెట్లు ? ముక్తి కల్గుట యెట్లు ? వైరాగ్యము ఎట్లా సంప్రాప్తమవుతుంది ? నాకు ఇది చెప్పుమా ?" అని ప్రశ్నించెను. పౌండ్రక ! జ్ఞాన మనగా నేమి ? ముక్తి యనగా నేమి ? వైరాగ్య మనగా నేమి ? నీకు ఏమియు అక్కరలేదు. పౌండ్రక ! అష్టావక్రు డని వాడు గదా ! "యదానాహం తదా మోక్షో, యదాహం బంధనం తదా, మత్వేతి హేలయా తాత మా గృహాణ విముంచ మా" అని. అనగానేమి ? ఎచ్చట "నేను" అన్నది లేదో, అచ్చటనే మోక్షము. ఎచ్చట నేను ఉన్నచో అప్పుడనే బంధము. ఈ విషయమును తెలిసికొనవలసినదిగా అష్టావక్రుడు జనకుని కోరెను. జనకుడు దీనిని తెలుసుకొనెను. విదేహు డయ్యెను. మరి నీకో? నీకు నేనునకు మించినది వేరుగా లేదు. మరి ఆ నేను అనగా నేమి ? నిన్ను చూచుచుండగనే తెలియుచున్నది. ఆ నేనును ఎరిగిన వానికి దేహముమీద నింత అభిమానముండునా ! నీవు ఆ దేహమునకు అలంకరణము గూడ చేసికొంటివి. ఎవరిదో దేహమును పోలె నీ దేహము గూడ నుండవలయునని అనుకొంటివి. అట్లుండుటకు ప్రయత్నించితివి. ఇది యేమి అభిమానము. పౌండ్రక! నిజము చెప్పమందువా! నన్ను గురువునుగా నీవు ఎంచుకొననేరాదు. ఎంచుకొంటివి పో, ఇట్లు నా ఎదుటనే అహంకారమును ప్రదర్శించరాదు నేను వట్టి జడుడనే కావచ్చును. మా సాందీపని నన్ను అట్లనే పిలుచును. నిజముగ నేను జడుడనేమో గూడ. నాకు తెలియదు. ఆ తెలిపినది ఒక్కటే. అహంకారము దగదని తెలియుట గూడ నహంకారమే యగునో ! నాకు తెలియదు. పెద్దలు చెప్పగా విన్నది చెప్పుచున్నాను. ఏమియు తెలియక పోవుటయే తెలియుట. తెలిసినచో నన్నియు నీవే యగుచున్నావు. అప్పుడు తెలియదగినదే లేదు. అసలు నీవే లేవు. అప్పుడు మరియొక్కడేమి ఉన్నది. నీదియైన యున్నదో, అది నీవే యగుచున్నావు. అప్పుడు నీవు చేసెడిది, నీచే చేయబడునది, ఏమియును లేదు. తెలియక తెలిసితిననుకొనువాడు పశువు. నిజమునకు పశువు వానికన్న నయము. అష్టావక్రుడు జనకునకు చెప్పినాడు. ఏమని ? "న హ్యాత్మజ్ఞస్య ధీరస్య ఖేలతో భోగలీలయా, నహి సంసారవాహీకై ర్మూఢైః సహ సమానతా" అని ఆత్మజ్ఞుడైన ధీరుడు భోగలీలాపరుడై ఆడెనే అనుకొనుము. వానికిని సంసారవాహియైన మూఢునకు ఏమి సంబంధము. ఆత్మజ్ఞుడైన వాని హృదయములో పుణ్యాపాపములకు, ఈర్ష్యాద్వేషములకు స్థానమే లేదు. ఆకాశము ఉన్నది. ధూమము లేచి ఆకాశములో ప్రవేశించినది ఆ ధూమము ఆకాశమును తాకుచున్నదా ? ఆ ఆకాశమునకు అంటుచున్నదా ! అంటుచున్నట్లు, తాకుచున్నట్లు కన్పించును. నిజమునకు అచ్చట అంటుటయు లేదు తాకుటయు లేదు. నీవు అట్టివాడవా ? నీలో ఈర్ష్య ఉన్నది. ద్వేష మున్నది. నీకు కృష్ణునివలె నుండవలెనని, కృష్ణుడవు కావలెనని యున్నది. ధనార్జనరతుడైన లుబ్ధుని పోలి నీవు కృష్ణుడవు కాజూచుచున్నావు. అందులో దోష మున్నదా ! నిశ్చయముగా నిన్ను నీవు ఎరిగినవాడవు, ఎరుగ దలచినవాడవు అగుచో అట్లు చేయవు. ఆత్మజ్ఞుడైనవాడు తన్నుతా నెరిగినవా డగుట తన యిష్టము వచ్చినట్లు జీవించును. స్వైరముగ గూడ జీవించును. నీవు అట్లా ! నీవు ఎవ్వరివలెనో జీవించవలయు ననుకొనుచున్నావు ? నీవు ఆత్మజ్ఞుడవుగాని ఆత్మజిజ్ఞాస కలవాడవుగాని ఎట్లగుదువు ? పౌండ్రక! ఇది మార్గము కాదు. నీవు ఇంకను కుర్రవాడవు. పెండ్లి చేసుకొని గృహస్థ ధర్మమును పాలించవలసిన వాడవు. రాజ్యము ఏలను దిద్దవలసినవాడవు నీకు ఇట్టి బుద్ధి తగదు. శ్రీకృష్ణునితో నీకు సాపత్న్యమేమి ? అతడు ఎవ్వరు ? .....

"ఆచార్య ! దీర్ఘముగ నుపన్యసించినారు. అలసియుందురు. కొంచెము విశ్రాంతి తీసికొనుడు ఆత డెవ్వరో నేను చెప్పెదను ? అతడు దొంగ. పరస్త్రీలోలుడు ఆతతాయి. మేనమామను హత్య చేసినవాడు. వాడు భగవంతుడు. నేను, అవి ఏమియు చేయనివాడను, చేయువలయునని లేనివాడను, భగవంతుడను కాదు. వాడు వాసుదేవుడు. నేను కాకపోయితిని. చాలునా ? స్వామి ! మన యీ విద్య ఇంతటితో కాలేదు. మీరు దినమునూ వచ్చుచుండవలయును. నేను రథమును పంపుచుందును. నేటికి సెలవు ఇప్పింతును."

మహానందుడు మాటాడలేదు. మాటాడుటకు గూడ ఏమియు లేదు. అందువలన ఆయన "అట్లులనే" అనినాడు.

"ఎవడురా ! అచ్చట ! ఆచార్య మహానందులకు రథమును సిద్ధము చేయింపుము."

బయట సేవకుడు "చిత్తము" అనెను. ★

వివశుడు

(8-వ పేజీ తరువాయి)

ఎక్కువ. ఆమాటకొస్తే మా రెండు కుటుంబాలకీ చాలా సాన్నిహిత్యంవుంది."

"అయితే ఇది మీ స్వంతవూరేనన్నమాట?"

"కాదు. విజయవాడ. సూర్యారావుగారు మా నాన్నగారు అక్కడే చదువుకున్నారు. మా నాన్నగారు ఇంటర్‌తో ఆగిపోయారు. ఈయన లాయరై ఇక్కడి కొచ్చారు."

"మీ రిక్కడ ఏదయినా ఉద్యోగం చేస్తున్నారా?"

"స్టాటిస్టికల్ ఇన్వెస్టిగేటర్!"

"బావుంది. రోజూ చాంద్రాయణం చేయాలన్న మాట?" అన్నదామె నవ్వి

"దాదాపు"

సరస్వతి ఒక్కక్షణం ఆగి, "మీరు ప్రతి ఆది వారం ఇక్కడికి వస్తారా?" అన్నది.

"ఆ. ఏం?"

"నాకు ఈ గార్డెన్సంటే ఎంతో యిష్టం. మీకూ అంతేనా కాదా, అని."

"అయితే మీ నిర్ణయం పొరపాటే. దీనిమీద ప్రేమతోకాదు వస్తూంట. గతిలేక"

"అదేం?"

"అంతేకదా? మరోచోటికి పోవాలంటే జేబులు ఖాళీచేసుకోవాలి."

"అయితే మీకు సదభిప్రాయం లేదన్నమాట?"

"ఎలావుంటుంది చెప్పండి? చేతులారా పొర్కు అండ్లు, పోరులూ, పాలకులూ కూడా పాడు చేస్తున్నారు ఇక్కడ అంతా బంగరుబయలు కాబట్టి బావుంది. అలా ఆ సరోవరం పక్కకి పొండి. ముక్కులు బద్దలయిపోతాయి."

"నిజమే మరి" అన్నది సరస్వతి.

"మీరు సుల్తాన్‌బజార్‌లో వుంటున్నారా?" అన్నాడు ప్రసాదరావు.

"ఊఁ"

తన సంగతి అడక్కపోయినా, "నేను హిమాయత్‌నగర్‌లో వుంటున్నాను" అన్నాడు ప్రసాదరావు

"అలాగా?"

"మీ కీ ఊళ్లో ఎవరయినా స్నేహితులున్నారా?"

"సువర్చలా రాంబాబూ తప్ప మరెవ్వరూ లేరు."

ప్రసాదరావు నవ్వి, "మంచి స్నేహితులే!" అన్నాడు.

"నిజం కూడా అంతే. ఇద్దరూ అమాయకులు. నిష్కల్మషహృదయులు. అభిమానించడమేగాని అభిశంసించడం ఎరగరనిపిస్తుంది."

"రాంబాబు కుర్రవాడు. సువర్చల మీ రనుకున్నంత అమాయకురాలు కాదు."

సరస్వతి అతనిమాటల్ని గురించి ఒక్క క్షణం ఆలోచించి ఆపేసింది.

"తీరికవేళల్లో ఏం చేస్తుంటారు?" అన్నాడు ప్రసాదరావు.

"రాత్రి ఎనిమిదిగంటల తరువాత తీరిక. ఏవయినా పుస్తకాలు చదువుకుంటాను. సూర్యారావుగారింట్లో లైబ్రరీ వుందికదా?"

"సాహిత్య ప్రియులన్నమాట?"

"కొద్దిగా"

"అయితే మధుమూర్తి రచనలేవన్నా చదివారా?"

"అయ్యో! చదవకేం? ఆయన నా అభిమాన రచయిత"

"ఎలావుంటాయి?"

"చాలా సున్నితంగా వుంటాయి—అక్కడక్కడ కొన్ని అతిలోకత్వం కనిపించినా"

"అతను నా మిత్రుడు" అన్నాడు ప్రసాదరావు కొంచెం గర్వంగా.

"అలాగా?"

సంభాషణలో కొత్తరకం సంగతి పసిగట్టాడు ప్రసాదరావు. ఆమె జవాబులే అందుకు కారణం. అవి ఎంత సూటిగా స్వచ్ఛంగా వున్నాయో అంత నిగూఢంగా కూడా వున్నాయి. ఒక పరిధిని ఏర్పరుచుకుని దానిని అధిగమించకుండా వాక్కున బంధిస్తోందామె. అది ఆడవాళ్ళకు సహజమేమో? అనుకున్నాడతను. అందుకే, ఆ తరువాత కొన్ని క్షణాలదాకా సంభాషణ కొనసాగలేదు.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అన్నది సరస్వతి అటెటో చూస్తున్న ప్రసాదరావుతో.

ప్రసాదరావు సందర్భోచితంగా "అక్కడ ఆ ముసలాడికీ, కుర్రాడికీ జరుగుతోన్న వివాదం చూశారా?" అన్నాడు.

"ఏమిటో?"

"ఆ కుర్రాడు గులాబిపువ్వు కాబోలు కోశాడు. ఆ ముసలాడు పోట్లాడుతున్నాడు"

"అంతా గమనించారన్నమాట?" అన్నది సరస్వతి నవ్వుతూ.

"అలవాటయిపోయింది" అని, "గులాబి పువ్వును చూసినప్పుడల్లా నాకు ఒక సందేహం కలుగుతూంటుంది. అంత అందమయిన పువ్వుకి భగవంతుడు ముళ్ళు ఎందుకు పెట్టాడంటారు?" అన్నాడు ప్రసాదరావు.

"గొప్ప ధర్మ సందేహమే!....... అనుభూతికీ అనుభవానికీగల సరిహద్దును నివరించటానికేమో?"

"అనుభూతి కలిగినప్పుడు అనుభవం కావాలనిపించదంటారా?"

"అందుకుతగ్గ అధికారంవుంటే ముళ్ళు తప్పుకుంటాయేమో?"

"ఎలాంటి అధికారం?"

"మానసికంగా. నిశ్చలమయిన అంతరంగం కలిగివున్నాడా లేదా అన్నదే మనిషి గొప్పదనానికి గీటురాయి. భగవంతుడి స్త్రోతాను అదే. అలాంటి అంతరంగం ఎప్పుడూ అపజయం పొందదు."

"పొందితే?"

"కలిధర్మం అనుకోవాలి" నవ్వేసిందామె.

తానుకూడా నవ్వి, "సంభాషణ కథల్లోలాగా సాగింది" అన్నాడు ప్రసాదరావు.

"మీ [illegible]మూర్తిగారి కథలనిండా అంతేగా?"

చీ[illegible]తోంది అప్పటిదాకా ఉషారుగా కబు[illegible]కుంటూ చూకూచున్న జంటలూ, గుంపులూ మె[illegible]క్కకు బయుుదేరసాగారు గూళ్ళకుజేరే వే[illegible] ప్రసాదరావు గడియారం చూసు కు[illegible]ంది వెళదామా?" అన్నాడు.

"వదండి" అన్నది సరస్వతి లేస్తూ.

ఇద్దరూ రోడ్‌మీదికి వచ్చారు. మౌనంగానే నడవసాగేరు. ఒకర్ని గురించిన ఆలోచన మరొకర్ని ఆక్రమించుకుంది—అప్రయత్నంగా. ఆమెను ప్రసాదరావు గమనించినట్లే సరస్వతికూడా అతన్ని గమనిస్తూనేవుంది. ఎల్లప్పుడూ చిరునవ్వుతో వెలిగే అతని వదనమూ, టూకీగా, తమాషాగావుండే అతని విగ్రహమూ ఆమెకు తమాషా అయిన అనుభూతిని కలిగించేవి. ఇవాళ అతను మాటాడిన తీరూ, అతని హావభావాలూ అందుకు దోహదం చేశాయి. అతన్ని గురించి సువర్చల ఒకసారి అన్నది "చాలా మంచివాడు" అని. అది నిజమయినా, కాకపోయినా బిడియస్తుడూ, తెలివిగలవాడూ అనుకుందామె.

గన్ ఫౌండ్రీ రోడ్ వచ్చాక ఆగి, "మరి నాకు సెలవా?" అన్నాడు ప్రసాదరావు.

చేతులు జోడించింది సరస్వతి.

సరికొత్త

శీర్షిక

63వ పేజీలో

"వీలయితే రేపు సాయంత్రం సూర్యారావుగారింట్లో కలుద్దాం."

"అలాగే"

"సెలవు"

"సెలవు"

రూముకి చేరుకున్నదాకా ప్రసాదరావు సరస్వతినిగురించే ఆలోచించాడు. ఆ రోజుతో సరస్వతియందు అతనికున్న సద్భావం, గౌరవం ధ్రువపడ్డాయి. ఆమెపరిచయం వృద్ధిచేసుకోవాలి. అవును. కొందరు మనుషులు వాళ్ళ అమాయకత్వం మూలాన ఆత్మీయు లవుతారు. మరికొందరు వారికి వున్న ప్రేమవల్ల దగ్గరవుతారు. సరస్వతిలాంటివాళ్ళు ఉన్నతమయిన తమ గంభీర హృదయం వలన స్నేహ పాత్రులవుతారు. అలాంటి స్నేహం జీవితాన్ని సరిదిద్దుతుందేమో!

ప్రసాదరావు తిరిగి ఆ మరునాడు సరస్వతికోసమని సూర్యారావుగారింటికి వెళ్లాడు. ఆ సమయాన సువర్చల, సుశీలాదేవి మధ్య హాల్లో కూచుని వున్నారు. అతన్ని చూడంగానే "దారితప్పి వచ్చినట్లున్నావే?" అన్నది సువర్చల. ప్రసాదరావునవ్వి కుర్చీలో కూచున్నాడు.

"ఎలా వుందయ్యా ఉద్యోగం?" అన్నది సుశీలాదేవి.

"మామూలే!...... బాబాయిగారు ఇంట్లో లేరా?" అన్నాడు ప్రసాదరావు అన్ని వేపులా క్రీగంట అవలోకగా పరిశీలిస్తూ. అతనికి కావలసింది ఎక్కడా కనపడటంలేదు.

"రాంబాబును తీసుకుని బజారెళ్ళారు. రేపు వాడి పుట్టిన రోజుగా? ఏవో కొనుక్కొస్తార్ట"

ప్రసాదరావు సందేహం తీరిపోయింది అయినా ఆశపోక, "అయితే వాడి కివాళ ఘుట్టీ అన్నమాట?" అన్నాడు సహజ మందహాసంతో.

"ఆ! సరస్వతితో నిన్ననే చెప్పేశాను" అన్నది సుశీలాదేవి.

ఆమాట అతనిలో ఆసక్తి రేకెత్తించింది. నిన్నటి వీడ్కోలు గుర్తు తెచ్చింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావు?" అన్నది సువర్చల.

"ఏంలేదు.......అవునుగాని పిన్నీ! వాడి పుట్టిన రోజుకి నన్ను పిలవకుండా ఊరుకుందామనుకుంటున్నారన్నమాట?" అన్నాడు అతను కుహనా విఘ్నారంగా.

"ఆహా" కొంటెగా అన్నది సువర్చల.

"నిన్నెవరూ అడగలేదు లేవోయ్!"

"నీతో చెప్పలేదులేవోయ్!"

సుశీలాదేవి నవ్వుకుని "ఊరుకోండ్రా మీ యిల్లు బంగారంగానూ! . . . . . అయినా ఈఅదిరిపాటు ఎన్నాళ్ళలే? ఆయనగారి కొక రాణీగారూ ఈవిడగారి కొక రాజాగారూ వచ్చిందాకానే" అన్నది.

"రాజాగారంటే గుర్తొచ్చింది. రాజేంద్ర ఎప్పుడొస్తాడమ్మా?" అన్నాడు ప్రసాదరావు.

ఆపేరు వినంగానే సువర్చల ముఖం సిగ్గుతో ఎర్రనైంది.

"వస్తాడు. ఇంకో నెలరోజుల్లో. ఫారిన్ వెళ్లినవాడుకదా? వచ్చాక ఏమంటాడో? ఈ పల్లెటూరిది నాకు వద్దంటాడో, పరవాలేదు చేసుకుంటానంటాడో?"

"హైద్రాబాదు మహానగరం పల్లెటూరా?"

"లండన్‌లోనూ, పారిస్‌లోనూ తిరిగినవాడిని అడిగితే అలాగే అంటాడు."

"రాజేంద్ర అలాంటివాడు కాదులెండి" అంటూ ఆమె ముఖంలోకి చూశాడు ప్రసాదరావు. ఆమె పెదిమలచివర వెలుగుతూన్న సన్నని నవ్వు ఆమె ఇందాక మాట్లాడిందంతా సువర్చలను ఉడికించటానికేనన్న సంగతి పట్టి యిచ్చింది.

"అంతేలే! అయినా అతన్ని రానీ! తీర్పుచేపి ఈవిడగారి తిక్క వొదలగొట్టిస్తాను"

"పోవోప్!" అంది సువర్చల కోపంగా.

సుశీలాదేవి ప్రసాదరావు కునస్ఫూర్తిగా నవ్వుకున్నారు.

ఆతరువాత మరికొంతసేపు మాట్లాడి రూముకి తిరిగి వచ్చాడు ప్రసాదరావు. అతనిలో సుశీలాదేవి మాటవల్ల రేకెత్తిన అనుమానం— సరస్వతిగురించి — తిరిగి రూ ప ం ధరించింది. సరస్వతి నిన్నటిరోజున అలా ఎందుకు

అన్నట్టు? ఆమెకు తన పరిచయం వాంఛనీయం కాదా? లేక తనకున్న ఆత్రుత ఆమెకు లేదా?

ప్రసాదరావులో ఒకరకమయిన పట్టుదల మొలకెత్తింది. అందులో సరస్వతిమీద కించిత్తుగా కలిగిన కోపపు పాలు కూడా వుంది. ఇంతటి స్వల్ప విషయానికి ఆమె అబద్ధం ఆడవలసిన అవసరం లేదు. ఎలాగయినా ఆమెను తిరిగి కలుసుకోవాలి. ఆమె ఆంతర్యం తెలుసుకోవాలి. కాని ఎలా?

ఎలాగో అతనికి తట్టలేదు. అయితేనేం? అతనికి ధైర్యం వున్నది. మాటలమధ్యలో ఆమె దొరికిపోదా?

రేపు!

అవును. రేపు రాంబాబు పుట్టినరోజు. ఆమె రాక తప్పదు. తానూ వెళతాడు.

* * *

సరస్వతి ఇంటికి తిరిగివొచ్చి స్నానంచేసి బట్టలు మార్చుకున్నది. రాంబాబుకోసం కొన్న బహుమతిని తీసుకుని బయటకువచ్చి తాళంవేసింది. మేడ మీదనుంచి అది గమనించిన యజమానురాలు "ఆలస్యంగా వస్తావామ్మా?" అన్నది.

"అవును పిన్నీ!"

"అయితే తిరిగిరాంగానే మేడమీదికి వచ్చెయ్యి. నీకోసం ఎదురుచూస్తుంటాము."

"అలాగే" అనేసి నవ్వుకుంటూ సరస్వతి వీధిలోకి వచ్చింది.

పావుగంటలో రిక్షా సూర్యారావుగారియింటి ముందు ఆగింది. కిరాయి చెల్లించి లోపలకు వచ్చిన సరస్వతి హాల్లో అతిథులంతా సమావేశమయి వుండటం గమనించింది. అవతలివారగా కూచుని వున్నాడు ప్రసాదరావు. ఆమెను చూడంగానే సువర్చల గబగబా వచ్చి "రండి మహారాణీగారూ! మీకోసం అరగంటనించీ ఎదురు చూస్తున్నాను" అన్నది లాక్కుపోతూ.

"అదేమిటి? నేను టైముకే వచ్చాముగా?" అన్నది సరస్వతి.

"నాకు అదేం తెలియదు. గత అరగంటలోనూ బావగారూ, ఈ ప్రసాదరావూ నీసంగతి కనీసం అయిదులక్షల సార్లయినా అనివుంటారు" అన్నది సువర్చల సహజధోరణిలో.

"ఎందుకట?" అన్నది సరస్వతి నవ్వుతూ.

"ఏమో! ఆయన్నే అడగండి. అయ్యా ప్రసాదయ్యా ఇలారా?" అన్నది సువర్చల.

ప్రసాదరావు వొచ్చాడు. సువర్చల వారిద్దరికీ పరిచయంచేయబోతూండగా వారించి "నాకు తెలుసులే!" అన్నది సరస్వతి.

"అయితే మాట్లాడుకుంటూ వుండండి. ఇప్పుడే వస్తాను" అంటూ, పిచికలా దూసుకుంది సువర్చల.

"మీరు నిన్న వస్తారనుకున్నాను" అన్నాడు ప్రసాదరావు ఆ తరువాత.

"సారీ! మొన్న ఈ సంగతి గుర్తులేక అలా అన్నాను. అంతకన్నా ఏంలేదు" అన్నది సరస్వతి.

"పోనీలెండి ..... శిష్యపరమాణువుకోసం ఏం తెచ్చారు?"

"అంత గొప్ప బహుమతికాదు. అయితే వాడికీ చాలమందికీ కూడా అవసరమయింది"

వివశువు

"చూడనివ్వరా?"

"దానికేం? చూడండి."

'పాకెట్' అందుకుని విప్పాడు ప్రసాదరావు. అందమయిన వాణీ విగ్రహం అది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ జీవాన్ని సంతరించుకుంది.

"సరస్వతి ఇంత అందంగా వుంటుందని నా కింతవరకూ తెలియదు సుమండీ" అన్నాడు ప్రసాదరావు బొమ్మవంక తదేకంగా చూస్తూ.

ఆమె తుళ్లిపడింది.

ప్రసాదరావు తలెత్తి, "నిజంగానే" అన్నాడు మొక్కవోని మందహాసంతో.

సరస్వతి నవ్వు తెచ్చుకుని, అతని చేతిలోంచి బొమ్మ అందుకుంది. పాకెట్ కట్టేసి, "లోపలకు వెళ్లొస్తాను ఒకసారి" అన్నది.

ప్రా:-ఏమోయ్, ఈ పిక్చరు యెన్నాళ్లాడినా లాభం లేనట్టుంది. పైగా చేతిది కూడా తగులుకొంటోంది. ఏం చేయడం?

స్నే:-దానికేముంది? రాబోయే సినిమాకి ముందుగా ఇప్పటినుంచీ "పెద్దలకు మాత్రమే. పిల్లలు, అవివాహితులు రాకూడదు." అని ప్రకటన వేయించెయ్. అంతే. దీనికి రెట్టింపు లాభం వచ్చేస్తుంది.

యనమండ్ర కృష్ణమూర్తి (విశాఖపట్నం)

"పదండి. నేనూ వస్తాను. ఈ పెద్దల్తో చిరాకుపుడుతోంది" అన్నాడు ప్రసాదరావు

ఇద్దరూ లోపలి గదిలోకి వచ్చారు. తల్లిని చుట్టేసుకుని మారాంచేస్తున్న రాంబాబు మాష్టరమ్మగార్ని చూడంగానే బుద్ధిమంతుడల్లే ఇవతలికొచ్చి, "నమస్తే" అన్నాడు. సరస్వతి ప్రేమగా వాడిని దగ్గరకు తీసుకుని, "నీకోసం మంచి బహుమతి తెచ్చాను బాబూ!" అన్నది.

"ఏది?" అన్నాడు వాడు ఆత్రంగా.

సరస్వతి పాకెట్ విప్పి, విగ్రహం వాడిచేతికిచ్చి, "చూశావా? చదువుల తల్లి బొమ్మ. రోజూ ఆమెకు దణ్ణంపెట్టి, శ్రద్ధగా చదువుకోవాలి" అన్నది.

"హా!" అని విగ్రహాన్ని అంతలేసి కళ్ళతో చూస్తూ, తల్లిదగ్గిరకు పరుగెత్తాడు వాడు. సుశీలాదేవి విగ్రహం అందుకుని, "అలా తీసుకుని పూరుకోవడమేనా? టీచరుగారికి నమస్కారం చెయ్యొద్దూ?" అన్నది మందలింపుగా. వాడు బిక్కమొహంపెట్టి, మరుక్షణాన పర్గుకుని సరస్వతి దగ్గరకొచ్చి, రెండుచేతులెత్తి నమస్కారంచేశాడు. సరస్వతి వాడిని దగ్గిరకు తీసుకుని, "అలా వుండాలి మంచి అబ్బాయంటే" అన్నది.

సువర్చల హడావుడిగా లోపలికి వచ్చి, "అక్కడ అంతా రెడీగావుంటే, మీ రిద్దరూ ఇక్కడ కబుర్లు చెబుతూ కూచున్నారా? పదండి" అని తల్లి చేతిలో బొమ్మచూసి, "ఇదెక్కడిదమ్మా?" అన్నది.

"సరస్వతి యిచ్చింది వాడికి."

సువర్చల హడావుడి ఎగిరి చక్కాపోయింది. "చాలా అందంగా వుంది. ఎక్కడ కొన్నారు?" అన్నది సంబరంగా.

"చూడు సువర్చలా! అది దేవత విగ్రహం. అందులో చూడాల్సింది పవిత్రతగాని, అందం కాదు. అందం సంగతి అనవసరం కూడా" అన్నది సరస్వతి.

సువర్చల ఒక్కక్షణం ఆమె వంకా, యితరుల వంకా అయోమయంగా చూసి, "ఏమిటోలే" అని, "పదండి పోదాం" అన్నది బొమ్మ తల్లికిచ్చేస్తూ. ముగ్గురూ రాంబాబుతో సహా హాల్లోకి వచ్చారు.

టీ పార్టీ ఆ తరువాత కబుర్లపార్టీ అయ్యేసరికి ఏడు దాటింది. సరస్వతి ఆ కుటుంబం దగ్గర సెలవు తీసుకుని ఇంటికని బయలు దేరింది. రోడ్డుమీదికి వచ్చేసరికి ప్రసాదరావు కనబడ్డాడు.

"మీరింకా వెళ్ళలేదూ?" అన్నదామె నవ్వు ముఖంతో.

లేదు. నాకూ కాస్త సుల్తాన్‌బజార్‌తో పనుంది. కలిసి వెళ్ళొచ్చు కదాని ఆగాను" అన్నాడు ప్రసాదరావు.

ఇద్దరూ కొంతదూరం మౌనంగా నడిచారు.

"మీకు నామీద కాస్త కోపం వచ్చి వుంటుంది" అన్నది సరస్వతి.

"నాకా? దేనికి?"

"మొన్న అబద్ధం చెప్పానని"

"పొరపాటున అన్నా నన్నారుగా?"

"నమ్మారన్నమాట?"

"నమ్మక?"

"అదికాదులెండి. నేను మరోలా అనుకున్నాను."

రెండు చౌరస్తాలు దాటాక దీపక్‌మహల్ వచ్చింది. అది దాటి ఒక అర ఫర్లాంగు నడిచాక, "ఆ కనపడేసందులోనే మా యిల్లు" అన్నది సరస్వతి.

"అలాగా?"

"మా ఇంటి యజమానురాలు చాలా మంచిది లెండి. పేరుకు తగ్గట్టు అన్నపూర్ణమ్మే. వారానికి కనీసం మూడురోజులయినా ఆమె చేతి వంట తినక తప్పదు. ఏమాత్రం ఆలస్యమయినా నన్ను పొయ్యి వెలిగించనివ్వదు."

"అదృష్టవంతులు. మా యింటి యజమానురాలు అందుకు పూర్తిగా వ్యతిరేకం"

"తాను ఆలస్యంగావచ్చి మిమ్మల్ని వంటచెయ్యమంటుందా?"

మనస్ఫూర్తిగా నవ్వేశాడు ప్రసాదరావు. ఆ తరువాత "మరీ అంత ఘోరంకాదులెండి గాని— మొదటి ఆట సినిమాకు వెళ్లానంటే ఆ రోజున

కొంపలోకొచ్చి పిల్లలూ, పెద్దలూ కాపురాల్లాగు తిన్నాయన్నమాటే?" అన్నాడు.

"ఇల్లెక్కింది. పెంకా మరి?" అన్నది సరస్వతి.

"వస్తాను"

సరస్వతి ఇంట్లోకి వచ్చింది. అన్నపూర్ణమ్మగారి అప్యాయతా పూరితమయిన భోజనం వేళకు తనవాటాలోకి వచ్చింది. బట్టలు మార్చుకుని పుస్తకం అందుకుని మంచంమీద వాలింది. పేజీలు తిప్పుతున్నా, మనసు దానిపై లగ్నం కాకుండా పోసాగింది.

అతను......అతనే గుర్తుకు రాసాగాడు.

సరస్వతి గుండెలు గుబ గుబ లాడాయి. ప్రసాదరావుతో సాన్నిహిత్యం రెండు రోజుల క్రితం కలిగింది. అందువల్లనే నేమో అంతకుపూర్వం జరగనివిధంగా ఈనాడు అతన్ని గురించిన ఆలోచనలు ఈనాడు ముసురుకుంటున్నాయి. ఏదో అర్థంకాని కారణం తనను అతనికి దూరంగా వుండమని చెబుతోంది. అతని అమాయకత్వంమీద, మంచితనంమీద, తెలివి తేటలమీద, సంస్కారం మీద తనకు దురభిప్రాయాలేమీ లేవు. అయినా అలా అనిపిస్తోంది మరి!

ఏమయినా ప్రసాదరావు స్నేహం తనకు తప్పదు. దిక్కూ, మొక్కూ లేకుండా ఈ మహానగరానికి వచ్చిపడినవేళ కేవలం అభిమానంతో, దయతో ఆగంతకురాలయిన తనను చారదీసి, ఆదరించినవాడు సూర్యారావుగారు. ఆయనకు, ఆయన కుటుంబానికీ అత్యంత సన్నిహితుడు అతను. సువర్చలకూ, సుశీలాదేవికి అతడంటే వల్లమాలిన అభిమానం. అందువలన అతని స్నేహం వదిలించుకోవటం తనకు తేలికకాదు. ఒకవేళ అలాంటి ప్రయత్నమే తాను చేస్తే అవాంఛనీయమయిన పరిణామాలు కలుగగల ప్రమాదం వుంది. తాను చేయ గలిగిందీ చేయవలసిందీ ఒకటే. తన లక్ష్యాన్ని, పరిధినీ విస్మరించకుండా ఈ స్నేహాన్ని కొనసాగించటమే.

ఆలోచనల్తో అలిసిపోయివున్న తరుణంలో సరస్వతికి బయటనుంచి యజమానురాలి కేక వినిపించింది. "మేడమీదికి వెళ్తున్నాను. రా!" అని. ఆ ఇంట్లో అన్ని కాపరాలవాళ్లూ రెండవ అంతస్తు పయినవున్న డాబాలో పడుకుంటారు. సరస్వతి పక్క తీసుకుని అక్కడకు వెళ్ళింది.

* * *

వారం రోజులు గడిచాయి. ఈ వారం రోజుల్లోనూ ఏ రెండుసార్లో కలుసుకున్నాడు ప్రసాదరావు సరస్వతిని. ఆ రెండు సార్లూ సరస్వతి మామూలుగా నవ్వుతూనే మాట్లాడింది. కొత్త రకమయిన అనుభవంగా తయారయిందిది ప్రసాదరావుకి.

అవును మరి!

ప్రసాదరావుకి కథలూ, నవలలూ చదివే పిచ్చి వున్నా, వాటితాలూకు నీడలు జీవితంలో చూసుకోగల తెలివితేటలు, ఊహ లేవు. ఆమాట కొస్తే ఇష్టం కూడా లేదేమో? అదే వుండివుంటే, అతనికి చాలా ఆనందకరమయిన, ఆశించదగిన అంశం గోచరించేది.

అయితే అంతకుమించి ప్రసాదరావు మనసుని ఆక్రమించుకున్న సన్నివేశం మరొకటి వుంది. అది ఆనాటి సరస్వతివిగ్రహ విమర్శ. ఆనాడు తాను అన్నది కేవలం అనాలోచితం. అనుద్దేశపూరితం. అయితే సరస్వతి వేరుగా భావించుకున్నదనీ అందు కామె కోపగించుకున్నదనీ కూడా అతడు గ్రహించాడు. అందువల్ల ఆ అపోహను తొలగించవలసిన బాధ్యత తనమీద వున్నది. కాని ఎలా?

ఆనాడు ప్రసాదరావు తిరిగి సూర్యారావుగారి యింటికి వెళ్లాడు. డాబామీద కూకుని ఒంటరిగా ఏదో చదువుకుంటోంది సువర్చల. ప్రసాదరావుని చూడంగానే "రండి మాష్టారూ! అలా షేక్స్పియర్ మొహం వేశారేం?" అన్నది పరిహాసంగా. అతను నవ్వి కూచున్నాడు.

ఒక్కక్షణం ఆగి, "చాలా రోజుల్నించి చూస్తున్నాను. ఎందుకలా దిగాలుగా వుంటున్నావు ప్రసాదం?" అన్నది సువర్చల ఆర్ద్రంగా.

"లేదే?" అన్నాడు ప్రసాదరావు అమాయకంగా.

పట్టణాన్ని చూడాలన్న కోరికతో వచ్చిన ఒక పల్లెటూరి ఆసామీ ఒక టాక్సీలో కూర్చున్నాడు. డ్రైవర స్తప్పుడప్పుడూ చేయి బయటపెట్టి సైడు చూపెడుతుండటం గమనించిన ఆసామీ, డ్రైవరుతో యిలా అన్నాడు:

"ఇదిగో చూడు! నీ చేయి లోపలనే పెట్టుకో! వర్షమొస్తే నేను చెప్తానులే!"

మాదన నిత్యానందము (పుదిపట్ల)

"అబద్ధాలాడకు.......ఎవరితోనయినా తగాదా పడ్డావా?"

అతను నిట్టూర్చి, "అదేకాదుగాని, అటువంటిదే" అన్నాడు శుష్కహాసంతో.

"ఏమిటో?"

ప్రసాదరావు జవాబు చెప్పలేదు.

"రహస్యమా? చెప్పకూడదా?"

"సమయం వచ్చినప్పుడు చెబుతానుగాని...... మీ సరస్వతిగా రివాళ రాలేదల్లేవుందే?"

"ట్యూషనువేళ పొద్దున్నకి మార్చుకుం దావిడ"

"ఎందుకని?"

"ఏమో?"

ప్రసాదరావు తరువాత ప్రశ్న వెయ్యటానికి కొంత వ్యవధి తీసుకున్నాడు. ఆ తరువాత "ఒక్క సంగతి అడుగుతాను చెబుతావా సువర్చలా?" అన్నాడు.

"అడుగు" అందామె చిత్రంగా ఫీలయి.

"సరస్వతిదేవిని గురించి నీ అభిప్రాయం ఏమిటి? కథనం ఏది?"

"ఎందుకు?"

"నే నడిగింది జవాబు"

"చాలా మంచిది. ఏ విషయమూ అతిగా పట్టించుకోదు. సాధ్యమయినంతవరకూ అందరికీ అన్నింటికీ దూరంగా ఉంటుంది."

"ఏవూరో?"

"గుంటూరని కాబోలు చెప్పింది"

"తల్లీ దండ్రీ వున్నారా?"

"ఉన్నారనుకుంటాను"

"నీకు తెలియదా?"

"నేను ఆ వివరాలేమీ అడగలేదు ప్రసాదం! నాన్నగారికి అలాంటివి కిట్టవని నీకూ తెలుసుగా? రాంబాబుమూలాన యాదృచ్ఛికంగా గార్డెన్సులో కలిసింది. నాన్నగారు జాలి పడ్డారు. చేర దీశారు. ఆ తరువాత ఆ ఉద్యోగమూ రాంబాబుకి ట్యూషనూ కుదిర్చారు. తదుపరి ఆమె గతజీవితాన్ని గురించి అడగవలసిన అవసరం కనపడలేదు. నాకు తెలిసినంతవరకూ ఆమె మనసులో ఏదో బాధ గూడు కట్టుకువుందని, అందుకే అందరికీ దూరంగా వుండాలని చూస్తోందనీ అనిపిస్తోంది. అయితే అది బయటపడనిచ్చేటంత బేలకూడా కాదు ఆమె. పయిగా ఆమె కించిత్ గర్విష్టి కూడా అని నా అనుమానం. అందుమూలాన ఎంత 'క్లోజ్'గా మాట్లాడుకున్నా ఆమెగతం తెలుసుకోవాలనే ఆసక్తి కలగలేదు. కలిగినా అంతరించిపోయింది. అయినా నీ కెందుకు ఈ వివరాలన్నీ?"

"కాలక్షేపానికి" అన్నా డతను తేలిగ్గా నవ్వెయ్యడానికి ప్రయత్నిస్తూ.

సువర్చల అతడివంక సూటిగా చూసి "నువ్వు ఏదో దాస్తున్నావ్ కదూ?" అన్నది.

"నేనా?" అన్నా డతను కంగారును సాధ్యమయినంతవరకూ అణుచుకుని.

"ఊఁ!.......సరస్వతి నీతో పోట్లాడిందా?"

"నాతోనా? ఎందుకు పోట్లాడుతుంది?"

సువర్చల చిరునవ్వుతో "చూడు ప్రసాదం! ఇలాంటి విషయాలు మనసులో దాచుకుని కుమిలి పోవడంవల్ల ప్రయోజనంలేదు. వుండదు. మొగవాడివి. సంపాయించుకుంటున్నవాడివి. నీకే ఇంత బెరుకయితే ఎలా? అసలయినా ఎందుకు భయపడాలి? నీ కోరికలో అనుచితమయిందేమీ లేదే?"

"కోరికా?"

"అమాయకత్వం నటించకు. నువ్వు సరస్వతిని ప్రేమించడంలేదూ?"

నిర్ఘాంతపోయాడు ప్రసాదరావు. కొన్ని క్షణాల తరువాత క్రమంగా అతని మనసులోకి చైతన్యం రాసాగింది. ఆ చైతన్యంతోటే గత కొన్ని దినాలుగా అతనిలో అల్లిబిల్లిగా అల్లుకుపోయిన ప్రశ్నల, సందేహాల తాలూకు పరిపూర్ణరూపం దృగ్గోచరమవసాగింది. అవును! తన మనసులో వున్నది ఆమెయందు ప్రేమే. అది మరేదో అనుకుని తా నిన్నాళ్లూ ఆత్మవంచన చేసుకున్నాడు. ఈనాడు ఆ తెర తొలగిపోయింది. నిజరూపం బోధపడింది.

వివశువు

"అయితే......అయితే....." అన్నాడతను అయోమయంగా.

"చెప్పు"

"నువ్వీ విషయంలో నాకు సహాయం చేస్తావా సువర్చలా?"

"నన్ను అడిగిపెట్టమంటావా?"

"ఊఁ"

"నీకు భయమా?"

"ఛఛ్"

పకపక నవ్వింది సువర్చల. "పోనీగాని మరి మీ నాన్నగారు వగయిరాలు కట్నాలు కానుకలు కావా లంటారేమో? నువ్వు ఎమ్మెస్సీవాయను" అన్నది.

"ఆ దిగులేమీ అక్కర్లేదు. కులమూ, గోత్రమూ వున్న అమ్మాయి అయితే నేను ఎలా చేసుకున్నా వాళ్లకి అభ్యంతరంలేదు."

"అవి వున్నాయిలే!"

ఆ తరువాత ప్రసాదరావు కాసేపు సుశీలాదేవి తోటీ, రాంబాబుతోటీ 'హస్కు' కొట్టి ఇంటికి జేరుకున్నాడు. ఆ రాత్రంతా అతనికి అదే ఆలోచన. సువర్ణశలాకలా వుండే సరస్వతి అతనిలో నిండి పోయింది. ఆ గుండ్రని ముఖమూ, పల్చటి పెదవులూ, కొనదేలిన నాసికా, గాలికి అలనల్లన ఎగిరి నుదుటిపై పడే ఆ పట్టుకుచ్చుల్లాంటి శిరోజాలూ, అన్నింటికన్నా మించి, పరిశుద్ధమయిన గౌరవనీయమయిన మనసూ తనని కాబోతున్నాయి. ఆమె సదా ధరించే తెల్లటి చీరే, నల్లటి రవికా తన జీవితాన్ని వెలుగుతో, కవిత్వంతో నింపేస్తాయి.

మరునాడు పొద్దున్న ప్రసాదరావు ఆఫీసుకి బయలుదేరబోతూండగా పోస్టుమాన్ ఉత్తరం తెచ్చి యిచ్చాడు. ప్రసాదరావు తండ్రి రాసిందది. "అవసరమయిన పనివుందిగనక వెంటనే బయలు దేరి రావలసిందని" దాని సారాంశం. ప్రసాదరావు నవ్వుకున్నాడు. ఈ పెద్దవాళ్ళకి ఒక వయసు రాంగానే చాదస్తం ఎక్కువవుతుంది. ఇంతాచేసి విజయవాడ వెళితే ఏ వెంకాయమ్మగారి అప్పలనరసమ్మనో చూసి రమ్మంటారు. అయినా తప్పించుకునేందుకు వీలులేదు. ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి కూడా. సరస్వతి సంగతి......

అలా అనుకుంటూనే ఆఫీసుకి జేరుకున్నాడు ప్రసాదరావు. ఆరోజు చాంద్రాయణం అవసరం లేదనీ, సేకరించబడినవాటి సంగతి చూడమనీ సెలవిచ్చాడు సూపర్నెంటు. ప్రసాదరావు తన కుర్చీలో కూలబడి ఆ లెక్కలు చూడసాగేడు.

రెండుగంటలు గడిచాయి. ఆఫీసు ప్యూను వచ్చి, మెల్లగా "మీకోసం ఎవరో వచ్చారు సార్" అన్నాడు వినయంగా. ప్రసాదరావు లేచి బయటికి వొచ్చాడు. బయట ఆరుఅడుగుల ఎత్తుగా, ఠీవిగా నిలబడివున్న వ్యక్తిని చూసి, ఆశ్చర్యానందాల్లో ఉక్కిరి బిక్కిరయిపోయాడు. అమాంతం కౌగిలించుకుని లాన్‌లోకి తీసుకువస్తూ, "ఏమిట్రా ఇలా అవతరించావు ఉరమని పిడుగల్లే?" అన్నాడు.

"రచయితలం కాదుటోయ్! ఉత్కంఠ అద్భుత లోకం మా ఆహారాలు" అన్నాడు మధుమూర్తి నవ్వుతూ.

"అయినా వచ్చేముందు ఉత్తరం రాయకూడదూ? నీ అదృష్టం బావుందిగనక ఆఫీసులో వున్నాను. లేకపోతే. . . ."

"వెళ్ళినచోటుకే వచ్చేవాడ్ని. భాగ్యనగరం మరీ అంత కొత్త కాదులే"

"బుద్ధి బుద్ధి! నీ సంగతి మర్చిపోయి వాదనలోకి దిగాను. క్షమన్సు" అన్నాడు ప్రసాదరావు కొంటెతనంగా.

ఆతరువాత కుశలప్రశ్నాదికాలూ వగయిరా ఒక అరగంటసేపు సాగినాయి. ఆ అరగంటలోనే మధుమూర్తి ఈ భాగ్యనగరం ఉద్యోగం చేయడానికి వచ్చానని చెప్పటంతో తుళ్ళిపడ్డాడు ప్రసాదరావు

"నువ్వు ......నువ్వు ఉద్యోగం చేస్తావా?"

"ఏం? తగనా?"

"అది కాదురా! అసలే కళా పిపాసివి. అందులో రచయితవి. పయిగా కాస్త కూస్త వెనకాల వున్నవాడివి. ఈ వూరువచ్చి ఉద్యోగం చేయాల్సి ఖర్మేం నీకు?"

"ఖర్మకాదురా భాయ్! అవసరం"

"అంటే?"

"కొంతకాలంపాటు ఎక్కడయినా ఉద్యోగం చేస్తేగాని విశాలదృక్పథం అలవడదనిపించింది. అవును భాయ్! ఎన్నాళ్ళని ఇంటో కూచుని కలగలుపు రచనలు చేస్తాను? చుట్టూవున్న రకరకాల మనుషుల్నీ, పరిసరాల్నీ చూస్తేతప్ప నిజాయితీగల రచనలు చేయలేననిపించింది. అదృష్టవశాత్తు ఈ ఊళ్ళో ఉద్యోగం వచ్చింది. వచ్చేశాను."

"విలాసంగా ఉద్యోగం చెయ్యడానికి వచ్చావన్న మాట?"

"అహ! తపస్సుచెయ్యడానికి వచ్చాను" అన్నాడు మధుమూర్తి వళ్ళుమండి.

'ఇంతలో ఆఫీసు ప్యూన్ వచ్చి అయ్యగారు పిలుస్తున్నారని చెప్పడంతో ప్రసాదరావు మిత్రుడ్ని కూచోమని లోపలకు వెళ్ళాడు. ఆఫీసరుగారు అతడిని చూడంగానే "షికార్లు కొడుతున్నావేమిటోయ్?" అన్నాడు.

"మిత్రుడు వచ్చాడు సార్! .....తరువాత మా నాన్నగారు ఉత్తరంకూడా రాశారు. ఓ వారం రోజులుపాటు సెలవు కావాలి" అన్నా డతను జవాబుగా.

ఆఫీసరు సర్దుకుని, "చూడు ప్రసాదరావ్! నువ్వు ఉద్యోగంలోజేరి ఆరు నెలలు కాలేదు. ఇలా చీటికి మాటికీ సెలవులంటే ఎలా? ఉద్యోగం ఇంకా పర్మినెంటు కూడా కాలేదు" అన్నాడు మందలింపుగా. ప్రసాదరావు తన సహజ ధోరణిలో "ఉద్యోగం ఏమిటిసార్! మన జీవితాలే పర్మినెంట్ కాదు" అన్నాడు నవ్వుతూ.

ఆఫీసరుకి అతని ధోరణి కొత్తకాదు. అంత అమాయకంగా నిష్కల్మషంగా మాట్లాడుతాడు కాబట్టే అతనంటే ఆయనకు చాలా యిష్టం. అందుకే నవ్వుకుని, "అంత అవసరమయితే వెళ్ళు" అని తన పనిలో మునిగిపోయాడు.

ప్రసాదరావు సెలవుచీటీ వ్రాసి యిచ్చి బయటకువొచ్చి వాహనం తీసుకుని మిత్రుడితో సహా రోడ్డుమీదికి వచ్చాడు. కాళ్ళు నెప్పులు పుట్టేంతవరకూ నడిచి, నోరు నెప్పిపుట్టేందాకా వాగాక హిమాయత్‌నగర్ వచ్చింది. మధుమూర్తి స్నానం చేయటానికి ఏర్పాట్లుచేసి, ప్రసాదరావు పడక కుర్చీలో మేనువాల్చాడు.

పది నిముషాల తరువాత ఈలవేసుకుంటూ వచ్చిన మధుమూర్తి మిత్రుడి గాఢ నిద్ర చూసి నవ్వుకుని తన సంచిలోంచి దుప్పటితీసి పరుచుకుని పడుకున్నాడు.

మెలకువ వచ్చేసరికి నాలుగు దాటింది.

నిద్రలో ఓతమాషా అయిన శక్తి వుంది. ఎంతటి గంభీరమయిన విషయమయినా, ఎంతటి సంతోష కరమయిన సంగతి అయినా నిద్రపోయి లేచిన మనిషిమీద తన ప్రభావం కోల్పోతుంది. అంతే గాక, మరో విషయం పాదుకునేలా చేస్తుంది.

ప్రసాదరావుసంగతి అంతే అయింది. అతనికి మధుమూర్తి అంటే అనురాగమే కాక గౌరవం కూడా. అతడు రచయిత. అందులో స్త్రీ పాత్రలు అద్భుతంగా, అతి సహజంగా పోషిస్తాడని పేరు తెచ్చుకున్నవాడు. గనుక అతనికి స్త్రీలసంగతి బాగా తెలిసివుండాలి. తనజీవితంలోకి ప్రవేశించి తన మనసుతో చెలగాటం ఆడుతూన్న ఆ స్త్రీ సంగతి ఇతన్నడిగి తెలుసుకుంటే?......

ఇద్దరూ స్నానాదికాలు ముగించి రోడ్‌మీదికి వచ్చారు. దోవలో ప్రసాదరావు అన్నాడు: "రాత్రికి ఊరు వెళుతున్నాను భాయ్!" అని.

"చంపావు! తోచక చచ్చిపోవాల్సిందే?"

ప్రసాదరావుకి చటుక్కున ఓ ఊహ తట్టింది. "నీకు చాలా విచిత్రమయిన ఒక వ్యక్తిని పరిచయం చేసి వెళతానులే" అన్నాడు.

"ఎవరా వ్యక్తి?"

"ఒక స్త్రీ"

"ఎవరూ?"

"అంత ఆశ్చర్యపో నవసరంలేదు. ఆమె పేరు సరస్వతి. బాగా పరిచయుస్తురాలు."

"ఎక్కడుంటుంది?"

"సుల్తాన్‌బజారు! మా సూర్యారావుగారి కొడుక్కి ట్యూషన్ చెబుతుంది"

"ఏమిటావిడ ప్రత్యేకత?"

"చాలా క్లిష్టమయిన వ్యక్తి. పొరపాటును వెంటనే ఖండిస్తుంది. అయితే ఆ తరువాత ఆ సంగతి గుర్తుంచుకోదు. ఎంత నవ్వుతూ మాట్లాడినా హృదయం విప్పి చెప్పదు ఏ విషయమూ. స్నేహమేగాని ఆత్మీయత కోరదు. కోర నివ్వదు"

"అయితే ఆమెను చూడవలసిందే"

"తప్పకుండా. ఆవిడకి నీ పుస్తకాలంటే ప్రాణం కూడా."

టాజ్ లో కాఫీ తాగి బయటకు వొచ్చాక, "ఆమె విలాంటిదో నే వచ్చేలోగా కనిపెట్టి చెప్పాలి" అన్నాడు ప్రసాదరావు.

"ముందు పరిచయం కానివ్వవోయ్ భగవాన్లూ"

ఇద్దరూ సరస్వతి యిల్లు జేరారు. ఆమె వాటా తలుపు వారగా వేసివుంది. ప్రసాదరావు తలుపు తట్టాడు. "ఎవరూ?" అన్న పిలుపూ, సరస్వతి రాకా క్షణాల తేడాలో జరిగాయి వారిద్దర్నీ చూసి, "రండి, రండి" అన్నది సరస్వతి.

కూచున్నాక, "ఇవాళ ఆఫీసుకు వెళ్ళలేదా?" అన్నాడు ప్రసాదరావు.

"వెళ్ళానే? ఏం?"

"తొందరగానే వొచ్చారే?"

"మామూలు వేళే"

ప్రసాదరావు మరేదో అనబోతుండగా బయటి నుంచి యజమానురాలికేక వినిపించింది. "ఇప్పుడే వొస్తాను" అంటూ బయటికి వెళ్ళింది సరస్వతి.

"చూశావుగా?" అన్నాడు ప్రసాదరావు.

"చూశాను.....అవునుగాని ఈ ఇంట్లో ఉండటానికి గదులేమయినా దొరుకుతాయా?" అన్నాడు మధుమూర్తి.

"ఎందుకు?"

సరికొత్త
శీర్షిక
63వ పేజీలో

"తీసుకుంటాను"

"నా రూములో వుండటం నామోషీయా?"

"ఏడవకురా! నా సంగతినీకు తెలుసుగదా? వొంటికంటి రామలింగంగాడ్ని. మీరూమూ వో చిన్నసైజు మార్కెట్! అయినా అన్ని వేలమంది వుంటారేంరా ఆ కొంపలో?"

"నా రూములో కాదుగా?"

"అయినానూ! ఆ జనతా హవుస్‌లో ఏకాంతమూ, నిశ్శబ్దమూ వుండవురా భాయ్!"

"సరే నీ యిష్టం!" అన్నాడు ప్రసాదరావు.

సరస్వతి లోపలికి వచ్చింది. తనను రెప్ప వేయకుండా చూస్తున్న ప్రసాదరావు మిత్రుడ్ని క్రీగంట గమనిస్తూ, "ఏమిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" అన్నది. ప్రసాదరావు ఆలస్యం చెయ్యకుండా, "వాడికి రూము కావాలిట" అన్నాడు.

"ఏమండీ?" అన్నది సరస్వతి ప్రశ్నార్థకంగా,

"అవునండీ" అన్నాడు మధుమూర్తి.

"అయితే ఒక పని చెయ్యండి. ఒకటో రెండో రోజులు ప్రసాదరావుగారి రూములో సర్దుకోండి. ఈలోగా ఆ ఎదురుభాగం ఖాళీ అవుతుంది. చేరుదురు గాని"

"అంతకన్నానా?"

ఒక్కక్షణం మౌనంగా గడిచింది.

"ట్యూషన్‌వేళ మార్చుకున్నార్టగా?"

"అవునండీ! సాయంత్రాలుపూట కాస్త చల్లగాలి పీల్చుకోకుండా చదువు చెప్పాల్సి రావటం విసుగనిపించింది"

"బావుంది"

"అది సరేగానీండి. . . . మీ మిత్రుల్ని పరిచయం చెయ్యలేదే?"

ప్రసాదరావు నాలిక కొరుక్కుని, నవ్వి, "ఇతనా? ఎవరో చెప్పుకోండి?" అన్నాడు.

"ఇది మరీ బావుంది" అన్నది సరస్వతి నవ్వుతూ.

"అయితే కానుకోండి! ఇతను నా ఆప్తమిత్రుడూ మీ అభిమానరచయితా అయిన మిస్టర్ కె. మధుమూర్తి......అదీ సంగతి"

"నమస్కారమండీ"

"నమస్కారం."

ఆసమయాన సరస్వతి కళ్ళలోకి ప్రవేశించిన మెరుపు పసిగట్టాడు ప్రసాదరావు. అతనికి నవ్వొచ్చింది. అంతేమరి! తమ మానసంలో ఉన్నతులుగా, గౌరవనీయులుగా నిలుపుకున్న వ్యక్తులు సాక్షాత్కరిస్తే ఆ మనసు ఆనందంతో ఉబ్బిపోతుంది. ఆ ఆనందంలో గర్వమూ, ఆర్ద్రతాకూడా కలిసి వుంటాయి.

ఆతరువాత ఒక అరగంటసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాక ఇంటికి బయలుదేరారు ప్రసాదరావు, మధుమూర్తి. సరస్వతితోకూడా చెప్పాడు ప్రసాదరావు తాను విజయవాడ వెళ్తున్నానని. "విష్ యు లక్" అన్న దామె నవ్వుతూ.

మిత్రు లిద్దరూ నమస్కారంచేసి రోడ్డుమీదికి వొచ్చారు. భోజనం హోటల్లో ముగించుకుని ప్రయాణానికి—ప్రసాదరావుకి— అవసరమయిన బట్టలూ అవీ తీసుకుని స్టేషనుకి వచ్చారు. రైలు రెడీగావుంది. ఎక్కి కూచున్నాక, "అయితే నువ్వు నా రూమ్‌లో వుండవన్నమాటేగా?" అన్నాడు ప్రసాదరావు. అప్పటికి గ్రహించాడు మధుమూర్తి తాను వేరే వుంటాననటం అతనికి నచ్చలేదనీ, అందుకనే ఇందాకటినుంచీ మౌనంగా వున్నాడనీ. "దాన్ని గురించే ఆలోచించకురాభాయ్! హాయిగా వెళ్ళిరా! ఎక్కడున్నా మన మనసులు ఐకటేగా?" అంటూండగా రైలు కూతవేసింది.

"ఉంటాను" అన్నాడు మధుమూర్తి మిత్రుడి భుజంమీద చరిచి.

"అలాగే!. . . .నేను చెప్పిన సంగతి మర్చిపోవుగా?"

"ఊహు"

రైలు కదిలింది. ప్రసాదరావు మిత్రుడు కనపడినంతవరకూ ప్లాట్‌ఫారం మీదకు చూసి, ఆ తరువాత లోపలికి తిరిగాడు. అప్రయత్నంగా నిట్టూర్చాడు. (సశేషం)

మనమూ — మనరాష్ట్రం


(7 వ పేజీ తరువాయి)

ఈ అనవసర ప్రయాస ఎదురవుతోంది. ప్రసిద్ధులైన ఇంజనీర్లు తయారుచేసిన లెక్కలు తప్పు అని తేల్చాలంటే, అందరూ అంగీకరించిన నిర్వచనాలను సైతం మార్చి, అంకెలు తారుమారు చేసి, తమ వాదానికి ప్రోద్బలంగా ఉంటే సరికొత్త నిర్వచనాలను, అంకెలను సృష్టించాల్సి ఉంటుంది. కనుక, ఆలస్యమవక తప్పదు. అందుకే మరొక రెండు మూడు నెలలు గడువు కావాలని గుల్హాతీ సంఘం కోరినట్లు అనుమానించవలసి వస్తోంది.

కారణ మేదైనా గుల్హాతీ సంఘం నివేదిక ఎన్నికలయ్యేదాకా అందదు అన్న వార్త, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి పెద్ద బరువు దింపినట్లయింది. ఎన్నికలలో కేంద్ర ప్రభుత్వాన్ని, ఆ ప్రభుత్వాన్ని నడిపే కాంగ్రెసు నాయకులను ప్రజలముందు విమర్శించాల్సివచ్చే చికాకు పరిస్థితి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు తప్పింది. తలవనితలంపుగా గుల్హాతీ సంఘం చేసిన ఈ మహోపకారానికి, కాంగ్రెస్‌వారు ఎంత హర్షిస్తారో, ప్రతిపక్షాలలో కొన్ని అంత కుమిలిపోవడం సహజం. గుల్హాతీ సంఘం పక్షపాత వైఖరి బయటపడింది గనుక, దానికి తగ్గట్టుగా ఉండే నివేదిక కూడా బయటపడితే, ఎన్నికలలో కాంగ్రెస్‌ను దెబ్బకొట్టి నాలుగు సీట్లు సంపాదించుకోగలమనుకున్నవారి ఆశ నిరాశయింది. గుల్హాతీసంఘం, రాష్ట్రాల మధ్యనే గాక, రాజకీయ పక్షాల మధ్య కూడా పక్షపాతం చూపిందని, దీని కంతకూ కేంద్రప్రభుత్వప్రోద్బలం ఉండి ఉంటుందని ఈ ప్రతిపక్షాలు కొత్త ప్రచారం ప్రారంభించినా వింత ఏమీ లేదు.

అయితే ఎన్నికలలో నదీజలాల సమస్య కొత్తగా రాదని కాదు, వస్తుంది. వచ్చినా గుల్హాతీ నివేదిక అందిఉన్నట్లయితే ఉండేటంత జోరుగా ఉండదు. ఇప్పుడు ఏదోవిధంగా లభించిన ఈ రెండు, మూడు నెలల వ్యవధిని సద్వినియోగం చేసుకుని, కేంద్రము, రాష్ట్ర ప్రభుత్వాలు తాపీగా ఆలోచించి, గుల్హాతీ నివేదికతో నిమిత్తం లేకుండా ఈ వివాదాన్ని సమరసంగా పరిష్కరించేందుకు మరో గట్టి ప్రయత్నం చేస్తాయా ? అంటే ఆదేమీ ఉండదు. అంతా ఎన్నికల గొడవలో పడి ఈ సంగతి పూర్తిగా మర్చిపోవచ్చు. అదీ ఒకందుకు మంచిదే. ఎన్నికల అనంతరం కొత్త నాయకులతో కొత్త ప్రభుత్వాలు ఏర్పడి, కొత్త తరహాలో ఈ సమస్యను ఆలోచించడానికి వీలు చిక్కుతుంది. ఇంతవరకు ఈ వివాదంలో మన వాదం ఎవరి చెవికీ ఎక్కకపోవడానికి ముఖ్య కారణం, వాదంలో గల లోపం కాదు, నాయకత్వంలో బలం లోపించడమే. కామరాజ్, చవాన్, బి. సి. రాయ్ లాంటి ఏకైక నాయకులు మనకు లేకపోవడంవల్ల, ఉన్నచోటా నాయకులు కూడా అంతఃకలహాలతో సతమత మవుతూ ఉండటంవల్ల, కేంద్రంలో గౌరవాదరాలు శూన్యమైనాయి. ★

గళ్లనుడికట్టు- 81




అడ్డం

1. తెలికవని ఒకసారి మాత్రమే !
3. ఇద్దరు పుష్పి అంటే యజ్ఞముకాని, కోరిక కాని వెదకండి.
4. ద్వేషము.
6. కనుక తీరము కనుక్కోవాలి !
8. తిరగేస్తే కొత్త కాదు !
10 ఇప్పటికిగాని మధూకమంటే తెలిలేదా ?
12. తండ్రి.
14. సాధువా ? పద్యంలోనిదా ?
16. మన్ను, నగం మారిస్తే వాలు.
17. త్రిభుజములో చేయి.
18 అటునుంచి తినవచ్చు. కష్టమునకు పనికివస్తే జాగ్రత్తగా చూడండి.
20. చలించి.
21. బలం !
22. ఆరోహణలో మూడు.
23. రహస్యం.
24. వాటికదే కాని ఇంద్లవరున ఏది ?
25. కపోలము.
26. అనుదినం బిడియపడే వారితో విఘ్నభక్తుడు.
28. నా శబ్దమునకు ప్రథమైకవచనం !
29. అన్నియు దీనికొరకే నంటారు.
30. మునుపు, అందులోనే.
32 ఇదేనా, '—ఇదం జగత్' అనే సామెత పుట్టించింది ?
34. కటారి !
35. తిరిగి తిరిగి ఆటకోసం చూడండి !
37. దీనికి దొంగలున్నారు !
38. 36 విలువు కూడా ఇదే, తిరగబడింది!
40. కాలితే పడేది.
41. దారము.

నిలువు

2. రెండుసార్లయితే నవ్వును సూచించేది.
3. ఇరకాటంగా ఉందే—కల్లా, నీరూ ఒకటేనా?
5. సిగతరిగినదాంట్లో తెల్లనిది.
6. మండూకము.
7. కోతి.
9. శాఖ.
10. ఇటువంటి !
11. క్రిందనుంచి అయితే మునలితనము.
13. పాత కప్పలో మీరు—ఎవరైనా సరే !
15. కలతలు ! తిరుగక మన కనుమలలో చూడండి!
16. నెమలి చకితములో సందేహమా ?
17. భోజనము.
19. ఎల్ల.
21. శుభసూచక నిమిత్తము, పక్షి !
24. చెవి.
27. బిడ్డ తగ్గించినా బిడ్డే !
28. గాడి.
29. సుత్తితో కొట్టి దింపండి !
31 స్తుతి.
33. "—, —, దీపావళి," కాని తల్లక్రిందులు.
34. బాడుగ బొంబులలో గౌరవనీయుడు.
36. నక్షత్రం.
37. జేబులు తడుముకున్నవారిలో ఐయించినవాడు!
39. క్రిందనుంచి సర్పము ! ★

80-వ గళ్లనుడికట్టుకు జవాబు



గ్రుడ్డివాడు :- సార్, గ్రుడ్డివాడ్ని. ఒక అణా ఇప్పించండి.

పెద్దమనిషి :- గ్రుడ్డివాడ వేంటోయ్? ఒక కన్నుందిగా?

గ్రుడ్డివాడు:- ఐతే, అర్థణాన్న ఇప్పించండి సార్.

మాదల నిత్యానందం, (పుదిపట్ల)

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ప్రకటనలు
మీ వ్యాపారాభివృద్ధికి తోడ్పడుతాయి

యువ ప్రపంచం

ఆధునిక ప్రపంచంలో మార్పు అతిత్వరగా జరుగుతున్నదంటారు. మన దేశంలో రావలసి ఉన్నంత మార్పు ఇంతా అంతా కాదు. అన్నిరంగాలలోనూ సంస్కరణ, అభివృద్ధి అవసరమని చాలా మంది ఒప్పుకుంటూనే ఉన్నారు.

పాశ్చాత్య నాగరకత ప్రభావం, స్వాతంత్ర్యం మార్పును త్వరపెడుతున్నాయనటంలో అతిశయోక్తి లేదు. కాని, కొత్త కేవలం వింత, అనేవారు ఎప్పుడూ ఉంటారు. మార్పును ఎదిరించేగుణం, ఎక్కువగానో, తక్కువగానో అందరిలోనూ ఉంటుంది. 'సంప్రదాయం, మార్పుకు విరోధి' అనటం లోకసామాన్యం అయిపోయింది. సంప్రదాయం బలంగాఉన్న మన సమాజంలో ఈ 'విరోధం' యొక్క ప్రభావం యువజనంమీద ఎక్కువగా ఉంటుందనటం కూడా లోకసామాన్యమయిపోయింది. వారికి ఎన్నో సమస్యలు ఏర్పడుతాయి. ఇవి పరిష్కారమవాలంటే కనీసం చర్చఅయినా అవసరం.

ఈశీర్షిక ముఖ్యోద్దేశం ఇదే. 'యువప్రపంచా'నికి ఇదొక చర్చావేదికగా ఉపయోగపడాలనుకుంటున్నాము.

మరొక విషయంగమనించతగ్గది. మన దేశంలో ఏ సిద్ధాంతమయినా సరే వెంటనే చలామణిలోకి వచ్చేస్తుంది కాని, ఆచరణ మాత్రం జరగదు! ప్రధానమంత్రి ఈవిషయాన్నే ఒకసారి వివరంగా చర్చించారు: 'మనస్సు' 'కర్మ' రెండుగా విడిపోవటం భారత దేశంలో స్పష్టంగా చూడవచ్చునన్నారు. ఒకటి నమ్ముతూన్నట్లు చెప్తూ, దానికి వ్యతిరేకమయిన దానిని చేయటంకన్నా హేయకరమైనది మరొకటి లేదనిపిస్తుంది!

ఆంధ్ర సచిత్రవారపత్రిక పాఠకులలో యువతులు యువకులు—విద్యార్థులు, విద్యార్థినులు!—నిర్మొగమాటంగా వివిధ విషయాలపైన, సమస్యలనుగురించి తమ రచనలను ఈ శీర్షికకు పంపుతారని ఆశిస్తున్నాము. రచనలమీదచర్చ (లు)విరివిగా జరుగు (తాయ)తుందనికూడా ఆశిస్తున్నాము.

రచనలు వీలైనంతవరకూ, ఆంధ్ర సచిత్ర వారపత్రికలో రెండు 'కాలంలు' మించకూడదు. వీలైనంతవరకూ 'సాధింపు' వదిలివేస్తారని నమ్ముతున్నాము!

రచనలేకాక యువచిత్రకారులు, శిల్పులు తమ చిత్రాల, శిల్పాల ఫోటోలు పంపితే వీలునుబట్టి ప్రచురిస్తాము. అయితే చాలా పత్రికలలోని అభిసారికలు, 'నిరీక్షణలు', మాతృమూర్తులు, ముగ్ధలు పంపరని ఆశించవలసి వస్తోంది!

కవరుపైన 'యువప్రపంచం' శీర్షికకు అని స్పష్టంగా వ్రాయాలి.

[ఈ శీర్షికకు చక్కటి 'డిజైన్' వేసి ఇచ్చిన (యువ) చిత్రకారులు శ్రీ బాపు గారికి కృతజ్ఞత తెలుపుచున్నాము.]

తక్కువ తిన్నదెవరు?

ఒక చిన్న పల్లెటూర్లో ఎలిమెంటరీ స్కూలు వుంది. పరీక్షాధికారి వచ్చి పిల్లల్ని పరీక్ష చేస్తున్నాడు.

"రామాయణం ఎవరు వ్రాశారబ్బాయ్" అని ఒక కుర్రవాడిని ప్రశ్నించారు.

ఆ కుర్రవాడు భయంతో వణుకుతూ "నేను కాదండి" అన్నాడు. అప్పుడు అధికారి ఉపాధ్యాయునితో "ఏమిటండీ యిలా అంటున్నాడు" అన్నారు.

"చిత్తం! ఈ వెధవేనండి. ఈ మధ్య నెల్లాళ్లు జబ్బు పడ్డాడు. మీ దగ్గర భయంచేత చెప్పకుండా వున్నాడు" అన్నాడు మాష్టరు.

ఇన్‌స్పెక్టరు గారు ఆశ్చర్యపడుతూ ప్రక్కనేవున్న ప్రధానోపాధ్యాయుణ్ణి చూస్తూ "వీళ్లు యిలా అంటున్నారేమిట"ని ప్రశ్నించారు.

ప్రధానోపాధ్యాయుడు చేతులు నలుపుతూ "చిత్తం చిత్తం రామాయణం తమరే వ్రాసినట్టు వీళ్లకు తెలియదండి" అన్నాడు వినయంగా.

ఇన్‌స్పెక్టరు మండిపడుతూ కుర్చీలోంచి లేచి "ఏం మాష్టర్లండీ" రామాయణం రాముడు వ్రాశాడని, భారతం భరతుడు వ్రాశాడని మీకైనా తెలియక పోతే ఎందుకండీ ఉద్యోగాలు అన్నారు.

యం. గోపాలరావు (గంగాడ)

పొట్టికథలు

బొంబాయి ఆంధ్ర మహాసభ వారు జరిపిన పోటీలో మొదటి బహుమతి కథ, పోయిన సంచికలో ప్రచురించాము. పై వారం రెండవ బహుమతి పొందిన శ్రీ 'వాసంతి'గారి కథ 'ఆదర్శ జీవులు' ప్రచురిస్తున్నాము.

లాభము

లెక్కలు మేష్టారు లాభ నష్టాలు లెక్కలు చేస్తూ "ఎక్స్" విలువ సున్నా అంటే లాభము లేదు అని చెప్పాడు.

వెనుకనుండి ఆవులిస్తూ "ఇంతసేపు చేసికూడ లాభము లేదన్నమాట" అని వినిపించింది.

మాదన నిత్యానందం, (వుదిపట్ల)

అదీ పోతుంది

రోగి:- డాక్టరుగారూ, వళ్ళంత నొప్పులండి......

డాక్టరు:-(పరధ్యానంతో) పోతుంది.

రో:- చేతులు, కాళ్ళు పీక్కుపోతున్నాయ్యండి.

డా॥:- పోతుందయ్యా.

రో:- ప్రాణం........

డా॥ :- అదీ పోతుంది.

సాధన (హైదరాబాదు)

* * *

భార్య:- (కోపము చల్లారిన తరువాత) చీపురు ఎక్కడుందండీ!

భర్త:- ఇప్పుడే నన్ను కొట్టావుగా ఎక్కడేశావో!

కొమార్డు:- నా దగ్గర ఉందమ్మా!

భార్య:- ఎందుకు తీసుకెళ్లావురా!

కొమార్డు:- ఇందులో విరిగి పోయిన పుల్లలుతీసివేసి, మంచి పుల్లలు కడ్తున్నానమ్మా!

భర్త:- ఇంకొక్కసారికైనా పనికొస్తుందా!

కొమార్డు:- చిన్న దెబ్బలకు పనికి వస్తుందిలే!

ఎస్. ఎమ్. బాదుషా (గురువాజిపేట)

సరికొత్త శీర్షికకు
63వ పేజీ చూడండి

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press 6 & 7 Thambuchetty Street, Madras-1, Chief Editor: S. Sambhu Prasad.



'సాక్షి'

ఫొటో: శ్రీమతి వై. సావిత్రి (హనుమకొండ)